# ప్రజాసాహితి


సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

ISSN 0971-278X

ఏప్రియల్ 2021

సంచిక : 440

వెల : 25/-



జనసాహితి ప్రచురణ

పాట

# ఉద్యమాలలో పండిన ఉక్కు !!

– దివికుమార్

తెలుగు ప్రజలదీ విశాఖ ఉక్కు
ప్రభుతకు లేదుర అమ్మే హక్కు
కదను తొక్కరా తూరుపు దిక్కు
పోరినప్పుడే మనకది దక్కు

చెమట చుక్కలే చరచర మండగ
నెత్తుటి ధారలు ఇంధనమవ్వగ
దుక్క ఇనుము బహు చక్కగ మరిగి
కష్టాల కొలిమిలో కరిగిన ఉక్కు
నిక్కమైన శ్రమ జీవుల హక్కు
ఎవడికి లేదుర అమ్మే హక్కు

ఎవడికి లేదుర అమ్మే హక్కు
శ్రమకు పండిన విశాఖ ఉక్కు

ఇస్కో అనగనే
పోస్కో కిస్తిరి
ఘన గనులేమో 'గాలి'కి వదిలిరి
విశాఖ వినతులు
విసిరి కొడితిరి
సొంత గనులు మాకివ్వకపోతిరి
మీకెక్కడిదిర అమ్మే హక్కు
ప్రజలందరిదిర విశాఖ ఉక్కు!!

పొలాలు దున్నే నాగలి కర్రు
రైతు చేతిలో గొడ్డలి, గొర్రు
పారా, పలుగు, బండి ఇరుసులు
ఉక్కు కార్మికుల కష్ట ఫలమురా
కార్మిక కర్షక పోరు బలిమిరా
శ్రమ హక్కయ్యెర విశాఖ ఉక్కు

శ్రమ హక్కయ్యెర విశాఖ ఉక్కు
ప్రభుతకు లేదుర అమ్మే హక్కు !!

ఎవడత్త సొమ్మురా దానం చేయగ
ప్రజల సంపదను ప్రైవేటోళ్లకి
కట్టిపెట్టరా దళారి కుట్రలు
దోపిడీ దొంగల ద్రోహ బుద్ధులు
మీకెక్కడిదిర అమ్మే హక్కు
శ్రామికులందరి విశాఖ ఉక్కు!!

కణ కణ ఎర్రని
ఎగసిన సెగలలో
కళ పెళ మరగగ మెరుపుల మంటలో
చిరచిర కరగగ
బిరబిర పరగగ
దుక్క ఇనుము ఘన ఉక్కుగ మారెను

దుక్క ఇనుము ఘన ఉక్కుగ మారెను
కాకలు తీరిన శ్రమ చేతులలో!!

పోరు బలమురా విశాఖ ఉక్కు
త్యాగా..ల ఫలమురా విశాఖ ఉక్కు
విద్యార్థి యువకుల పిడికిలి ఉక్కు
ఉద్యమాలలో
పండిన ఉక్కు
తెలుగు బిడ్డ సంకల్పమె ఉక్కు
మీకెక్కడిదిర
అమ్మే హక్కు

మీకెక్కడిదిర
అమ్మే హక్కు
ప్రజలందరిదిర
విశాఖ ఉక్కు!!

(అందరూ...)

కదను తొక్కరా తూరుపు దిక్కు
పోరినప్పుడే మనకది దక్కు!!
పోరినప్పుడే మనకది దక్కు!!

జనసాహితి ప్రచురణ

44 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 44
సంచిక : 09
ఏప్రియల్ 2021

440

www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ❏ ముఖచిత్రం | : | అంతర్జాలం నుండి | | ..... 01 |
| ❏ రెండవ అట్ట | : | ఉద్యమాలలో పండిన ఉక్కు!! (పాట) – దివికుమార్ | | ..... 02 |
| ❏ మూడవ అట్ట | : | పాండిత్య ప్రశంస (కవిత) – బెర్టోల్డ్ బ్రెఖ్ట్; ఎర్రెర్రని కెరటాలై (కవిత) – మౌళి | | ..... 35 |
| ❏ నాల్గవ అట్ట | : | చిత్రకారుడు – ఆనంద్ | | ..... 36 |
| ❏ సంపాదకీయం | : | ఢిల్లీ రైతుల స్ఫూర్తిగా... విశాఖ ఉక్కు సాక్షిగా!! | | ..... 05 |
| ❏ కథలు | : | సాలె గూడు | – సత్యభాస్కర్ | ..... 06 |
| | | బతుకు దోవ | – ఓ.వీ.వీ.యస్. లక్ష్మీకుమారి | ..... 25 |
| ❏ అంతర్మథనం | : | వర్గాలు బలంగా ఉన్న మన దేశంలో.... | – ప్రొ॥ తోట జ్యోతిరాణి | ..... 09 |
| ❏ పుస్తక పరిచయం | : | అలిశెట్టి కవిత్వం ప్రాసంగికత | – బూర్ల వెంకటేశ్వరావు | ..... 14 |
| ❏ గల్పిక | : | రేటు + వేటు = ప్రైవేటు | – శంకరం | ..... 19 |
| ❏ సినిమా సమీక్ష | : | ద స్టోనింగ్ ఆఫ్ సొరాయా ఎమ్. | – బాలాజీ (కోల్‌కతా) | ..... 22 |
| ❏ బాలసాహితి | : | సిమ్మ ప్రశాంతి, గోళ్ళ సంతోష్, చందు నాగేశ్వరరావు | | ..... 17 |
| ❏ కవితలు | : | వంగర లక్ష్మీకాంత్ (**08**), ఈతకోట సుబ్బారావు (**11**), కొత్తపల్లి రవిబాబు (**12**), అగ్నిశిఖ (**15**), భుజంగరావు కంచరాన (**16**), విరియాల గౌతమ్ (**29**) | | |
| ❏ పాట | : | కన్నీటి పాట | – గోసల నారాయణస్వామి | ..... 29 |
| ❏ ఈ నెల పుస్తకం | : | 'కులవ్యవస్థ – శాస్త్రీయ అవగాహన' | | ..... 32 |
| ❏ వివిధ | : | అమ్మకథ, ఔరంగబాద్ బెంచి అద్భుతమైన తీర్పు (**18**)<br>జీవన సాఫల్య పురస్కారం తిరస్కరించిన మరాఠీ రచయిత యశ్వంత మనోహర్ (**28**)<br>నిరసనలూ – మార్షల్ లా (**30**);<br>డా॥ నవాల్ ఎల్. సాద్వి మరణం, ఏడున్నర గంటల నాటక ప్రదర్శనగా 'పర్వ' (**31**);<br>ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి (**32**); చైతన్యవాహిని (**33**); ఈ పుస్తకాలు అందాయి (**34**) | | |
| ❏ శాశ్వతనిధి | : | చీడిపూడి వేమమ్మ, సాంబిరెడ్డి (**04**) | | |
| ❏ సంతాపాలు | : | జి. మోహనరావు (**04**), అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి (**24**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
**30-7-6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**
ఫోన్ : **7075957010** prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – **532001**
ఫోన్ : **9441913829** prajasahithi1977@gmail.com

‘ప్రజాసాహితి’
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
“అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై *‘ప్రజాసాహితి, విజయవాడ’* అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
**1/4 డెమ్మీ పరిమాణం**

రెండవ, మూడవ అట్ట మల్టీకలర్

| | |
|---|---|
| | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

## చీడిపూడి సాంబిరెడ్డిగారి 5వ వర్ధంతి



**చీడిపూడి** వేమమ్మ, సాంబిరెడ్డిగార్లది ప్రజాసాహితిని అభిమానించే కుటుంబం. వీరిది గుంటూరుజిల్లా నూతక్కి గ్రామం. వేమమ్మగారు 8-12-1999న రోడ్డు ప్రమాదంలో తన 50వ ఏట మరణించగా, 23-4-2016న సాంబిరెడ్డిగారు 75వ ఏట అనారోగ్యంతో మరణించారు. 2003లో రూ. 40వేలు ‘ప్రజాసాహితి’ శాశ్వతనిధికి అందించిన వారి కుటుంబసభ్యులు సాంబిరెడ్డిగారి మొదటి వర్ధంతి సందర్భంగా మరొక 25 వేల రూపాయలు అందించారు. చీడిపూడి వేమమ్మ, సాంబిరెడ్డిగార్లను జ్ఞాపకం చేసుకుంటున్నాం.

ప్రజాసాహితి

## ‘ఖాకీ బతుకులు’ మోహనరావు మృతి



**‘ఖాకీ బతుకులు’** నవల ద్వారా పోలీస్ వ్యవస్థనూ, పోలీస్ వ్యవస్థలోని దళితుల బానిసత్వ జీవితాల గురించి రాసిన జి. మోహనరావు తన 69వ ఏట 21 మార్చి 2021న తెనాలిలో మరణించారు.

మోహనరావు కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ సాహిత్య అధ్యయనం ద్వారా పొందిన సామాజిక చైతన్యంతో స్పార్టకస్ పేరుతో రచనలు చేశారు. మార్క్సిజాన్ని అధ్యయనం చేసి రంగనాయకమ్మ రచనాశైలిలో రచనలు చేశారు. ‘ఖాకీ బతుకులు’ నవలతో తెలుగు సాహిత్యలోకంలోకి ప్రవేశించారు. ఈ నవల రాసినందుకు ఉద్యోగంలో ఒత్తిడులను, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ దశాబ్దంపైగా పోరాటం చేశారు. అమెరికాలోని సాహితీమిత్రుల సహాయ సహకారాలతో ‘ఖాకీ బ్రతుకులు’ రెండవ ముద్రణ పొందింది. ‘ప్రజాసాహితి’కి సన్నిహితులైన మోహనరావు మరణానికి సంతాపం ప్రకటిస్తున్నాం. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాం. ✸

## సంపాదకీయం

# ఢిల్లీ రైతుల స్ఫూర్తిగా.... విశాఖ ఉక్కు సాక్షిగా !!

**"మత** కలహాల మారణహోమాల మధ్య
అర్ధరాత్రి ఆవిర్భవించిన స్వాతంత్ర్యం –
అవినీతిని భారీ పరిశ్రమ చేసింది!
ఆకలికి సార్వభౌమాధికారం ఇచ్చింది.
ధనస్వామ్యానికి ప్రజాస్వామ్యం అని పేరు పెట్టి
పేదవాళ్ళని మరింత పేదలను చేసింది!!!"

ఈ శ్రీశ్రీ మాటల సారాన్ని నేడు రైతాంగం దేశం నడిబొడ్డున గొంతుచించుకొని చాటుతూంది. ఆకలిచావులూ, దళితులపై దహనాలు, హననాలు, ఆడబిడ్డల ఆక్రందనలూ, హాహాకారాలూ; తగలబడిపోతున్న యువతరం శక్తి సామర్థ్యాలూ; నిరుద్యోగమే కాదు ఉపాధి కోల్పోతున్న సంఘటిత, అసంఘటిత రంగాల చిరుద్యోగులూ, విద్యాధికులూ; కాలరాయబడుతున్న పిల్లల లేత చిరునవ్వులూ – దేశం దేశమంతా ఎటు చూసినా నిలువునా దవానలంలా తగలబడిపోతున్న దృశ్యమే!!

యుద్ధాలిప్పుడు భూమ్మీదో, ఆకాశం మీదో జరగటంలేదు. "దిష్టిబొమ్మ"లాంటి రాజ్యం ద్వారానే, రాజ్యాంగం సాక్షిగానే "సంపదల మీద సహజవనరుల మీద మనిషి ఆలోచనల మీద, బలహీనతల మీద" కార్పొరేట్ యుద్ధాలిప్పుడు తెగబడుతున్నాయి.

అటు ఢిల్లీ నడిబొడ్డున భారత రైతాంగం మూడు రైతాంగ నల్ల చట్టాలకి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ పాలకులకు తమ ఆందోళనలతో సవాల్ విసురుతూంది. ఇటు విశాఖలో దేశ కర్మవీరుడు ఉక్కు సంకల్పంతో ఉద్యమిస్తున్నాడు. దిక్కులన్నీ పిక్కటిల్లేలా ఉక్కు పిడికిలి ఉరిమి చూస్తోంది. కొలిమిలో కరిగిన ఇనుప లావా కార్మికుల కండలతో గట్టిపడిన ఉక్కు ఉప్పెనలా ఎగసిపడుతూంది. నిరుద్యోగానికి తోడు ఉద్యోగాల్ని కోల్పోయే పరిస్థితిలో ప్రజాసమూహం చావు బతుకుల మధ్య తెగబడేందుకు పాలకుల నిర్ణయాలు దారితీస్తున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలు మరిక ఉండవని దేశ ప్రధాని తెగేసి చెప్పేస్తూ తాంబూలాలిచ్చేశాను – తన్నుకు చావండి అన్నట్లు వ్యవహరిస్తున్నాడు. ప్రభుత్వరంగ శాఖల్లో రిక్రూట్‌మెంట్‌ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసేశాడు. మరోప్రక్క బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో కార్మిక చట్టాల్ని రద్దు చేసేశారు. పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచేశారు. అదనపు పని గంటలకు వేతనాలేవీ ఉండవని తెగించి చెప్తున్నారు. ఇక పనిగంటలు నిర్ణయించే అధికారం యాజమాన్యాలదే అని శాసిస్తున్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ, యాజమాన్యం ఇష్టమొచ్చినప్పుడు పనిలోంచి తొలగించేందుకు దారులు విశాలం చేశారు. కార్మికుల్ని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు లైసెన్సులు అవసరం లేదని కూడా అంటున్నారు.

1989 నుండి 2019 వరకు ప్రభుత్వరంగ సంస్థల లాభనష్టాల పట్టిక చూస్తే, దేశాన్ని ఏ పార్టీ పరిపాలిస్తున్నాసరే పాలకులు అమలు చేస్తున్న విధానాలు మాత్రం ఒక్కటే. పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను గుత్త పెట్టుబడిదార్లకు – విదేశీ బహుళజాతి సంస్థలకూ నిస్సిగ్గుగా ధారాదత్తం చేసేందుకు సిద్ధపడుతున్నారన్న వాస్తవం స్పష్టమవుతుంది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నష్టాల్లో ఉందని చూపిస్తూ, 32,000 కోట్లు రూపాయలకి కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి బేరం పెట్టింది. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వున్న 20 వేల ఎకరాల భూమి విలువే 2 లక్షల కోట్లు వుంటుంది. అటువంటి కంపెనీని ప్రైవేటు సంస్థలకు అమ్మటం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికులనూ, సేవారంగంలో ఉద్యోగులనూ, సరుకు రవాణా వ్యవస్థలకు సంబంధించి లక్షలాది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి వున్న వారినంతా నడిరోడ్డు మీదకు నెడుతున్నది. అస్మదీయులైన గుత్త పెట్టుబడిదారులకు విశాఖ ఉక్కును కారుచౌకగా కట్టబెట్టడానికి రంగం సిద్ధం చేసింది. ఆ విధంగా మన దేశ వనరులను, సహజ సంపదలను పెట్టుబడిదారుల, పరోక్షంగా సామ్రాజ్యవాదుల అధీనంలోకి ఈ దళారీ పాలకులు తరలిస్తున్నారు.

నిజానికి మన దేశ గుత్త పెట్టుబడిదారులు అసలు సిసలు జాతీయ ప్రయోజనాలకూ, దేశ అభివృద్ధికి కట్టుబడి లేరు. వారు కనీసపాటి జాతీయ బూర్జువా విలువలకు కూడా తిలోదకాలిచ్చేశారు. వారు పేరుకు మాత్రమే పెట్టుబడిదారులు. ఆ పెట్టుబడుల వెనుక వున్న 50%కి మించిన వాటాలు సామ్రాజ్యవాద దేశాలవే. "బహుళజాతి" ఆడుతున్న డాలర్ ఆటలో భారత్ పెట్టుబడిదారులు పావులుగా ఉపయోగపడుతున్నారు.

ఈ దళారీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగ పన్ను రాయితీలు ఇచ్చిన వైనం పరిశీలిస్తే.... 2015–16 ఆర్థిక సంవత్సరం నుండి 2019–20 వరకూ లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వీరికి ధారపోసారు. విశాఖ ఉక్కు అప్పులు 21 వేల కోట్లుగా వుందని చెబుతున్న ప్రభుత్వమే ఈ 9 నెలల కాలంలో కార్పొరేట్ శక్తులు ఎగ్గొట్టిన అప్పులు 1 లక్షా 20 వేల కోట్లను అలవోకగా మాఫీ చేసేసింది.


ఈ సామాజిక అంశాలపై ప్రజల్ని చైతన్యపరుస్తున్నందుకే నేటి 75 ఏళ్ళ స్వాహాతంత్ర్యం మేధావుల్నీ, ప్రశ్నించేవాళ్ళనీ దేశ ద్రోహులుగా ముద్రవేసి గొంతులు నొక్కుతూంది. ఆ 124(ఏ) దేశద్రోహ చట్టం ఏనాడో బ్రిటన్‌లో రద్దయినా పెద్ద ప్రజాస్వామ్య దేశమని రొమ్మువిరుస్తున్న మన దేశంలో ఇప్పటికీ అది తాజాగా అమలులో వుండటం సిగ్గుచేటు.

ఈ పరిస్థితుల్లో కవుల భావజాల శక్తిని భౌతికశక్తిగా మారుద్దాం. ప్రజాతంత్ర ఉద్యమాలని ప్రజా కళాకారులం – రచయితలం అక్షరాలుగా మలుద్దాం! అక్షరానికీ – అడుగులకీ సమన్వయం పెంచుదాం! నేటి ఢిల్లీ రైతాంగపు ఉద్యమ స్ఫూర్తిని, విశాఖ ఉక్కు ఉద్యమ చైతన్యాన్ని పతాకగా చేబూని ముందుకు సాగుదాం!!

**24-3-2021** ✸

కథ

# సాలె గూడు



- సత్య భాస్కర్

**ఆదివారం**

రాత్రంతా టివిలో కార్యక్రమాలు చూసి ఆలస్యం కావడంతో పొద్దునే మెలకువ రాలేదు. అలా మొద్దు నిద్ర పోతున్న రాఘవను వాళ్ళావిడ కుదుపుతూ లేవమని పోరు పెడుతోంది. మెలకువ వచ్చి కళ్లు తెరిచాడు రాఘవ. ఎదురుగా శ్రీమతి.

"ఒకసారి లేవండి! మీతో పనుంది. అవసరమైతే మళ్లీ పడుకుందురుగానీ!" అని అంటోంది.

"ఆదివారమేగా! అంత కొంపమునిగే పనేముంది! కొద్దిగాగి లేస్తాలే!" అని మరోవైపు ఒత్తిగిల్లి పడుకోబోయాడు. కానీ వేషాలు కుదురలేదు. ఆవిడ పట్టు వీడలేదు.

"ఓసారి లేవండి! టివి ఆగిపోయింది. రీఛార్జ్ చేసి మళ్లీ పడుకోండి! "అని బతిమిలాడు తున్నట్టుగా మాట్లాడుతూ భుజాన్ని పట్టుకుని కుదుపుతూనే వుంది. ఇది వదిలే వ్యవహారం కాదని అర్థమయింది. అందులోనూ ఆదివారం టివి రాకపోతే ఏమైనా వుందా! లేవక తప్పదు. విసుక్కుంటూనే లేచాడు.

ఆవులించుకుంటూ హాలులోకి వచ్చి టివి ముందున్న సోఫాలో కూలపడ్డాడు. పిల్లలిద్దరూ నిద్ర లేచినట్టు లేదు. ఇల్లంతా ప్రశాంతంగా వుంది. ఇలాంటి సమయంలోనే ఆవిడ ముందుగా లేచి టివిలో భక్తి ఛానల్ పెట్టి పనులు చేసుకుంటూ వుంటుంది. అలాంటి ఇంపార్టెంట్ సమయంలో రీఛార్జ్ చేయనందుకు ప్రసారం చేయనని ఛానల్ వాడు మొరాయించి కూర్చున్నాడు.

"అప్పుడే నెలయిపోయిందా! వీడేదో వేషాలేస్తున్నాడు.. పోయి నా పర్సు తీసుకురా.. డెబిట్ కార్డు దానిలోనే వుంది." అని అన్నాడు రాఘవ! అప్పటికే ఆవిడ బెడ్ రూంలోంచి పర్సు తీసుకు వస్తోంది.

టీపాయ్ మీద వున్న సెల్‌ఫోన్‌ను చేతిలో తీసుకుని ఆ ఛానెల్ వెబ్‌సైట్‌ను గూగుల్‌లో తెరిచాడు. ఆ తర్వాత తాను ప్రతి నెలా వేసే రు. 249 మంత్లీ ప్యాకేజీని సెలెక్ట్ చేసాడు. పేమెంట్ ఆప్షన్‌లో వెళ్లి డెబిట్ కార్డు ఎంచుకున్నాడు. పర్సులో నుండి డెబిట్ కార్డును తీసి నెంబర్, ఎక్స్పైరీ డేట్ ఇయర్ ఎంటర్‌చేసి, కార్డును వెనక్కి తిప్పి చూసి సివివి నెంబర్ ఎంటర్ చేసాడు. కొద్ది సెకండ్లలోనే ఓటిపిని ఎంటర్ చేయమని అడిగింది. అదే క్షణంలో సెల్‌కు ఓటిపి వచ్చింది. దాన్ని ఎంటర్ చేయడం., సెకన్లలోనే రీఛార్జ్ అయింది, కంగ్రాచ్యులేషన్స్ అనే మెసేజి వచ్చేసాయి. అదే సమయంలో టివిలో "గోవింద హరి గోవింద" అని గీతం తారాస్థాయిలో అందుకుంది. మళ్లీ టివి మొదలయినందుకు ఆవిడ సంతోషంగా ఆ భజన గీతంతో గొంతు కలుపుతూ, స్వామి వారికి రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి మైమరిచిపోయింది.

తన పనయిపోయిందని సెల్‌ఫోన్‌ను టీపాయ్ మీద పెట్టబోతున్న రాఘవ, బ్యాంకు నుండి వచ్చిన ఎకౌంట్ బ్యాలన్స్ మెసేజ్ చూసి అదిరిపోయాడు. నిద్ర మత్తంతా ఎగిరిపోయి షాక్ కొట్టినట్టు సోఫాలో కొయ్యబారిపోయాడు. కళ్లునులుముకుని ఆ మెసేజ్‌ను మళ్లీ ఓసారి చూశాడు. సందేహం లేదు.

"ముందు ఆ వెధవ టీవీని ఆపు" అని ఓ అరుపు అరిచాడు.

ఊహించని రీతిలో భర్త ఆ విధంగా అరిచేసరికి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి

"ఏమైందండీ" అని ఆందోళనగా అడిగింది. అప్పటి దాకా నిద్ర లేపినందుకు గొణుగుతున్న ఆయన, పిచ్చి చూపులు చూస్తూ సోఫాలో కనబడ్డాడు. వెనక టివిలో గోవిందా.. గోవిందాని పాట వస్తూనే వుంది.

ఏమీ బదులివ్వకుండానే" ముందా రిమోట్‌లు ఇలా ఇవ్వు" అని అరిచాడు. ఆవిడ అయోమయంగా చూస్తూ టివి దగ్గరకు వెళ్ళి రిమోట్‌లను తీసుకుని వచ్చి చేతికి ఇచ్చింది.

టీవి ముందునుండి పక్కకు జరగమని సైగ చేస్తూ టీవిలో వస్తున్న ఛానెల్ మార్చేసి ఎకౌంట్ బ్యాలన్స్ బాక్స్‌ను ఓపెన్ చేసి దాన్నే నిలువుగుడ్లేసి చూస్తుండి పోయాడు.

శ్యామల కూడా ఏమి జరిగిందో అర్థం చేసుకోవడానికి తానూ టీవీ స్క్రీన్ చూడసాగింది. ఏమైందో అర్థం కాక వుండబట్టుకోలేక "అంత ఖంగారు పడుతున్నారెందుకండీ! ప్రతినెలా డబ్బులు వేస్తూనే వున్నారుగా! కొత్తేముంది." అని అంది.

భార్యను కోపంగా చూస్తూ "ఏమి జరిగిందో ఆ స్క్రీన్ మీద కనబడటంలా! ఎంత ఎమౌంట్ కట్టయ్యాయో చూడు!" అని అన్నాడు రాఘవ. అప్పుడు ఎకౌంట్ బ్యాలన్స్‌ను పరీక్షగా చూసిన శ్యామల" ఆ! "అని నోరెళ్ళబెట్టేసింది. రు. 24,900 రీఛార్జ్ చేసినట్లు, తదుపరి రీఛార్జ్ 2025 సంవత్సరంలో వున్నట్లు చూపిస్తోంది.

"అయ్యయ్యో.. అదేంటండీ! మనం కట్టేది 249 గదా! అంత డబ్బు ఎలా పోయింది" అని గోల గోల పెట్టేసింది.

"అర్థం అయిందా లేదా! మనం 249 రీఛార్జ్ చేస్తే మన అకౌంట్‌లోనుండి 24,900లు వెళ్లి పోయాయి. 2025 వరకు రీఛార్జ్ చేశామని చూపిస్తోంది. మన కొంప మునిగింది. ఐదేళ్ల పాటు రీఛార్జ్ చేయడానికి మనకేం సరదా!" అని తల పట్టుకున్నాడు రాఘవ. నిద్ర మధ్యలో లేవడంతో మొహమంతా జిడ్డుగా వుంది. అనుకోని షాక్ తగలడంతో మరింత జేవురించి పోయింది.

మొగుడు డీలా పడ్డాడని గ్రహించిన శ్యామల ధైర్యం చెప్పాలనుకొని

"తప్పంతా నాదేనండి. నిద్ర సరిపోలేదు పడుకుంటానని మీరంటున్నా వినకుండా లేపేసి రీఛార్జ్ చేయమని పట్టుబట్టాను. ఆ నిద్ర మబ్బులో ఏం నొక్కారో ఏమో! డబ్బులన్నీ ఎగిరిపోయాయి." అని ఏడుపు గొంతుతో అంది.

"కొత్తగా నొక్కింది ఏమీ లేదే! ప్రతి నెలా వేస్తుందే గదా! ఏదో జరిగింది. గుడ్డిలో మెల్ల ఏమిటంటే మన డబ్బులు ఆ ఛానెల్ వాడికే పోయాయి. ఎట్లాగో అట్ల వసూలు చేసుకోవాలి.

అదే ఏ సైబర్ క్రిమినల్ చేతిలో పడితేనా ఆశ వదులుకోవాల్సిందే! "అని అన్నాడు. షాక్ నుండి తేరుకుని బుర్ర పనిచేయసాగింది. అందుకే అలాంటి మాటలు వచ్చాయి.

"ఇప్పుడు ఎవరిని అడుగుతారండి. మీరే అనవసరంగా లోకల్ కేబుల్ వాడిని మాన్పించేసారు. వాడైతే ప్రతి నెలా ఇంటికి వచ్చి పైసలు కట్టించుకునేవాడు. ఛానెల్స్ సరిగ్గా ఇవ్వడం లేదని ఈ డిష్ పెట్టించారు. వాడినే వుండనిస్తే మనతోబాటు వాడూ బతికే వాడుగా!" అని జాడించింది. దాంతో మిగిలిన నిద్ర మత్తు కూడా వదిలింది.

"అవన్నీ వదిలేయవే! ముందు టీ పెట్టు. మొహం కడుక్కుని వస్తా." అని అంటూనే లేచి బాత్రూంలో దూరాడు. ఆవిడ వంటింట్లోకి నడిచింది.

★ ★ ★ ★ ★

గొంతులో టీ పడుతుంటే మనసు స్థిమిత పడసాగింది. జరిగిన తప్పుకు పరిష్కారం ఏమిటాని ఆలోచించి సాగాడు. శ్యామల అన్నది కరెక్టే! ఇంతకు ముందు ఏదైనా ప్రాబ్లెమ్ వస్తే కేబుల్ ఆపరేటర్‌కు ఫోన్ చేస్తే ముందో వెనకో వచ్చి చూసేవాడు. నెలనెలా పైసలు కట్టించు కునేవాడు. ఆ కేబుల్ టివికి యజమానో లేక ఆపరేటరో మన కళ్ల ముందు కనబడేవాడు. ఈ డిష్ చానెల్‌కు డబ్బులు కడుతున్నా వాటిని పొందే యజమాని మన జీవితంలో మనకు కనబడదు. ఆయన ఏ దేశంలో వుంటాడో తెలీదు. వార్తల్లోనే అప్పుడప్పుడు ఫలానా డిష్ ఛానెల్ యజమాని దేశంలోనే అతిపెద్ద సంపన్నుడని వస్తుంటుంది. మనం నెలనెలా కట్టే డబ్బులతోనే అంత సంపాదిస్తున్నాడా!

"ఏమి ఆలోచించారండీ!" అని చేతిలో గరిటతోనే శ్రీమతి రంగ ప్రవేశం చేయడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు రాఘవ. చేతిలోని టీ కప్పును ఎదురుగా వున్న టీపాయ్ మీద పెడుతూ

"నా సెల్ అందుకో! కస్టమర్ కేర్‌కు ఫోన్ చేద్దాం." అని అన్నాడు రాఘవ.

"మీ ఎదురుగా వున్న టీ పాయ్ కిందే వుంది. నేను పోతున్నా నాకు స్టౌ మీద పోపు వేగుతోంది." అని అంటూ వంటింట్లోకి వెళ్లి పోయింది.

సెల్‌లో కస్టమర్ కేర్ నెంబర్ వెదికి ఆన్ చేసాడు. ఒకటి నొక్కండి, రెండు నొక్కండి అంటూ కాసేపు సహనాన్ని పరీక్షించాక కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ మీతో మాట్లాడతాడు వేచివుండండి అనే సందేశం వచ్చింది. హమ్మయ్య మాట్లాడడానికి ఓ మనిషి దొరికాడనుకున్నాడు రాఘవ!

కాసేపు టింగ్... టింగ్.. టింగ్ మంటూ మ్యూజిక్ వచ్చింది. అలాగే ఓపిగ్గా ఫోన్ పట్టుకుని కూర్చున్నాడు. క్షమించడి కోవిడ్ కారణంగా 50% స్టాఫ్ తోనే పనిచేస్తున్నందు వలన మీ కాల్ అటెండ్ చేయలేక పోతున్నాము. మళ్లీ కొద్ది సేపు ఆగి ప్రయత్నించండి. అని చల్లగా పలికింది.

ఛీ.. అని విసుక్కున్నాడు.

ఎదురుగా టివిలో డిష్ ఛానెల్ వాట్సప్ గ్రూప్ డౌన్‌లోడ్ చేసుకోమని యాడ్ వస్తోంది. సరే ఇదీ చూద్దాం... అనుకుని కొద్దిసేపు కష్టపడి ఆ గ్రూప్ డౌన్‌లోడ్ చేసాడు. వినయంగా పలకరింపులయ్యాయి. కస్టమర్‌లకు ఎదురయ్యే సమస్యల జాబితా ఇచ్చి సంబంధిత సంఖ్య వేయమని వచ్చింది. రీఛార్జ్ ప్రాబ్లమ్స్ అనేదాన్ని ఎంచుకున్నాడు. తన సమస్యను వివరించాక 'సారీ! నేను రోబోట్‌ను. ఇంకా నేర్చుకుం టున్నాను. కస్టమర్ కేర్‌ను సంప్రదించండి' అనే సందేశం వచ్చింది.

'హార్నీ! ఇప్పటిదాకా చాటింగ్ చేసింది రోబోనా! మనిషనుకున్నానే!' అని ఆశ్చర్య పోయాడు రాఘవ.

బుర్ర వేడెక్కిపోయింది. సెల్ పక్కన పెట్టేసాడు. ఇన్నాళ్లూ అందంగా గర్వ కారణంగా కనబడే టివి తన అదుపులో లేని భూతంలా కనబడుతుంది. ఇంతలో చేతిలో టీ కప్పుతో శ్రీమతి ప్రవేశించింది. అడిగితే తిడతాడేమో అనే భయంతో ఏమీ మాట్లాడకుండానే ఆ టీ కప్పును అందుబాటులో టీపాయ్ మీద పెట్టింది. తాను కూడా పక్కనే వున్న దివాన్ మీద కూర్చొని సెల్‌ఫోన్ చేతిలో తీసుకుని మొగుడు ఏం చేసాడాని చూడసాగింది. టివి కూడా ఆపివేయడంతో ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది. పిల్లలు కూడా లేవకపోవడంతో ఆ నిశ్శబ్దం కొనసాగుతోంది.

రెండు సిప్పులు టీ గొంతులో దిగడంతో ఓ ఐడియా వచ్చింది రాఘవకు! వెంటనే ఆ టీ కప్పు చేతిలో పట్టుకునే బెడ్‌రూంలోని కంప్యూటర్ దగ్గరకు పరిగెట్టాడు. వెనకాలే శ్యామల అనుసరించింది. గబగబా స్విచ్‌లన్నీ ఆన్‌చేసి స్క్రీన్ ఎదురుగా ఛెయిర్‌లో కూర్చున్నాడు. వెనకాలే కొద్ది దూరంలో కుర్చీలో కూర్చుంది శ్యామల. పొద్దునే డబ్బులన్నీ ఎగిరిపోయాయని మొగుడికి పిచ్చెక్కి పోయిందని ఆమెకు అర్థమయిపోయింది. ఇప్పుడేమన్నా మాట్లాడినా, చప్పుడు చేసినా తన మీద విరుచుకు పడతాడని తెలిసి తగు జాగ్రత్తలో వుంది. నిద్ర మబ్బులో ఏమి నొక్కాడో ఇప్పుడు తన్నుకులాడుతున్నాడని లోపల అనుకుంటోంది.

గూగుల్ క్రోంలోకి వెళ్లి ఆ డిష్ టివి సైట్ ఓపెన్ చేసాడు. సైట్‌ని దీక్షగా చూశాడు. ఢిల్లీలో హెడ్ ఆఫీస్ ముంబాయి, చెన్నైల్లో రీజినల్ ఆఫీసులున్నట్టు అర్థం అయింది. టేబుల్ మీదున్న పెన్ను పేపర్ తీసుకొని వాటి మెయిల్ అడ్రస్ రాసుకున్నాడు. తర్వాత మెయిల్‌బాక్స్ ఓపెన్‌చేసి తన గోడంతా వెళ్లబోసుకుంటూ ఆ రెండిటికీ మెయిల్ పెట్టాడు. అయినా నమ్మకం కలగలేదు. ఇలా కాదు, ఏదో ఒక ఫోన్ నెంబర్ దొరక బట్టాలి. మళ్లీ ఆ సైట్ ఓపెన్ చేసి స్క్రీన్ అంతా గాలించాడు. సైట్ అడుగుకు పోయి కళ్ళంతా చికిలించి వెదకగా చీమ తలకాయంత సైజులో ఓ లోకల్ నెంబర్ దొరికింది. దాన్ని పేపర్ మీద రాసుకుని, శ్యామల చేతిలో వున్న సెల్‌ను గుంజుకున్నంత పనిచేసాడు. వెంటనే ఆ నెంబర్‌కు డయల్ చేసాడు. అవతల వైపు ఫోన్ మోగింది కానీ ఎవరూ ఎత్తలేదు. విసుగొచ్చి సెల్ ఆఫ్‌చేసి నీరసంగా ఆ కంప్యూటర్ ఛెయిర్‌లో వెనక్కు వాలిపోయాడు.

ఆయన అలా డీలా పడడం చూసి ఆపుకోలేక "ఏమయిందండీ!" అని ఆతృతగా అడిగింది ఆవిడ.

"ఏముంది. మనం చేయగలిగిందంతా చేశాం.! కనపడిన అడ్రస్ కల్లా మెయిల్ పెట్టాను. ఆ కస్టమర్ కేర్ ఏమో దొరకడం లేదు. ఏదో లోకల్ నెంబర్ దొరికితే ఫోన్ చేసా రెస్పాన్స్ లేదు. ఈ కార్పొరేట్ కంపెనీలు మనలాంటి చిన్న ప్రాణులని మోసం చేస్తాయనుకోను! ఏ బ్యాంకులనో లక్షల కోట్లు ముంచేస్తారు. ఏదో పొరపాటు జరిగింది. అది సరయ్యేవరకూ మనకీ టెన్షన్‌తప్పదు. టెక్నాలజీ

మీద ఆధారపడడం పెరిగే కొద్దీ ఇలాంటి ప్రమాదాలు వుంటాయి. "అని ఇంకా ఏదో చెప్పబోతుండగానే సెల్ మోగింది. ఏదో తెలీని నెంబర్. అయినా ఎత్తాడు రాఘవ!

అవతల నుండి పూర్తి ప్రొఫెషనల్ టోన్‌లో మాట్లాడుతూ తనను డిష్ టివి రిప్రజెంటేటివ్‌గా పరిచయం చేసుకుని ఎందుకు ఫోన్ చేసారని అడిగాడు. తాను చేసిన లాస్ట్ కాల్ ఫలించిందని అర్థమయింది రాఘవకు! టెన్షన్‌తో పొలమారిన గొంతు సరిచేసుకుంటూ తన బాధను వివరంగా చెప్పి ఒక నెల ఛార్జీలు మాత్రమే ఉంచుకుని మిగతా డబ్బులు తిరిగి ఇచ్చేయమని మొర పెట్టుకున్నాడు. అన్నిటికీ ఓకె.. ఓకె అంటూ విని ఫోన్ నెంబర్, ఐడి నెంబరు తెలుసుకుని తాను అన్ని చూస్తానని 15 నుండి 30 రోజుల్లో మీ ప్రాబ్లెమ్ సాల్వ్ అవుతుందని చెప్పి పెట్టేసాడు.

"హమ్మయ్య! బతికాం!" అని పెద్ద నిట్టూర్పు వదిలాడు రాఘవ!

"ఏమయిందండీ!" అని ఆతృతగా అడిగింది శ్యామల. "ఈ నెలాఖరు కల్లా మన డబ్బులు మనకొచ్చేస్తాయటలే!" అని అంటూ సంభాషణ వివరాలన్నీ చెప్పాడు. పొద్దున్నుంచీ వాళ్ళు పడ్డ టెన్షన్ అంతా యింతా కాదు. వేల రూపాయలు చిటుక్కుమని అకౌంట్ నుండి ఖాళీ అయిపోతే ఎవరికయినా ఖంగారే కదా!

"నిజంగా వస్తాయంటారా! రాకపోతే ఏం చేద్దాం!" అని అనుమానం లేవనెత్తింది శ్యామల!

"ఏం చేస్తాం! ఇలాగే కాళ్లా వేళ్ళా పడాలి. బెదిరించడానికి వాడు మనిషయితే గదా! ఈ ప్రపంచాన్ని పరిపాలిస్తోన్న కార్పొరేట్ భూతాలలో వాడొకడు. కోర్టుకు పోయినా మన ఆస్తి అంతా అమ్మేసినా వాడి మీద గెలవలేం! వస్తాయని నమ్మి ఊరుకోవడమే మంచిది." అని ముగించాడు.

"పోన్లేండి మన డబ్బులు మనకు వచ్చేస్తే అంతే చాలు. పొద్దునే గజేంద్ర మోక్షం లాగయింది. నేను ఎన్ని దండాలు పెట్టుకున్నానో!" అని అందావిడ.

ఆ మాటకు రాఘవ నవ్వుతూ "అవును మనలను పట్టింది కార్పొరేట్ మొసలి.! ఆ విష్ణుమూర్తే మనలను కాపాడాడు." అని అన్నాడు. "పద ఇక లేచి మన పనులు మనం చేసుకుందాం" అని అంటూ లేవబోయాడు. ఇంతలోనే చింటూ సుడిగాలిలా పరిగెత్తుకుని వచ్చాడు. వీళ్ల గోలలో పిల్లలు లేచి ఆటలు మొదలెట్టారని కూడా గమనించలేదు.

"డాడీ! w.w.w. అంటే ఏమిటో చెప్పు!" అని నిలేసాడు. వాడెప్పుడూ అంతే వాడికి తెలిసినవి డాడికి తెలుసా లేదా అని పరీక్షిస్తుంటాడు.

పిల్లాడిని దగ్గర తీసుకుంటూ "సాలె గూడు. ఇప్పుడు మనం దాన్లోనే చిక్కుకున్నాం!" అని జవాబిచ్చాడు. ఒక్క క్షణం వాడికేమీ అర్థం కాలేదు. "రాంగ్! వరల్డ్ వైడ్ వెబ్!" అని చెప్పేసి తండ్రిని వదుల్చుకుని అక్క దగ్గరకు పరుగు పెట్టాడు. ఈ లోపల సెల్ మోగడంతో ఆన్ చేసాడు.

"అమెజాన్ నుండి ఫోన్ చేస్తున్నాం సార్! మీ అడ్రస్ చెబుతారా!" అని అవతల నుండి మాట్లాడుతున్నారు. మరో కార్పొరేట్ మొసలి అని అనుకుంటూనే అడ్రస్ చెప్ప సాగాడు.✸

కవిత

# పెట్టుబడుల రంగేళి

- వంగర లక్ష్మీకాంత్

నాది ఒక కల
పదే పదే అదే కల
ఇంతింతై వటుడింతై
మర్రి మానంతై
వయసొచ్చిన వరిదుబ్బ
'చిగురు' తగిలి, పెరిగి నిండు పొట్టై
ఆకాశం నుండి నేలను తాకేటంత
'కంకి' డిసినట్టు! జనం ఆకలి తీరినట్టు!

పెట్టుబడి శక్తులది
ఒక రంధి! మహా మహా రంధి!
ప్రకృతి సంపదంతా
చెట్టై, గుట్టై, వనమై, మహారణ్యమై
పూలగుత్తులు 'డాలర్ల' ఫలాలై
జలజలా రాలి మిగులు రాశై
పలు పరిశ్రమలకు
పెను పెట్టుబడి మదుపైనట్టు

ప్రపంచ మాంసాహార రంగం
జీవాల పెంచుడు భారీ కార్పోరేట్ పరిశ్రమ
అడుగు సీమకు అరవై సీమపందుల మేపుడు
అరుపులేదు - కరుపులేదు - కుదుపుడు లేనేలేదు
అరడుగు వారులు - అడుగు మందం కండలు

అంగుళం నేలలో అరవై కోళ్ళ పెంచుడు
ఈకలు - పేగులు - ముక్కా - గోళ్ళా?
తూచ్! అవెందుకు?
బోర - తొడ - కాళ్ళు మహాకండలు
జన్యుమార్పిడి బోడి జీవాలు
విచ్చలవిడి మందులు మేపుడు

జంతు సాంద్రత కీకారణ్యం
లాభం బలుపు కండల మాంసాహారం
పెను వైరస్సుల కాసారం
బహుళ రోగక్రిమి ఉత్పరివర్తన కర్మాగారం

నాథా! వట్టి 'ఆకళ్ళ' కల
నకనక పేగుల బతుకు మలమల
వాడిదా పెట్టుబడుల శృంగార రంగేళి
లాభాల రంధి రసకోవిదు(డు)ల విషకేళి! ✸

అంతర్మథనం

# వర్గాలు బలంగా ఉన్న మన దేశంలో కరోనా రోగం ఎవరికి లాభం? ఎవరికి నష్టం?

- ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి

**అసలే** నిద్ర వస్తలేదు. ఎనిమిది నెలలైతాంది. కరోనా రోగం మన దేశంలో చొరబడ్డ కాన్నించి గిట్ల అయితాంది. గవర్నమెంటు ఏం చెప్తాంది? ఏం చేస్తాంది? జనం బతుకులు ఎంత ఆగమాగం అయితానయి? గివన్నీ ఆలోచిస్తాంటే నిద్ర ఎట్ల వస్తది? తలకాయ మసలుతాంది. బాధ, బాధ అయితాంది. గీ బాధను అందరికీ చెప్పు కోవాలె. గప్పుడే అందరికీ అసలు విషయం ఏందో అర్థమైతది, కోపానికొస్తరు. కలసి కొట్లాడతరు. సమస్యలను ఎళ్ళగొడ్తరు. అప్పుడు అందరం మంచిగుంటం కద! అందుకోసం అందరికీ నా బాధను చెప్పుకోవాలె.

★★★★★

ఎంతో మంది జనం చావలేక బతుకుతాంద్రు. ఇంకొందరికి అట్ల గూడా బతకడం కష్టమైతాంది. ఆత్మహత్యలు చేసుకుంటాంద్రు. మొన్నటికి మొన్న మన పేపర్లల్ల రిపోర్టులు ఏం చెప్పినయి? జనం అంతా కరోనాతో ఆగమాగం అయితాంటే, కోటీశ్వరుల ఆస్తులు ఇంకా ఇంకా పెరిగినయంట. అయ్యో! ఇది వింతనే కద! సృష్టించబడ్డ సంపదంతా కోటీశ్వరుల దగ్గరికే చేరుతాంది. అందుకోసమే రూల్స్ తయారైనయి. ఇది సాదాసీదాగా అమలైతదా? అందుకోసం జనం ఒక్కటి కాకుండా చూస్తది. కరోనాకు కూడా ఇక జండర్, మతం, కులం అన్నీ ఉంటయి. మనం చూడనే చూస్తిమి ఇవన్నీ.

ఇంకో ముచ్చట. మన గవర్నమెంటు ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చూపించే గా 'గ్రాఫిక్స్' విద్యను బాగా నేర్చుకున్నది. దీనికి తగ్గట్టుగా అమ్ముడుపోయిన మీడియా వంతపాడ్తనే ఉన్నది. 24 గంటలు వార్తలట. రోజంతా ప్రసారాలే, ప్రచారాలే, మన గురించి మాత్రం ఒక్క ముచ్చట ఉండదు. మనలను సక్కగ ఆలోచించకుండ చేస్తది.

కరోనా ముచ్చట్లు ఎన్నని చెప్పాలె? గవర్నమెంటు మనలను ఆగం చేసిన తీరును ఎంతని చెప్పాలె? ఒక్క రోజంతా ఇండ్లనే ఉండండ్రి, సాయంత్రం పళ్ళాలు, గిన్నెలు తీసుకుని రోడ్ల మీదికొచ్చి 'దబ్బ దబ్బ' కొట్టండ్రి, కరోనా పారిపోతది అని ప్రధానమంత్రి చెప్తే నిజమని నమ్మితిమి. తలూపుకుంటా అట్లనే చేస్తిమి. ఏమైందో ఆ తర్వాత మనం చూస్తనే వుంటిమి. రెండు రోజులన్నా కాకముందే చెప్పాపెట్టకుంట లాక్డౌన్ పెట్టిరి. మనదేశంలో నూటికి 90 మంది ఎట్లా బతుకుతాంద్రు? చిన్నా చితక పనులు, చిల్లర యాపారాలు, దుకాణాలు, రిపేరు పనులు చేసుకుంటూ, లేకపోతే పెద్దపెద్ద షాపులల్ల రోజుకూలీల్లాగా పనులు చేసుకుంటూ బతుకుతున్నరు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితే కద! ఇక వలస కూలీలైతే ఎంత అరిగోస పడ్డరో మనందరం కళ్ళారా చూస్తిమి కద! చిన్న పిల్లలు, ముసలోళ్ళు, రోగాలు రోష్టులతో వున్నోళ్ళు, కడుపుతో ఉన్న ఆడోళ్ళు అందరూ తట్టాబుట్టా సర్దుకొని, మోసుకుంట, వేల మైళ్ళు నడ్సుకుంట పోబట్టిరి. ఎండనా, రాత్రా, పగలా, తిండితిప్పలా బతికుంటే చాలు అనుకుంటూ ఊళ్లకు బయలుదేరిండ్రు. ఎంతమంది ఎంత ఆగం అయిండ్రో, దారిల ఎంతమంది చచ్చిపోయిండ్రో లెక్కా, పత్రమా! కొన్ని రాష్ట్రాలల్లనైతే, మీరు పోతే ఇక్కడ పనులు ఎవరు చేస్తార్రా పోనివ్వం అని గవర్నమెంటన్న ముచ్చట కూడా మనం వింటిమి.

పల్లెటూళ్ళను, వ్యవసాయాన్ని సర్వనాశనం చేస్తిమి. బతుకు తెరువు కోసం ఇరవై ఏళ్ల నుండి ఏటా 10 లక్షల మంది పొట్ట పోసుకోవడానికి కూలి పనుల కోసం వలస పోతాంద్రన్న సంగతి, ఆ లెక్కలు గవర్నమెంటుకు తెల్వదా? చాలా ఏండ్ల నుండి పేదోళ్ల గురించి చెప్పుడు బంద్రైంది. కోటీశ్వరుల గురించి గొప్పలు చెప్పుడు షోకైంది. వీళ్ళను చూసి మురుసుడు ఎక్కువైంది.

★★★★★

ఎవరిండ్లల్లవాళ్లుండాలి. బయటికి అరికీస్ రావద్దు, గప్ చుప్ అనుకుంట గవర్నమెంటు ఏం చేసింది? చెప్పుకుంటే నిజంగా సిగ్గు పోతది. మనమే ఓట్లేసి గెలిపించుకుని గద్దె మీద కూసోబెట్టిన గవర్నమెంటేనాయె. ఒకవైపు ప్రపంచ కార్మిక సంస్థ ఏం చెప్పింది? మన దేశంల మస్తుమంది కనాకష్టపు పరిస్థితులల్ల పనిచేస్తాంద్రని, దానిని బాగు చేయడం గవర్నమెంటు పని అని ఇరవై ఏళ్ల నుండి చెప్తనే ఉన్నది. అయితే, లాక్డౌన్లో ఎవరూ బయటకు రారు, అడగరు, కొట్లాడరు కద! ఇక, వందల ఏళ్ళు కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, అవి కార్మికుల బాగు కోసం, హక్కుల కోసం వున్నయి. వాటిని గవర్నమెంటు సస్పెండ్ చేసింది, రద్దు చేసింది. దినానికి ఎన్ని గంటలు పని చేయాలె, ఎంత జీవితానికి అన్నది ఉద్యోగం ఇచ్చేటోడు, తీసుకునే టోడు తేల్చు కుంటడన్నది. ఇక్కడ ఎవరి మాట చెల్లుతదో మనకు తెల్వదా!

ప్రజలందరి మంచికోసం అంటూ మే 12వ తారీకు నాడు ఇరవై ఒక్క లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ అని మురిపించుకుంట 'ఆత్మ నిర్భర భారత్ అభియాన్' అని గవర్నమెంటు ప్రకటన చేసింది. దాని ముచ్చటను మన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఐదు రోజులూ ఆగకుంట చెప్పింది. మొత్తం విన్నంక ఏం అర్థమైంది? సామాన్య జనం బాగు కోసం అందుల ఏం లేదు. ఉద్యోగం, సద్యోగం, చదువు, రోగానికి మందు, దేని గురించీ అందుల ఏం లేదు. ఉపాధి హామీ పథకంల రోజు కూలీలో 20 రూ.లు పెంచి, అబ్బ, మేం పేదోళ్ళ గురించి ఎంత గొప్ప పని చేసినం అని గర్వంగా చెప్తాంటే మనం అవాక్కైనం కద!

ఇక, ఆఖరి రెండు రోజులు మాత్రం అసలు సంగతులు చెప్పింద్రు. మన దేశ రక్షణ బలంగా ఉండాలంటే ప్రైవేటు కార్పొరేటు శక్తులకు

ఇవ్వాలంటిరి. ఒక్కటి కాదిక, రైలు రూట్లు, స్టేషన్లు, ఎయిర్ పోర్టులు, అంతరిక్షం, బొగ్గు గనులు, విలువైన ఖనిజాలు అన్నింటిని గ్లోబల్ కార్పొరేటు దిగ్గజాలకు అప్పజెప్పడానికి రూల్సుని తయారు చేస్తదట. స్వతంత్రం వచ్చినప్పటి నుండి ప్రజలందరి బాగు కోసం, దేశం కోసం అంటూ పెంచి పెద్దచేసిన ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని, ఆ మాటకొస్తే మన సమస్త సంపదను, భూమిని, ఆకాశాన్ని, ఖనిజాలను, శ్రమశక్తిని అన్నిటినీ గుత్త పెట్టుబడులకు అగ్గువ సగ్గువకు అప్ప చెప్పటమే. ఇట్ల, దేశాన్ని అమ్మకానికి పెట్టడమే స్వావలంబన అంటాంది గవర్నమెంటు. దేశభక్తులు దీనిని ఒప్పుకుంటరంట. ఇదేంది, ఇంత అన్యాయమా అని అడిగితే దేశద్రోహమట. తలకిందులు చూసుడే కరెక్ట్ అయింది. మన దేశం మొత్తాన్ని గ్లోబల్ గుత్త పెట్టుబడులకు అగ్గువకు అమ్మడమే వసుధైక కుటుంబం అంటాంది గవర్నమెంటు.

ఇదంతా కుల్లం కుల్లాగా అర్థమైతాంటే నిద్ర పడ్తదా? రంధి పెట్టుకోకు, పెట్టుకోకు శాంతంగుండు అంటే వీలైతదా? దేశం అంతా తగలబడుతుంటే దాన్ని తమాషా అనుకుంటమా? అంత గుండె నిబ్బరం మనకు ఉన్నదా?

★★★★★

పోనీ కరోనాను ఒక పెద్ద అంటురోగం అంటుంటిమి కదా! జనానికి ఇది రోగం, పెద్ద సమస్య. వాళ్ల బతుకులను ఇంకా కష్టాలపాలు చేస్తాంది సర్వనాశనం చేస్తాంది. అయ్యో.... కానీ, ఈ రోగం ప్రైవేటు కార్పొరేటు దవాఖానాలకు మస్తు లాభాలను కురిపిస్తది. ఇంక గ్లోబల్ గుత్త పెట్టుబడులకైతే వ్యాక్సిన్ పేరుమీద అబ్బో! లాభాలే లాభాలు. బోల్డన్ని ఏండ్లు జనాన్ని దోచుకుంటది, సంపాదిస్తది. ఇదో పెద్ద ప్రాజెక్టు వాళ్లకు మరి. ఎంత చోద్యం ఇది. జనం చావు కార్పొరేట్లకు పండుగ అయితాంది. విడ్డూరం కాదా ఇది. అప్పుడెప్పుడో అమార్త్యసేన్ ఏం చెప్పిండు? ప్రతిదీ అమ్ముకునే సరుకైతే దానికి లాభాల ముచ్చటే తెలుస్తది కానీ మానవత్వం సంగతి యాది మరుస్తది.

అసలు ముప్పయి ఏళ్ళ నుండి కార్పొరేటు దవాఖానాలు ఎందుకొచ్చినై? రోగాలను, రోగులను అన్నిటినీ లాభాల కోసం వాడుకోవడానికి. అందుకోసం గవర్నమెంటు అగ్గువసగ్గువకుభూము లిచ్చె. పన్నులు కట్టొద్దని రాయితీ లిచ్చే. అట్లా ఈ దవాఖానాలు కోట్లకు పడగలెత్తినయి. కరోనా వచ్చిన మొదట్ల జనం విలవిల్లాడుతుంటే, సకల అవస్థలు పడతాంటే చోద్యం చూసుకుంట కూర్చున్నయి ఈ దవాఖానాలు. మాకేం లాభం అనుకుంట! అప్పుడు జనానికి దిక్కెవరు? మేము ఉన్నం అని ముందుకొచ్చింది ఎవరు? గవర్నమెంటు స్వయంగా కంకణం కట్టుకొని. నాశనం చేసిన గవర్నమెంటు దవాఖానాలే ప్రజలకు దిక్కయినయి. చోద్యం ఏంటంటే, గవర్నమెంటు ఏం చెప్పింది? ఇక ఉన్నోడికయినా, లేనోడికయినా, లీడరైనా, మామూలోడైనా గవర్నమెంటు దవాఖానాలకే పోవాలన్నది. వాటిని ఇక బాగు చేస్తం, కొత్త దవాఖానాలు సుత కడ్తం అన్నది. మనం సోయి మర్సి నిజమేననుకుంటిమి.

ముప్పై ఏళ్ల నుండి ఈ దవాఖానాలను ఎవరు నాశనం చేసిండ్రో మనకు తెల్వదా? ప్రపంచ బ్యాంకు ఏం చెప్తే అదే చేసే మన గవర్నమెంటు గురించి మనకు తెల్సు. అనుభవిస్తనే ఉంటిమి. అయినా గవర్నమెంట్ చెప్పేదంతా నిజం అనుకుంటిమి. గవర్నమెంటు దవాఖానాలను బాగు చేస్తదని నమ్మితిమి. మన నమ్మకం వమ్ము అయింది కద!.

అన్న మాట నిలబెట్టుకున్నదా గవర్నమెంటు! కేటాయింపులు లేవాయె, నిధులు లేవాయె. ప్రపంచబ్యాంకు అత్యవసర సేవలను గవర్నమెంటు ఇయ్యాలని చెప్పింది కదా! ఆ మాట కూడా వినకపాయె. మొత్తం ప్రజారోగ్య వ్యవస్థను సర్వనాశనం చేసి డాక్టర్లను, మెడికల్ సిబ్బంది ఉద్యోగాలను నింపుడు ఎప్పుడో బందు పెట్టిరి. అందరూ కాంట్రాక్టు మీదనే పని చేయ బట్టిరి. మందులు, బెడ్లు, ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లు, పరికరాలు ఏమైనా సరిగా ఉన్నయా? ఆఖరికి శుభ్రంగా ఉంటాయా ఈ దవాఖానాలు. అయినా గవర్నమెంట్ దవాఖానాల్లో పనిచేసే డాక్టర్లు, పిజి విద్యార్థులు, సిబ్బంది, మేం జనం కోసం పని చేస్తమని ముందుకొచ్చిరి. వాళ్లకు, గ్లోవ్స్, మాస్కులు, పిపియి కిట్స్ ఏవీ ఇయ్యకున్నా ప్రాణాలకు తెగించి పని చేసిరి. ఇది నిజంగా గొప్ప ముచ్చటే కద!

వీళ్లంతా గింత కష్టపడతాంటే గవర్నమెంటు అన్న మాట నిలబెట్టుకోలేదాయె. గాంధీ దవాఖానాలో పీజీ పిల్లలు, నర్సులు ఫార్మాసిస్టులు, మేం పని చేస్తం, మాకు కావల్సినవి ఇవ్వండి, మా ఉద్యోగాలను పర్మనెంటు చేయండి అని సమ్మె చేసిరి. మొరపెట్టుకునిరి. హైదరాబాద్‌లనే ఉస్మానియా దవాఖానా, అబ్బో! పెద్ద దవాఖాన. జులై నెలల వర్షం పడితే ఆ నీళ్లతో, మురికి కాలువ నీళ్లల్ల దవాఖాన మునిగింది. ప్రపంచం మొత్తం విస్తుపోయి చూసింది. ఇంత ఆగమా అనుకుంట. వరంగల్‌ల ఎం.జి.ఎం పెద్ద దవాఖాన. సూపర్నెంట్ అంటే పెద్ద పదవి. ఈ పరిస్థితులల్ల మేం పని ఎట్ల చేస్తం అని, ఈ పోస్టుకు సీనియర్ డాక్టర్లు, మాకొద్దు అనిరి. అయినా గవర్నమెంటుకు జనం బతుకులను బాగు చేయాలన్న యావ లేనే లేకపాయె.

ఇదంతా ఎవరికి లాభం? అప్పటివరకు చడీచప్పుడు లేకుండా చోద్యం చూసుకుంటూ కూసున్న కార్పొరేటు దవాఖానాలు ఇక విజృంభించినయి. విశ్వరూపం చూపించటం మొదలు పెట్టినయి. కరోనా, ఇక పకడ్బందీగా అమ్ముకునే సరుకైంది. దీనితో కొత్త దోపిడి రూపాలు తయారైనయి. మందులేని రోగాన్ని నయం చేస్తామంటరు. కానీ బెడ్స్ లేవంటరు. బతిమిలాడాలి, పైరవీ చేసుకోవాలి. ఐదు లక్షల రూపాయలు డిపాజిట్ చేసుకోవాలి. 16 నుండి 20 లక్షల రూపాయల ప్యాకేజీ అంటరు. రోగిని చూడొద్దంటరు. కరోనా ప్రోటోకాల్ అంటరు. రోగిని చూస్తమని కొట్లాడితే పదిహేను లక్షల రూపాయలు కట్టి శవాన్ని తీసుకు పొమ్మంటరు. ఎన్ని కథలు చూస్తిమి, వింటిమి. అప్పులపాలైరి. ఇదే సందుగా దవాఖానాలకు, బ్యాంకులకు లింకు ఏర్పడ్డది. ఫలానా దవాఖానాకు పోతే లోన్లు ఇస్తామంటిరు.

అబ్బో! కరోనా క్వారంటైన్ కూడా అమ్మకపుసరుకాయె. స్టార్ హోటళ్లు, లాడ్జింగ్లలో కార్పొరేటు దవాఖానాలకు లింకు. అవుట్ పేషంటైనా 5 లక్షల ప్యాకేజీలు. అక్కడికి ఆగిందా? సకల రోగాల ఫీజులు, ఆపరేషన్ల చార్జీలు రెట్టింపైనయి. మనందరం చూస్తనే ఉంటిమి. ఇక మాస్కులు, గ్లోవ్స్, రకరకాల శానిటైజర్లు, ఆక్సిజన్ సిలిండర్లు, పల్స్ ఆక్సీ మీటర్లు అన్నింటి అమ్మకాలు జోరందుకున్నయి.

వస్తువులు తయారుచేసే కాణ్ణించి అమ్ముకునే వరకు పెద్ద నెట్వర్క్ ఏర్పడ్డదాయె. లాభాలే లాభాలు. దోసుకునుడే దోసుకునుడు.

★★★★★

కరోనా రాజకీయం ముచ్చట ఆగిపోయిందా ఇక్కడితో. ఊహూ.... మొదటి నుంచే వ్యాక్సిన్ మాత్రమే దీనికి పరిష్కారం అని చెవిలో జోరీగ లాగా ప్రచారం చేసిరి. మనం కూడా నిజమే అనుకుంటిమి. ఓ.... బోల్డన్ని గుత్త సంస్థలు మా వ్యాక్సిన్ రెడీ, ఇక వస్తాంది బయటకు అంటూ ఊరించడం, ఊదరగొట్టడం, ఇక గవర్నమెంటు వీటితో ఒప్పందాలు, అడ్వాన్సులు చెల్లించడాలు జరుగుతూనే ఉండె. ఎవరికి మందివ్వాలన్న చర్చలు. ఆఖరికిది ఎన్నికల హామీ కూడా అయిందాయే. ఇదంతా గుత్త పెట్టుబడులకు మస్తు సంవత్సరాలు లాభాలే, లాభాల నిచ్చే ప్రాజెక్టే కద!. అందుకే కొంతమంది దీన్ని పాండమిక్ కాదు ప్లాండమిక్ అంటాండ్రు.

★★★★★

ఇంత బాధను కడుపుల పెట్టుకుంటే నిద్ర పడ్తదా! అందుకే మీ అందరికీ చెప్పుకున్న. మనమందరం కల్సి ఏం చేద్దాం? ఈ దందాలన్నింటిని రూపుమాపాల్నా, వద్దా? మంచి సమాజం, మంచి బతుకు కావాలి కద! అందుకోసం మనమంతా కలిసి కొట్లాడాలె. గట్టిగా కొట్లాడాలె మరి. లేకపోతే మన బతుకులు ఎట్ల బాగయితయి మరి?. ✹

కవిత

# మనిషిని మలిచే ఉలి

**– ఈతకోట సుబ్బారావు**

**పొలాలనంతా** హలాల దున్ని
ఇలాతలంలో హేమం పండించిన రైతును నేల కూలీగా చూస్తున్నాడే కానీ
అన్నదాతగా పరిగణించటం లేదు.

తన చుట్టూ స్వార్థం మేట వేసుకున్న
ఎడారి బిడారి లో కొలువుతీరి
ఒంటరి ఒంటెగా మారిపోయాడు .

కండలు కరిగించి బండలు పగలదీసి తనకోసం రోడ్లు పరిచిన శ్రామికున్ని
చెమట కూలీగా నామకరణం చేస్తున్నాడు.

తన ఇంటికి రాళ్లెత్తిన కష్టజీవుల్ని
వలస కూలీలుగా ముద్రిస్తున్నాడే కానీ
వాళ్ళని మనుషులుగా గుర్తించిందీ లేదు వాళ్ల కోసం ఓ నిట్టూర్పు విడిచిందిలేదు.

నీళ్లు కొని తాగుతున్న రోజులు కదా నదులన్నీ తన బానిసలు అంటాడు.

ప్రపంచ విపణిని సమర్థిస్తూ
డబ్బుని ఓడించే దేవుడు లేడు అంటాడు.

'ధనమూల మిదం జగత్.' అంటూ
తన మాటకు వేదాలే సాక్షం అంటాడు ఏమన్నా పర్వాలేదు కానీ
మనిషిలో మనసును గుర్తిస్తే చాలు.

ఎన్ని అంతస్తుల బతుకు బతికినా
చివరకు నలుగురు అవసరమన్న నిజం నిర్ద్వంద్వంగా ఒప్పుకుంటే చాలు .

మరణం ముందు ఎంతటి అహంకారం కానీ
తలవంచక తప్పదన్న సత్యం తెలిస్తేచాలు వాణ్ని మనిషిగా మలచటానికి ఏ ఉలీ అక్కర్లేదు. ✹

కవిత

# చిత్తుప్రతి

బెంగాలీ మూలం : జాకిర్ హుస్సేన్ ఖోఖన్ ఆంగ్లం నుండి అనువాదం : కొత్తపల్లి రవిబాబు

**ఊరిలో** వదలి వచ్చిన
పిల్లాపాపలకు
కరోనా సోకుతుందేమోనని
వారు భయపడుతున్నారు.
తామేమో ఎక్కడెక్కడో వున్నారు
పిల్లలకది అంటుకుంటే
ఏమిటీ గతి మరి?

ఇరుకు గదుల్లో
ఇరుక్కుని వున్నందుకు
వారికి భయం
అనంతంగా తిరిగే రెండు సీలింగ్ ఫాన్లు
గదంతా నిండిన దుమ్ము
రోదిస్తున్నట్లు ఆ ఫాన్ల వెచ్చని గాలి
ఊపిరాడనివ్వదు
అవి రక్షించమని అరుస్తున్నాయ్
ఎవరి సహాయాన్నో అర్థిస్తూ

నుంచున్నపుడు, కూర్చున్నపుడు
తినేటప్పుడు, నిద్ర తీసేటప్పుడు
ఒక అడుగు దూరం పాటించమని
ఆజ్ఞాపించారు పాలకులు
ఫోన్లో మాట్లాడుకునే ప్రియులు కూడా
ఒకరినొకరు అంటుకోకుండా
దూరం పాటించినట్లు
వారికి దిక్కుతోచలేదు
ఈ ఇరుకు గదిలో
దూరం ఎలా పాటించాలి?
టేపుతో గది కొలతలు వేస్తారు
ప్రభుత్వాజ్ఞ పాటించడానికి
గదిలో ఎందరున్నారో లెక్కిస్తారు
మరికొందరు
ఆ గదిలో వున్నవారి నుదుటన
ముడతలను కొలుస్తారు

ముఖానికి మాస్కులు తప్పనిసరి
ఇది పరిపాలకుల ఆజ్ఞ
కాని కట్టుకోడానికి మాస్కులే లేవు!
ఎవరిస్తారు మాస్కులు!
ఇంటి యజమానా? పాలకులా?
కంపెనీయా?

వారు బయట తిరగడం నిషిద్ధం
మాస్కులే లేకపోతే
వాటిని వారెలా ధరిస్తారు?
ఆశ్చర్యం వారిని ముంచేసింది.
ఈ జీవితపు పరుగుపందెంలో
ఎవరు ఎవర్ని అవమానిస్తున్నారో
వారికి అర్థమే కావడంలేదు.

భయంతో వారి గొంతులు
ఎండిపోయినపుడు
వారు దిగ్భ్రమకు లోనౌతున్నారు
మురికిగా, కంపుగా వుండే
స్నానాల గదిలోకెళ్తారు
నీళ్ళు తాగడానికి.
ఒక్క స్నానాలగది వందకు పైగా
వున్నవారి అవసరాలు తీరుస్తుంది
రోజూ దాన్ని శుభ్రం చేసేవారు లేరు
ఆ వైరస్ తమకంటుకుంటుందని
వారు భయపడుతున్నారు.

నీళ్ళు త్రాగి, దాహం తీర్చుకుని
పాడటం ప్రారంభిస్తారు
"నేనొక వలస జీవిని
ప్రపంచమంతా చుట్టి వస్తాను"
ఆ పాట వీడియోకెక్కింది
ఎందరో విన్నారు దానిని
కాని పాడినవారు మాత్రం
భయంతో బిక్కుబిక్కుమంటున్నారు.

మనసు విప్పి చెప్పడానికి
వారు భయపడుతున్నారు
ఏజెంటు ఇచ్చే డబ్బుకు కట్టుబడి
ఎవరో అనామకుడికి
వారి జీవితాలు తాకట్టు పెట్టబడ్డాయి.
ఏళ్ళూ పుళ్ళూ గడిచాయి
సుందరమైన నగరం మరింత
అందాన్ని సంతరించుకుంది
కాని వారి జీతంలోనూ,
జీవితంలోనూ మాత్రం
మార్పేమీ లేదు.

తమ మనసు విప్పి
తమ బాధలు ఏకరువు పెట్టడానికి
వారు భయపడి చస్తున్నారు
భయం తప్ప
వారికి అంకితభావం లేదు
భాష లేదు
వారు ఏకాకులు
కంపెనీవారూ, రాజ్యమూ కలసి
ఒకరినొకరు పోషించుకుంటారు
భయపడొద్దని ప్రభుత్వం చెప్తుంది
కానీ వారు
భయభ్రాంతులై వున్నారు
ఆతృత నిండిన
వారందరికీ తెలుసు
ఆ దేశ హై కమీషన్‌వారు మాత్రం
తమ శవాలను ఇంటికి
పంపడానికే వున్నారన్న వాస్తవం.

తమ దేశపు
తమ జాతి నాయకులు
తమని 'శ్రామిక సోదరులు'
అంటూ పిలుస్తారు,
తమ ఊహా లోకంలో.
నిజానికి
సోదరుడా
స్నేహితుడా అనే పదాలు
వారికేమాత్రం వర్తించవు.

ఎన్నెన్నో ప్రశ్నలతో
అనవరతం
వారిని కలుస్తుంటారు పాత్రికేయులు
వారికి జవాబివ్వాలంటే
వారికి భయం –
జర్నలిస్టులు కూడా
ఎవరో ఒకరికి భయపడ్తుంటారని
వారికి తెలుసు.

ఒక్కోసారి కవులు, మేధావులు వస్తుంటారు
తమని ఉత్తేజపరుస్తారు
చదువుకోమనీ, రచనలు చేయమనీ
ఉపన్యాసాలివ్వమనీ, చిత్రాలు గీయమనీ,

ఫొటోలు తీయమనీ,
ఫిల్ములు తయారుచేయమనీ,
కాని వారి సృజనాత్మకత
విస్ఫోటనాలుగా గాక
శాంతి ప్రబోధకంగా వుండాలని
నొక్కి మరీ చెబుతారు.

చదవడమంటే వారికి భయం
రాయడానికి వారు భయపడతారు
చిత్రలేఖనమంటే చచ్చేంత భయం
ఫొటోలు తీయడం వారికి భయం
ఫిల్ములు తీయడమంటే భయం
నేర్చుకోడానికీ,
పరిశీలించడానికీ వారికి భయం.
తమ విజయాలను
ప్రశంసించడమన్నా కూడా వారికి భయమే.
కనుక – ష్... వారు మౌనంగా వుంటారు.

వారు బిగ్గరగా నవ్వడానికి భయపడతారు.
వారికి తెలుసు హృదయం విప్పి నవ్వితే
అధికారులకు ఆరోపణలు వెల్లువెత్తుతాయని,
కనుక నవ్వును అదుపులో వుంచుకుని,
తక్కువ నవ్వుతారు
నిద్ర తక్కువ పోతారు
తినడమూ తక్కువే

నగరాల బయట వుంటారు వారు
వారి కలలన్నీ కల్లలైపోయాయి.
వారిని చెదలు తినేస్తాయి
ఎలుకలు, బొద్దింకలకైతే
పండగే పండగ.
రాజ్యం మాత్రం ఇలా చెబ్తుంది
వలసకూలీలు ఒక వనరు –
వారు మానవవనరు అని.
వారిలో కొందరు రాత్రుళ్ళు
గుసగుసలాడుకుంటారు ఇలా

'ప్రతి క్షణమూ నిరాశాపూరితమే!
ప్రతి మధ్యాహ్నమూ భయంకరమే!
ప్రతి సాయంత్రమూ అపాయకరమే!
ప్రతి రాత్రీ లెక్కలు వేసుకుంటున్నాం
ఎంతమందికి అది అంటుకుందో
ఎంతమంది చనిపోయారో
ఎన్ని ఊపిర్లు పీల్చుకుంటున్నాయో
మేము నిద్రపోలేము
మా పీడకలలను తలచుకుంటూ
అద్దంలో మా ముఖాలను
మేమే చిత్రించుకుంటాం
ఒక ఆకుపచ్చని ఉషస్సు కోసం ఆశతో!

వారు భయభ్రాంతులయ్యారు
భయమూ, కాయకష్టమూ
వారి మొఖాలను మాడ్చేస్తాయి
వారి ఫొటోలు తీసుకుంటుంది ప్రభుత్వం
కార్మికులకు సౌకర్యాలు సమకూర్చడం ద్వారా
వారిలో ఆనందం నింపడంలో
విజయం సాధించినట్లు చెప్పుకోడానికి....
రాజ్య పథకాలకు పొగడ్తల పరంపర
ప్రశంసాగేయాల ఆలాపనలో
వారు రాజ్యంతో గొంతు కలుపుతారు
ఈ రాజ్యంలో రోజూ,
మేమూ మిత్రులమంటూ
లేకపోతే ఇదే రాజుతో
ఇంకెలా పనిచేయగలం?

వారి అధికార కిరీటధారణ వార్త
నలుమూలలకూ ప్రాకింది
వారి వారి కుటుంబాలకూ
ఇంకా ఇంకా ఎందరికో

కాని వారు భయాందోళనలో వున్నారు
వారి నోట మాట రాదు
వారు నిందలకు గురయ్యారు

కాని వారేమీ బెదరలేదు
వారు మాట్లాడలేరు.
విని సానుభూతి చూపేవారు లేరు
విశ్రాంతికై ఆతృతగా వున్నారు.
విశ్రాంతి వల్ల ఆదాయం రాదని
వారికి తెలుసు
ఏజెంట్లకిచ్చే ఫీజులు, పని పాసులు
వారిని అప్పులతో నొక్కేస్తాయని
వారికి తెలుసు.

వారు కఠిన పాషాణాలైపోయారు
తమ సహచరుల వద్ద, కంపెనీ వారి వద్ద
తమ జబ్బులను దాచిపెడతారు
వారు చచ్చిపోతామని భయపడతారు.
ఈ అంధకార సమయంలో
వారు లెక్కకు మాత్రమే ప్రజలు
వారి ప్రాణస్నేహితులు కూడా
చివరిసారి చూడటానికి గాని
వారి పాడె మోయడానికి గానీ రారు

వారంటే ఎవరు!
భయభారంతో వారింకా
బతికే వున్నారా?

వారి గుర్తింపుకార్డులలో
'ఆధునిక బానిసలు' అనే ముద్ర వుంటుంది
ఇది కనీసం వారిని 'గుర్తింపు సంక్షోభం'
నుండి కాపాడింది.

ఇక రాజ్యం, ప్రభుత్వం, పౌరులు,
కంపెనీ, ఏజెంట్లు
ఇంకా ప్రియమిత్రులు
వారు చిరునవ్వు చిందించటానికి
సంవత్సరంలో ఒక్కరోజైనా కేటాయించారు
వారు నవ్వుతారు, బిగ్గరగా నవ్వితీరుతారు.
భయం విడిచేసి, జీవిస్తారు వారు.

జాకిర్ హుసేన్ ఖోకన్ బంగ్లాదేశ్‌కు చెందినవాడు. ఢాకాలో జన్మించాడు. బంగ్లాదేశ్ జాతీయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివాడు. భవన నిర్మాణరంగంలో క్వాలిటీ కంట్రోల్ సూపర్‌వైజర్‌గా 2003లో సింగపూర్‌కు వలస వెళ్ళాడు. ఆయన బహుముఖులు గెలుచుకున్న కవి, సంపాదకుడు, పాత్రికేయుడు, ఫొటోగ్రాఫరు, ఫిల్మ్ నిర్మాత, సామాజిక కార్యకర్త, వక్త:

కోవిడ్–19 వ్యాప్తిని అరికట్టడానికి సింగపూర్‌లో ప్రారంభించిన కరోనా కట్టడిలో భాగంగా, ఏప్రిల్ 5న 20 వేల వలస కార్మికులను డార్మిటరీలలో ఏకాంతవాసంలో నిర్బంధించిన సందర్భంగా ఈ 'చిత్తుప్రతి' (First Draft) కవిత ఆయన రాశాడు. నెలరోజులపాటు ఆ విధంగా వుంచడంతో సింగపూర్‌లోని వలస కార్మికుల జీవన పరిస్థితులపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిని బెంగాలీ నుండి ఇంగ్లీషులోకి దేవవ్రత బసు అనువదించారు.

పుస్తక పరిచయం

# అలిశెట్టి కవిత్వం ప్రాసంగికత

బూర్ల వెంకటేశ్వర్లు

**ఎడతెరిపి** లేని దగ్గు / అడుగు కదపనివ్వని ఆయాసం / రక్తం ముద్దలుగా పడుతున్న రోజుల్లో కూడా / నేను కవిత్వాన్ని నిర్లక్ష్యం చేయలేదు / నాలోని విలువల్ని భగ్నం చేసుకోలేదు / నా ప్రాపంచిక దృక్పథాన్ని వీడి ఏ ప్రలోభాలకు లోబడలేదు / ఆఖరికి కాలి ధూళితో సమానమైన కలర్ సినిమా గ్రామర్ ను సైతం / నా కళ్ళల్లో పడకుండా జాగ్రత్త పడ్డానే తప్ప / ఎటువంటి కుళ్ళు మార్గాలకు తలవొగ్గ లేదు / మనోహరాకాశంలో ఎగిరే కొంగ మొదలుకొని / మదరాసులోని కొంగర జగ్గయ్య వరకూ / నా కవిత్వాన్ని అమితంగా ప్రేమిస్తారని తెలుసు" అలిశెట్టి సంక్షోభగీతానికి రాసుకున్న కవిత్వ ముందుమాట ఇది. కవికి ఉండవలసిన నిబద్ధత, నిస్వార్థత, దృక్పథం, వ్యక్తీకరణ స్పష్టత ప్రతీ వాక్యంలోనూ ఈ కవితలో కనిపిస్తుంది. తెలుగు వచన కవిత్వం అనేక ఉద్యమాల ప్రభావంతో ముందుకు వచ్చి విస్తృతమైన సాహిత్యాన్ని సృష్టించుకున్నది. మధ్యతరగతి పాఠకుల మీద ఎంతో ప్రభావాన్ని చూపింది. అయినా, రాశి పరంగా నేడు వస్తున్న కవిత్వంలో వాసి ఎంత ఉందో, ఎంత మంది ప్రజలను అది కదిలిస్తుందో అన్నది ప్రశ్నార్థకం. ఏ రోజు రాసిన కవిత ఆ రోజే ప్రచురించబడుతున్న ఆ రోజుల్లో అలిశెట్టి కవిత్వాన్ని చదివి సరిచూసుకోవాల్సిన అవసరం ఉంది. అలిశెట్టి కవిత్వం ప్రజల నాలుకల మీద నర్తించడానికి కారణమేమిటో చూడాల్సిన అవసరం ఉంది.

ప్రజల నాలుకల మీద నిలవడం, వివిధ సందర్భాల్లో ఉదహరించ బడడం, మౌఖికవ్యాప్తిని పొందడం కవిత్వానికి ఒక సుగుణం. అట్లాంటి కవుల్లో వేమన, శ్రీ శ్రీ, చెరబండరాజు, కాళోజీలు తెలుగు సాహిత్యంలో ప్రముఖులు. ఈ కోవలో అలిశెట్టి కవిత్వం తప్పక చేరుతుంది. కాలానికి ఎదురీదే భావనలు, ప్రజల జీవితానికి దగ్గరగా ఉండే కవిత్వం, సమాజ గమనాన్ని, కార్య కారణ సంబంధాలను సూక్ష్మంగా దర్శించిన కవిత్వం కలకాలం నిలుస్తుంది అందుకే అలిశెట్టి కవిత్వం రిలవెన్స్ నానాటికి విస్తృతమౌతున్నది.

"అలిశెట్టి ప్రభాకర్" గొప్ప చిత్రకారుడు, మంచి ఫోటో గ్రాఫర్, అనుకరణ లేని కవి. అతని ఏ కవితైనా దృశ్యరూపంగా పురుడు పోసుకొని అక్షరరూపంగా ఛాయాచిత్రమై పదునైన కవిత్వంగా దర్శనమిస్తుంది. సూటిగా తగిలే శబ్దాలు, స్పష్టంగా మెదిలే భావాలు, ధారణకు అనువైన పాదాలు అలిశెట్టి కవిత్వానికి ప్రాణ ధాతువులు. ప్రజల నోళ్లలోని పదాలు ఆయన కవిత శరీరం. ప్రజల నిత్య జీవిత బాధామయ ప్రపంచం అతని వస్తువు, సమాజ స్వరూపాన్ని, వర్గ స్వభావాన్ని కుండ బద్దలు కొట్టడం, మానవీయ సమాజాన్ని నిర్మించడం ఆయన లక్ష్యం. ఎక్కడా తడబాటులేని, మార్మికతలేని, ఊహల్లో బందీకాని కవిత్వం అలిశెట్టిది.

"ఎందుకురా కవీ / గజిబిజి ఇమేజ్ / అస్పష్ట కవిత్వం కన్నా / ఆల్జీబ్రా ఈజీ" అన్న అలిశెట్టి కవిత్వం నిండా స్పష్టమైన భావ చిత్రాలు, శబ్దచిత్రాలు కళ్ళకు అంటుకుంటాయి. మినీ కవిత్వరూపం అతడు ఎంచుకున్న కవిత్వ సాధనం. మనోదృశ్యాన్ని చిత్రంగా మార్చింది అతని కుంచె. అదే దృశ్యాన్ని మాటల్లోకి వొంపింది అతని కలం. రెండూ ఒక బొమ్మను మనోఫలకం మీద ముద్రించేవే. కెమెరా చిత్రంలో ఎప్పుడైనా ఒక దృశ్యం బందీ ఐనట్టు అతని ప్రతీ మినీ కవిత ఒక దృశ్యాన్ని అచ్చు వేసి చూపిస్తుంది. అట్లాంటి దృశ్య పరంపర ఒకచోట అనేక పాదాలకు విస్తరించి సమాజ నగ్నస్వరూపాన్ని లైవ్ షోగా చూపిస్తుంది. పాదాల మధ్య సమతూకం, అంత్యప్రాస, శబ్దశక్తి, ఒక్కసారిగా కళ్లు తెరిపించే చరుపు, కవిత్వానికి పాఠకుణ్ణి దాసోహం అనేలా చేస్తాయి. బాలన్స్ తప్పని ఉపమలు, అభేద సాదృశ్య రూపకాలు, వ్యంగ్య విసుర్లు కవితను పుష్టిగా నిలబెట్టే అతని శక్తిని నిరూపిస్తాయి, ఇది అలిశెట్టికి మాత్రమే స్వాధీనమైన కవితావిద్య.

'నా కవిత' లో "నా గుప్పిట్లో / మండుతూన్న / ఎన్నో గుండెలు..../ ఒక్కొక్కదాన్లో / దూరి / వాటిని చీరి / రక్తాశ్రువులు ఏరి / పరిశీలిస్తాను / నేను" అని తన కవిత లక్షణాన్ని స్పష్టంగా ప్రకటిస్తాడు. దేన్నైనా పోల్చి చెప్పడం, ఆ పోలిక ఆధారంగానే చెప్పాలనుకున్న విషయంలోకి చొచ్చుకుపోవడం, తక్కువ శబ్దాలలో చెప్పడం, ప్రాస పదాలను వాడడం ఈ కవితలో చూడవచ్చు. ధార తెగకుండా కవిత సాగడాన్ని గమనించవచ్చు. ఈ లక్ష్యంతో సాగిన ఇతని కవితా ప్రయాణంలో ప్రతి కవితా ఒక దృశ్య కావ్యమే. సమాజంలోని సంక్షోభానికి కారణమైన చారిత్రిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను అద్దం ఎదురుగా పెట్టి చూపడం అనేక కవితల్లో కనిపిస్తుంది. రాజకీయం నిజ స్వరూపాన్ని రాజకీయం అనే కవితలో "ఒక నక్క / ప్రమాణ స్వీకారం చేసిందట / ఇంకెవర్నీ మోసగించనని / ఒక పులి / పశ్చాత్తాపం ప్రకటించిందట / తోటి జంతువుల్ని సంహరించినందుకు / ఈ కట్టుకథ విని / గొర్రెలింకా పుర్రెలూపుతూనే ఉన్నాయ్" అని ప్రతీకాత్మకంగా సామాన్యునికి కథలాగ చెప్పి వాస్తవాన్ని వ్యంగ్యంగా ముగిస్తాడు. శబ్దాడంబరం లేని ఈ వాక్యాలు ప్రజల నోళ్ళలో నిలిచిపోయాయి.

శ్రమదోపిడీదార్లను, దళారులను, వ్యాపారసంస్కృతిని, సామ్రాజ్యవాద ద్రోహాన్ని పసిగట్టి ప్రజలను చైతన్యపరచడం అనేక కవితల్లో కనిపిస్తుంది. చెమట వ్యాపారం అనే కవితలో "నీ శ్రమ

ఫలం / నీ సమక్షంలోనే పాతి పెట్టబడ్డ / విత్తనం / దాన్నే డబ్బు చెట్టుగా పెంచి / దక్కించుకున్న వాడిదే / పెత్తనం" అని ఉత్పత్తి మిగులు ఎట్లా పెట్టుబడిగా మారి పెత్తందార్లను తయారు చేస్తుందో చెబుతాడు. "చరిత్ర" అనే కవిత ముగింపులో "చరిత్రకు రక్తపాతమే ఉపోద్ఘాతం / చరిత్రకు చెమటబొట్టే ఆధారం / చరిత్రకు ఆకలే ప్రేరణ" అని చరిత్ర సారాన్ని మూడు ముక్కల్లో తేల్చేస్తాడు. ఈనాడు పట్టణాల్లో దర్శనమిస్తున్న అందాల భవంతుల వెనుక ఉన్న అసలు సౌందర్య రహస్యాన్ని ఆనాడే ఇట్లా సిజేరియన్ చేసి చూపించాడు "కృత్రిమ సౌందర్యం" అనే కవితలో "పెట్టుబడి పెదవుల మధ్య / పదునైన షోరూం దంతాలు / మెరవగా / పట్టణాల చెక్కిళ్ళే / నల్ల ధనంతో ఎరుపెక్కితే / అదే – దోపిడీ సంస్కృతికి కృతిమ సౌందర్యం" అని మొదలైన కవిత భావం చివరి వరకు కొనసాగి అసలు విషయాన్ని బయట పెట్టడంతో ముగుస్తుంది. దానివల్ల పాఠకుడు చివరి వరకు ఉత్కంఠగా చదువుతాడు. ఎక్కడా అనవసర శబ్దం లేకుండా శిల్పంగా చెక్కిన కవిత మనస్సులో ముద్రించబడుతుంది. దానినే మళ్ళీ మళ్ళీ పునశ్చరణ చేయిస్తుంది.

ఈ విశిష్ట గుణాల వల్ల అలిశెట్టి కవిత్వం ఆ నోటా ఈ నోటా పాకి విస్తృత ప్రచారమయ్యింది. సమాజంలో అలిశెట్టి ఆశించిన మార్పు నేటికీ ఎండమావిగానే కొనసాగుతుండడం అతని కవిత్వాన్ని నిత్య నూతనంగా నిలబెడుతున్నది. అలిశెట్టి పుస్తకం ఏ పాత పుస్తకాలలోనూ దొరకదు. ఒకసారి చదివిన వారు ఎవరూ దానిని వదులుకోరు. ఆ రోజుల్లోనే ఆయన ఒకేసారి వేసిన నాలుగు వేల ప్రతులు అమ్ముడవడం ఒక రికార్డు. అతని కవితా చిత్రాల ప్రదర్శన ఒక సంచలనం. ఈ మధ్యనే అలిశెట్టి మిత్రులు వేసిన "అలిశెట్టి ప్రభాకర్ కవిత", అక్షర నక్షత్రమ్మీద" పునర్ముద్రణలు పొందడం అతని కవిత్వానికి ఉన్న (రిలవెన్స్) ప్రాసంగికత ఏమిటో చెబుతుంది. ✷

కవిత

# వాడి బ్రతుకో గాలిదీపం..

– అగ్నిశిఖ

నింగి తారల్ని దోసిటపట్టుకొని పురవీధుల్లో అక్కడక్కడా అమర్చి
పుడమికి వెలుగురంగులద్దిన చిత్రకారుడతడు..

ప్రమాదపుటంచులపై పయనిస్తూ..
వాటిని పలకరిస్తూ.. ప్రతిఘటిస్తూ..
చీకటి శిరస్సును నేల కూల్చి వెలుగు స్వర్గాన్ని ఇలకు దించే దినకరుడతడు..

జీవన్మరణాల ఎల్లలు కొల్లగొట్టి.. ఈ జనజీవన స్రవంతికి వినోదాన్నందించే విశ్రమించని విద్యుత్యాంత్రికుడతడు..

నిజానికాతడి జీవితం ఓ యుద్ధం..
కంటికి కనిపించని శత్రువుతో ప్రాణాలొడ్డి పోరాడుతూ.. ఊరంతా వెలుతురు పరిచే కార్మిక బాటసారి..

ఉదయం ఒడిలో పసివాడై పారాడి.. సాయంత్రానికి సైనికుడై కదిలే ఆతని దేహం భూప్రదక్షిణం చేస్తున్న గడియారం..

చీకట్లు కమ్ముకున్న ప్రపంచానికి కాంతి వెన్నెల కురిపించి.. గాఢాంధకారాన్ని తరిమేసే నేలచంద్రుడు..
ప్రజోపకారం చేసే పరోపకారుల సంఘానికతడే ప్రధాన కార్యదర్శి..

నింగి నేలల మధ్య నిత్యం సర్కస్ చేస్తూ.. జీవనం సాగిస్తున్న వాడి బ్రతుకో గాలి దీపం..

మనం కంటున్న మెరుపులు, మనం వింటున్న స్వరాలు, మన వెంటున్న సుఖాలు, మనవంటున్న అవసరాలు..
ఇవన్నీ వాడి భిక్ష..

ఊరికొకడు..
వాడవాడకో తేడు..
అతడు.. రాత్రి ఉదయించే సూర్యుడు.. ✷

కవిత

# మయతెర

– భుజంగరావు కంచరాన

అదొక పెద్దరెక్కల డేగ!
ఎక్కువెక్కువ లాభాలొచ్చే తావుల్ని
నిశిత దృష్టితో కనిపెట్టి
ఖండాంతరాలకు ఎగిరొస్తుంది
వాటంగా వాలిపోతుంది -

ప్రలోభాలకు వెన్నెముకొంచి
లాభాల హామీతో రెడ్ కార్పెట్ పరిచే
కుర్చీలతో దోస్తీ కడుతుంది
స్వలాభం తప్ప
మరి దేనికీ పూచీ లేనిచోట
చెమట చుక్కల నోట్లో మట్టికొట్టి
పంటపొలాల కంట్లో బుగ్గిపోసి
పచ్చని చిగుళ్ల ఊపిరి తీస్తుంది -

చుట్టుపట్టు ఆవాసాల్లో
గుట్టుమట్లు గుప్పిట పట్టి
ప్రాణాంతక చిరు కొలువుల్లో
స్థానికులకు చోటిస్తుంది
సంక్షేమం ముసుగును తొడిగి
సామాజిక బాధ్యత పేరిట
ఊరూరా బ్యానర్లు పోస్టర్లేసి
మందిని మచ్చిక చేసుకుంటుంది -

శేరీలో రాజాబాబుకి
కారొక్కటి కొనిపెడుతుంది
లోవలోని పైడిరాజుకి
బంగ్లాని బహుమతిస్తుంది
కూలిజనం కిమ్మనకుండా
వారిలోని తనవాడొకడికి
అవసరాలు కనిపెడుతుంది!

కాంట్రాక్ట్ లేబర్ కోసం
బ్రోకర్లను బలిపిస్తుంది
ఆపదలో తోడుండాలని
ఖాకీలను,చెంచాగాళ్ళను
నెలవారీ బులిపిస్తుంది -

అదొక ఇనుప కాళ్ల ఎనుము
అప్పనంగా సహజ వనరుల్ని
అబ్బినంతా తోడేస్తుంది
అంగుట్లో కొండల్నైనా గుటకేస్తుంది!
అదొక ఉక్కుగోళ్ళ ఎలుగు
బంగారుపుట్టల జాడ జల్లెడ పట్టి
తవ్వి తవ్వి వాటిని నేలమట్టం చేసి
బడుగు బతుకుల్ని బుగ్గిపాలు చేసి
మరోపుట్ట బకిరేందుకు
బయలెల్తుంది -


అదొక తడిగుడ్డ చాటు కత్తి
ప్రజారోగ్యం గొంతుకపై మెత్తగా
నొప్పి తెలియకుండా దిగబడి
నెత్తురు పీల్చి సత్తువలూడ్చి
జీవచ్ఛవాలకు వైద్యం చేయిస్తుంది -

అది జనం కళ్ళ ముందే
చీకటి పరిచే రంగుల మయతెర!
చిమ్నీ నాసికలనుంచో
గొట్టాల పాయువునుంచో
విషాన్నంతా విసర్జించి
పచ్చనాకు పాడెమీద
నీటిబొట్టు శవయాత్రలో
గాలి తరకల ముక్కుపిండి
లాభాల కాసుల్ని ఏరుకుంటుంది -

అదొక బహురూపి
అదొక జిత్తులమారి ఆశబోతు
అదొక దురాక్రమణదా(రి)రు
బహురూప వాణిజ్యమంతా
దానికి భలే మంచి చౌకబేరమే!
బహు దేశ పాలకులంతా దానికి
'కాల్మొక్కుతా బాంచెన్' అనేటోళ్లే!
దాని సంక్షోభం ప్రపంచ సంక్షోభం!
దాని బలుపు ప్రపంచానికి వాపు!

ప్రత్యక్షంగా ఒకలా
పరోక్షంగా మరోలా
అబ్బినకాడికి దొబ్బేయడానికి
దేశ దేశాల సరిహద్దులు దాటి
వేషాలు మార్చి అవతారాలు మార్చి
స్వార్థ ప్రయోజనాల చిరునామాగా
అసలేదో ఎవ్వరూ గుర్తించలేనన్ని
బహుళ రూపాలకు బహువచనంగా
బతుకు చెట్టు తల్లివేరునే
కొరికేస్తున్న చీడ పురుగది -

ప్రభుత్వాలను శాసిస్తూ
ప్రతి మెదడును నియంత్రిస్తూ
ప్రతి అడుగును కుంటుబరుస్తూ
ప్రతినేలను అప్పులకుప్పగా
లోబర్చుకుని
కొద్దిమంది పేర్చుకున్న పోగుల కింద
మార్కెట్ వస్తు సంచయంలో ఒకటిగా
మనిషిని కూడా చేర్చుకుని
ఈ యుగాన్ని శాసిస్తున్న నల్లడబ్బు
నల్ల చట్టాల అక్రమ సంతానం
... బహుళ జాతి పెట్టుబడి!
దాని సమాధి మీద పువ్వు పూస్తేనే
ఈ చీకటి తెలవారేది!



# బాల సాహితి

## రైతురా ఓహో రైతురా

- సిమ్మ ప్రశాంతి, 10వ తరగతి

**రైతురా** ఓహో రైతురా మనలోనే ఉంటాడు
మన వెనకే ఉంటాడు
మనతోనే జీవిస్తడు మనలో ఒకరై ఉంటాడు ॥ రైతురా ॥

లక్షలాది ఎకరాలను కంపెనీల్కి కట్టబెట్టి
రైతును అప్పులో ముంచి ఊబిలోకి నెడుతున్నారు
॥ రైతురా ॥

భూములు లేకుంటే రైతన్నకు బతికేది ఓరన్నా
మనల్ని బతికించేదెవరు? అన్నం పెట్టేర దేవుడు ఏడి
॥ రైతురా ॥

చట్టాల్ని చేయించి రైతును బాధపెడుతున్నారు
రైతుల మెడ చుట్టు ఉరితాడులా బిగించే చట్టాలివి
॥ రైతురా ॥

రైతులు పండించే వ్యవసాయం
భూములు కాంట్రాక్టు వ్యవసాయం
రైతన్న భూమిని నీరుకట్టి వ్యవసాయం
ఆ భూమి రైతన్న కన్నీటితో పదునెక్కె ॥ రైతురా ॥

ప్రపంచమే తన ఇల్లురా
అందరి ఆకలి తీర్చాలంటు
కష్టపడే మన రైతన్నరా ॥ రైతురా ॥

సంక్రాంతి వచ్చిందంటే
కనుల విందుగా రైతు పండగ
పంటలేని పండగ
పట్నానికి వలసెళ్ళె ॥ రైతురా ॥

ఎందరో రైతుల నుండి భూములు దూరం చేస్తున్నారు
రైతన్నలు మన ఆకలి తీర్చే అమ్మలురా
అమ్మల బాధపెట్టి చంపకురా ॥ రైతురా ॥ ✸

## తరగతిగది మనకు నేర్పిస్తుంది

- గోళ్ళ సంతోష్, 9వ తరగతి

**తరగతిగది** మనకు నేర్పిస్తుంది
జీవితమనే రంగుల కెరటాలు మధ్య ఈదటం నేర్పిస్తుంది
తరగతిగది మనకు నేర్పిస్తుంది
తడి ఆరిపోయిన ఓటమి అనే ఇసుకతిన్నెల మధ్య అడుగులు
వేయడం నేర్పిస్తుంది
తరగతిగది మనకు నేర్పిస్తుంది
మబ్బులనే తెల్లని కాగితాల మీద
అక్షరాలు చెక్కడం నేర్పిస్తుంది
తరగతిగది మనకు నేర్పిస్తుంది
స్నేహమనే గుర్తులను కూర్చు కోవడము నేర్పిస్తుంది తరగతిగది
మనకు నేర్పిస్తుంది
ఎదురుచూపులు వెంట
పయనించడం నేర్పిస్తుంది
మనం నేర్చుకుంటాం
తరగతి గది నుండి నేర్చుకుంటాం
తెలియని ఊహలను ఊహించడం నేర్చుకుంటాం
ప్రతి ఆనంద క్షణాన్ని
స్పర్శించడం నేర్చుకుంటాం ✸

**విలువలకై పోరాటము**
**నిలుపంగలవారు మేటి నిజముగ నెపుడున్**
**తెలుపంగ వారి సేవలు**
**కొలువై నిలబెట్టునట్టికోటలు చందూ!**

**జీవితమే ఆరాటం**
**జీవన పోరాటపు జీవిక తామై**
**భావన భాగ్యమ్ములతో**
**భావితరాలకును పూచీ భారత రైతుల్!**

**చూస్తూకూర్చోకెప్పుడు**
**చేస్తూపోయేదానికి చేవలు మెండున్**
**కోసే సొరకాయలకును**
**వేసే విత్తన ఫలమ్ము వేరే చందూ!**

చందు నాగేశ్వరరావు

పరిచయం :

# అమ్మకథ

## (మదర్ తెరిసా జీవితం - గేయ రూపంలో)

**క్యాథరిన్** స్పింక్ ఇంగ్లీషులో ప్రామాణికంగా రచించిన 'మదర్ తెరిసా' జీవిత చరిత్రను తెలుగులో చిటిప్రోలు వెంకటరత్నం గేయానువాదంగా అందించారు.



చిటిప్రోలు వేంకటరత్నంది గుంటూరు జిల్లాలోని దాచేపల్లి మండలానికి చెందిన జిట్టగామాలపాడు. తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. తెలుగులో సాహిత్య వ్యాసాలు, కవితలు, నాటకం మొత్తం ఐదు గ్రంథాలు రచించారు.

మదర్ తెరిసా అనాథలనూ, దీనులనూ, మృత్యుముఖంలో వున్నవారినీ ఆదరిస్తూ స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీ – ధార్మిక మతసేవక బృందం కార్యక్రమాలపట్ల ఆకర్షితులైన రచయిత ఈ బృహత్కార్యానికి పూనుకున్నారు. ఇంగ్లీషులో వచనంలో వున్న గ్రంథాన్ని తృస్యగతిలో గేయ రచనగా దీనిని అనువదించారు. క్రైస్తవేతరుడైన రచయిత క్రైస్తవ మతానికి చెందిన పదజాలాన్ని, ఆచారాలను, వ్యవహారాలను క్షుణ్ణంగా అర్థం చేసుకొని చేసిన అనువాదం ఇది. దీనిని రచయిత గుంటూరుజిల్లాలో వైద్యులుగా పనిచేసిన సేవామూర్తి డా॥ మేరీ గ్లోరీకి అంకితమిచ్చారు.

మదర్ తెరిసా జీవితంలోని ముఖ్యఘట్టాలన్నిటినీ మొత్తం 1/4 డెమ్మీ సైజులో 784 పుటల్లో గేయ రూపంలో దీనిని వెలువరించారు. హోలీ కమ్యూనియన్‌కు దివ్య మేళనం అనీ, సెయింట్‌హుడ్‌కు పునీతత్వం అనీ, సెయింట్‌కు పునీతుడు అనీ, హోమ్ ఫర్ ది డైయింగ్‌కు మృత్యుముఖస్తులగృహం అనీ చక్కని అనువాదాలు చేశారు. ఇది క్రైస్తవ మత ప్రచారానికి చేసినది కాదు అని చెప్పారు. అయితే, పదాల కలయిక, విడదీయటంలో అచ్చువేసినపుడు తగు జాగ్రత్త వహిస్తే బాగుండేది. ఉదాహరణకు : 'పనిచేయా లని', 'ప్రపంచాని కీవిధంగా', 'అతీత మైన' (పుట 7) అనే పదాలను విడదీసినట్లు, ప్రతి పుటలోనూ పలు పదాలున్నాయి. అయితే తెరిసామాత (మదర్ తెరిసా) జీవనఘట్టాలలో లీనమైన పాఠకులు వీటిని పట్టించుకోరు.

వేంకటరత్నం తన విలువైన సమయాన్ని, ఈ అనువాద యజ్ఞానికి ఉపయోగించి, కొన్ని లక్షలు ఖర్చుపెట్టి ఈ 784 పుటల గ్రంథాన్ని రచించి ప్రచురించారు.

1/4 డెమ్మీలో 20+784 పుటలు.

ఈ గ్రంథం వెల : రూ. 680/– ప్రథమముద్రణ : 2020. ప్రతులు : 500/–

ప్రతులకు : శ్రీమతి చిటిప్రోలు జయప్రభ, ఫ్లాట్ నెం. 101, హైవే హైట్స్ అపార్ట్‌మెంట్స్, ఆర్టీసీ కాలనీ, కపర్దినగర్, కాకాని రోడ్డు, గుంటూరు. సెల్ : 77023 58616.

# మహారాష్ట్ర హైకోర్టు ఔరంగబాద్ బెంచి అద్భుతమైన తీర్పు

**ఈనెల** ఐదున మహారాష్ట్ర హైకోర్టు బెంచి.... టీవిలలో వచ్చే అశాస్త్రీయ ప్రకటనలు, వాటిని ప్రచారం చేసే సెలెబ్రిటీలు, ఆ పరికరాలు అమ్ముతున్న సంస్థలపైనా కేసులు నమోదుచేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని అదేశించింది.

మంత్రించిన అష్టలక్ష్మియంత్రాలను కొనుగోలుచేసినవారికి అష్టైశ్వర్యాలు వనగూరుతాయని, పిల్లలులేని వారికి మాలేహ్యం టీలో కలుపుకొనితాగితే ఇంటి నిండా పిల్లలుపుడతారని (ఇంకానయం విషంలోకలుపుకొని తాగమనలేదు). సారాయితాగేవారికి, బీడీలుతాగేవారికి మేమిచ్చిన మందు రెండుబొట్లు వారికి తెలియకుండా అన్నంలో కలిపి పెట్టినట్లైతే, తాగుడు, బీడీలుతాగటం మటుమాయం. మోకాళ్ల నొప్పులవాళ్ళు మా మందుపూసుకుంటే గంటలోనే గోడలుదూకేస్తారు. హనుమాన్ చాలీసా మంత్రించిన ఈ తాయత్తు మెడకు చుట్టుకుంటే హనుమంతుణ్ణి నెత్తిన ఎక్కించుకున్నట్లే. అన్నీశుభాలే. ఇంకా రంగురాళ్లు, సంఖ్యాశాస్త్రాలు, రుద్రాక్షలు, ఇలాంటివాటన్నిటిపైనా..

ఇవన్నీ అమాయకజనాన్ని దోచుకోటానికి జరగుతున్న ప్రచారాలే కనుక వీటిని ప్రసారంచేసే టీవి ఛానెల్స్‌పైనా, సెలబ్రెటీలపైనా, వస్తువులను అమ్మేవారిపైనా, మూఢనమ్మకాల నిర్మూలనా చట్టం క్రింద కేసులు బుక్ చెయ్యమని ఇచ్చిన తీర్పు ఇది.

గల్పిక

# రేటు + వేటు = ప్రైవేటు

- శంకరం

**నమస్కారమండీ!** నా పేరు గౌరీసు, ఒకప్పుడు నన్నందరూ గౌరీ అని పిల్చేవోరు. నానప్పుడు పదో తరగతి సదువుతున్నానులెండి. ఇప్పుడు పెద్దోణ్ణైపోయేను కదా అందుకనే అట్టా పిలుత్తున్నారు. అంటే పదో తరగతి సదివి మానీసేన్లెండి. మనం సదివిన సదువుకి గవుర్మెంటుజ్జోగం ఎవుడిత్తాడు? అందుకని మాకు దగ్గిర్లో వున్న లారస్ కంపెనీకి ఎల్తన్నాను. ఇదేట్రా ఈడి గొడవంతా మాకెందుకనుకుంటన్రా?

సెప్తాన్లెండి, దానికో కారణవుంది. నానంటే పదో తరగతి సదివి మానీసేను గానీ, మా జట్టుగాళ్ళు.... అదేనండీ క్లాసుమేట్స్.... పెద్ద సదువులు సదివినోల్లూ, యాపారాల్జేత్తూ నాలుగు సేతులా సంపాదిత్తున్లోల్లూ, నాలాగ సిన్నా సితకా పన్లు జేసుకునీవోల్లూ ఆ మద్దిన మా ఊళ్ళో కలుసుకున్నాం లెండి. దాన్నేవంటారు....? ఆ... గేపకవొచ్చింది. గెట్టుగెదరు.... అదే కదా! మనుసుల మద్దిన సమ్మందాలు తగ్గిపోయినై కదండీ, అందుకని ఏదోలాగ నలుగురు కలుసుకునే దానికి మొకం వాసిపోయి ....ఇగో ఇలాగ గెట్టుగెదర్లెట్టుకుంటన్నారు. సరే మావు గూడా ఎట్టుకున్నాం అని సెప్పేను గదండీ. ఎట్టుకున్నాక అక్కడితో ఆగిపోకూడదు కదండీ. అందుకని ఓ వాట్సప్పు గ్రూపు తగిలించీనారండి.

ఇగ సూస్కోండి.... ఇప్పుడు మనది డిజిటల్ ఇండియా గదండి.... సెల్ఫోను లేకపోతే మా సెడ్డ అవమానం జరిగినట్టే.... మల్లీ మామూల్ది గాదండోయ్.... దానికి నెట్టుండాల. మనోల్లందరూ వాట్సాప్ వీరులు గదండీ.... కుప్పలు కుప్పలుగా మెసేజ్‌లు దంచెత్తన్నారు. ఒకలేమో భక్తి సందేశాలు.... ఒకలేమో రక్తి సందేశాలు.... ఇంకొకలేమో యాత్రా వివరాలు.... మరికొందరేమో రాజకీయాలు.... ఇంకొందరుంటారు.... ఈల్లు పొద్దున్న లెగంగానే గుడ్‌మార్నింగ్ మెసేజ్‌లు.... ఇంకొకాయ నుంటాడు ఈయనకి మహా బిజీ.... ఈయన ఠంచనుగా ప్రతి ఆదివారం మాత్రం ఫ్రెండ్స్ అందరికీ ఒక గుడ్‌మార్నింగ్ పడేసెస్తాడు....

సారీ, ఇది మాకందరికీ తెల్సిన తంతే గదా.... ఇందల కొత్తేముంది.... ఎందుకీ సొదంతా అనకండి, పాయింటుకొచ్చెత్తన్నాను. నా సంగతికొస్తే, ఎప్పుడైనా నా మనసుని కదిలించిన సంగతులేవైనా ఉంటే మావోళ్ళతో పంచుకుంటాను. మళ్ళా దాని మీద ఆల్లేటి పెట్టారో సూడను. మొన్ననోపాలి బేంకుల్ని, ఎల్లైసీని, స్టీల్‌ప్లాంటునీ ప్రైవేట్ చేసెస్తన్నారని బాదపడి, నేను ఓ పోస్టింగెట్టేను. దానికి మా ఫ్రెండొకాయన స్పందించేరండి. ఈయన సూరత్ నుండి ఆంధ్రప్రదేశ్ వరకు గల బట్టల వ్యాపారులకు సరుకులు (బట్టలు) అరువుపై ఇప్పించి, ఆ డబ్బుల్ని వసూలు చేస్తూ కమీషన్ వ్యాపారం (ప్రైవేటు) చేస్తాంటారండి. ప్రైవేటు వ్యాపారం కదండీ.... అందులోనూ గుజరాత్ సొమ్ము తింటున్నారాయె. దాంతో మన పెద్ద గెడ్డపాయనంటే వల్లమాలిన భక్తండీ (ఇద్దరూ దేశభక్తులు కూడానూ).

ఆయన స్పందించేరన్నాను గాదాండి.... గవుర్నమెంటు బేంకుల్లో ఉజ్జోగస్తులు బాద్యతగా పన్జేయడం లేదు.... డబ్బునోల్లకే అప్పులిత్తన్నారు గానీ బీదోల్లకివ్వడంనేదు.... ఆ అప్పుల్దీసుకున్న బలిసినోల్లు దేశవొగ్గేసి పారిపోతున్రు... అందుకనే బేంకులు దివాలా తీస్తన్నాయి. అందుకనే పెద్దాయన ఆట్ని ప్రైవేటోల్లకి అప్పజెప్పెద్దావని నిర్ణయించీసినాడు. మగాడంటే ఆయనేరా.... అని పోస్టింగెట్నాడండి. ఈయన ఇంకో మాట కూడా అన్నారండి.... కరోనా కాలంలో ప్రైవేటు ఉజ్జోగులు సగం జీతాలే తీసుకున్నారు, అదే గవర్నమెంటు ఉజ్జోగులు సిఎం, పిఎంల ముక్కులు పిండి మరీ జీతాలు వసూలు చేసారు అన్నాడు.

దానికి మరో ఫ్రెండు.... ఈయన మావూళ్ళో మాంచి పేరున్న లాయరు. మాటల్తో బోల్తా కొట్టిస్తూనే ఎదుటోల్లని మాటలు బాగా నేర్చావబ్బాయ్ అంటాడు. ఈయనొక పోస్టింగెట్టాడు : "ఉజ్జోగస్తుల ఒళ్ళు వంగడం మాట అటుంచి, ప్రజలందరి ఇళ్ళు గుల్లవుతాయి. 'కరోనా కాలంలో గవర్నమెంటు ఉజ్జోగస్తులకు జీతాలొచ్చాయి కానీ ప్రైవేటు వాళ్ళకి జీతాలు లేవు' అని గోల పెట్టిన నువ్వే ప్రభుత్వ సంస్థల్ని ప్రైవేటుపరం చేయాలనడం విడ్డూరంగా వుంది".

సూరత్ వ్యాపారి పెట్టిన పోస్టింగ్‌కు స్పందించిన గోపాలంగారు.... ఈయన ఒక ప్రభుత్వ కళాశాలలో ఉపన్యాసకుడు (లెక్చరర్), కాసింత కళాపోషణ, సాహిత్యాభిలాష, సామాజిక చింతన గలవాడు. ఈయనొక పోస్టింగ్ పెట్టాడు. అది వైజాగ్ పోర్టుకు సంబంధించి 1988లో పోర్టు ఛైర్మన్‌గా పనిచేసిన పివిఆర్‌కె ప్రసాద్‌గారు రాసిన 'అసలేం జరిగిందంటే' అనే పుస్తకంలోని ఆయన అనుభవాలు. "1988లో కేంద్రం దేశంలోని ఓడరేవుల అభివృద్ధికి, రాబోయే పదేళ్ళలో ఎగుమతులు, దిగుమతులు పెంచడానికి ఏం చెయ్యాలి అనే దానిపై ప్రణాళిక సిద్ధం చేసే పని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిపుణులకు అప్పగించిందట. వాళ్ళేదో కాకి లెక్కలు వేసి పోర్టు ట్రాఫిక్‌ని 2000 సం॥ నాటికి బ్రహ్మాండంగా పెంచేయవచ్చునని నివేదిక ఇచ్చారట. అయితే పోర్టుకు ఎగుమతి చేయాల్సిన సరుకుల్ని 75 బోగీలున్న గూడ్సు బళ్ళ పోర్టు రైలింజన్ల ద్వారా తీసుకొచ్చి సైడింగ్ అనే ప్లాట్‌ఫాం మీద దించుతాయట. వైజాగ్ పోర్టులోని ఆ సైడింగులు చాలా చిన్నవట. ఒక గూడ్సు బండిలోని సరుకుల్ని దించడానికి 4, 5 రోజులు పట్టేదట. దానికి తోడు పోర్టు రైలింజన్లు ఇక్ష్వాకుల కాలం నాటివట. ఎన్ని సంవత్సరాలు నుండో సైడింగులను పెద్దవి చేయమనీ, రైలింజన్లు కొత్తవి తెప్పించమని పోర్టు అధికార్లు విన్నవించుకుంటున్నా ఆ దరఖాస్తులన్నింటినీ చెత్తబుట్టల్లో పడేస్తున్నారే తప్ప చెవికెక్కించుకోవడంలేదట. ఆ విధంగా ప్రభుత్వరంగ

సంస్థల్ని నిర్వీర్యం చేసి, నష్టాల్లోకి నెట్టి వాటిని కార్పొరేట్లకు అప్పగించడమే ఆనాటి నుండి నేటి వరకూ కొనసాగుతూ వస్తోందట."

దీనికి మరలా స్పందిస్తూ సూరత్ వ్యాపారి ఒక ప్రముఖ వ్యక్తి ఇంటర్వ్యూ వీడియోను పెట్టారు. ఈయన ప్రభుత్వ సర్వీసులో ఒక ఐ.ఏ.యస్. అధికారిగా పనిచేస్తూ ప్రభుత్వంపై ఏవగింపుతో ఆయనే స్వయంగా ఒక రాజకీయ పార్టీ స్థాపించి దేశాన్ని ఉద్ధరించాలనుకున్నాడు. ఇప్పుడు ఛానెల్స్‌కి ఇంటర్వ్యూలు ఇచ్చుకుంటున్నాడు. అటువంటి ఒక ఇంటర్వ్యూనే సూరత్‌వారు పెట్టారు. ఆయనంటారు కదా – ప్రభుత్వరంగ ఉద్యోగులు కష్టపడి పనిచేయడంలేదు, అందుకనే ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఒకదాని వెంట మరొకటి దివాళా తీస్తున్నాయి అని. కనుక అభివృద్ధి చెందిన దేశాలన్నీ అమలుచేస్తున్నట్టుగా మనం కూడా అన్నిటినీ ప్రైవేటుపరం చేసేస్తే అప్పుడు ఉజ్జోగులు చచ్చినట్టు కష్టపడి పనిచేసి సంస్థకు లాభాలు తీసుకువస్తారని. అప్పుడు ఆ ఇంటర్వ్యూ చేస్తున్న పెద్దమనిషి "లాభాలు ప్రభుత్వానికీ, ప్రజలకూ కదండీ చెందాల్సింది.... ప్రైవేటు వ్యక్తులు పట్టుకుపోతే సమాజానికి ఏం ఒరుగుతుంది? పైపెచ్చు ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటువాడి చేతిలో పెడితే ఖర్చులు తగ్గించుకోవడానికి చాలమంది ఉజ్జోగుల్ని పనిలోనుండి తీసేస్తాడు, ఉన్నవాళ్ళకి కూడా వేతనాలు, ఇతర సౌకర్యాలు తగ్గించేస్తాడు" అని. అవతలి పెద్దమనిషి ఏదో చెప్పి తప్పించుకున్నాడనుకోండి కాకపోతే!

దీనికి మరలా స్పందించిన గోపాలంగారు "ప్రభుత్వం వ్యాపారం చేయదు. అని కదా మన అపర దేశభక్తులు ప్రవచించారు. దీని వెనుక చాలా లోతైన అర్థం వుంది. – యువత భవిష్యత్తు మొత్తం కార్పొరేట్ వ్యవస్థ చేతుల్లోకి వెళ్ళిపోతుంది. తెలివైన వాడిదే భవిష్యత్తు, రిజర్వేషన్ వ్యవస్థ దానికదే సమాధి చేయబడతాది. పెన్షన్ అనే పదమే తర్వాతి తరానికి తెలియకుండా పోతుంది. ప్రతి మనిషీ చచ్చినట్టు ఆరోగ్య భీమా చేయించుకోవాల్సిందే" అంటూ భవిష్యత్తు చిత్రపటాన్ని కళ్ళముందుంచారు.

ఆవేశం తగ్గని గోపాలంగారు మరుసటిరోజు ఉదయం బి. నరసింహారావుగారి పోస్టింగ్ ఒకటి పెట్టారు. ఆయనేమంటున్నారంటే "సంపద సృష్టికర్తలు కార్పొరేట్లు కాబట్టి వారిని దేశం గుర్తించి, గౌరవించాలి – అని మొదటిసారి పదవీకాలం ముగిసేటప్పుడు మోడీ విస్పష్టంగా చెప్పారు. పాపం! ఈ మాటలకు అర్థం, అంతరార్థం అప్పుడు తెలియలేదు దేశ ప్రజలకు. ఇప్పుడు జరుగుతున్న ఒక్కొక్క పరిణామాన్ని చూస్తూ 'ఔరా' అని ముక్కు మీద వేలేసుకుంటున్నారు.

కరోనా విజృంభించిన నేపథ్యంలో 14 కోట్లమంది ఉపాధిని కోల్పోయారు. ప్రాణభయంతో పదిమంది భౌతికంగా కలవలేని పరిస్థితి. ప్రజల ఈ నిస్సహాయ పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకొని – ఇప్పుడు కాకపోతే ఇక ముందు కుదరదు – ప్రజలు తెప్పరిల్లక ముందే దెబ్బ పడిపోవాలని అనుకున్న నిర్మలమ్మ వంటి దేశభక్తులు రైతు వ్యతిరేక చట్టాలు చేయడం, అయినకాడికి ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ అమ్మివేయడం, విలీనం చేయడం లేదా మూసివేయాలని లోగుట్టు విప్పారు" అన్నారు.

ఇవన్నీ చదువుతూ అగ్నిపర్వతంలా లోలోన రగిలిపోతున్న ఒక వ్యక్తి.... ఈయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నీటి పారుదల (పారుదల లేని) శాఖలో ఒక ఉన్నతాధికారి. గత 3, 4 సం॥లుగా పనిలేకుండా (ప్రభుత్వాలు పనులేవీ చేయనందున) జీతం తీసుకుంటూ అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలను (అంటే అధినేతలను) సంస్కృత భాషలోని తనకు తెలిసిన, తెలియని పదాలతో సత్కరిస్తూ, తీవ్ర అంతర్మథనానికి గురై చివరికి బాల్య స్నేహితుల వద్ద కూడా తన అక్కసును వెళ్ళగక్కుతూ వుంటాడు. ఈయన ఒక పోస్టింగ్ పెట్టాడు.

"ఒరే పిచ్చి సన్నాసుల్లారా! ప్రైవేటు, పబ్లిక్కూ అని కొట్టుకు ఛస్తూ, ఇదంతా నిన్నగాక మొన్నొచ్చిన మోడీయే చేస్తున్నాడని భ్రమ పడుతున్న మిమ్మల్ని చూస్తుంటే నవ్వొస్తుంది, మన తెలుగువాడు పాములపర్తి వెంకట నరసింహారావుగారు ప్రధానిగా చేసినప్పటి (1991) నుండే ఈ ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ఎల్పీజీ పేరుతో భారతదేశంలో మొదలయ్యాయి. అప్పట్నుండే విదేశాల సరుకులు, విదేశీ కంపెనీలు మన దేశంలో ఇబ్బడి ముబ్బడిగా ప్రవేశించాయి. ఒక్కొక్క ప్రభుత్వరంగ సంస్థనీ మూసేయడమో, కార్పొరేటువాళ్ళ పరం చేయడమో మొదలైంది. మీకు జ్ఞాపకముండే వుంటుంది. మనకు ఉజ్జోగాలొచ్చినా, పెళ్ళిళ్ళైనా హెచ్ఎంటి వాచీలు కొనుక్కోవడం అదొక గొప్పగా అనుకునేవాళ్ళం. అలాగే ఆల్విన్ కంపెనీ వాచీలు, ఫ్రిజ్‌లు దేశ మార్కెట్‌ని ఒక ఊపు ఊపాయి. అలాంటిది వాటన్నిటినీ నష్టాల్లోకి తీసికెళ్ళి టాటా వాడికీ, నిస్సాన్ వాడికీ అమ్మిపారేసారు."

సరిగ్గా అప్పుడే ఈ పోస్టింగులన్నీ చూస్తున్న మా హైద్రాబాదు మిత్రుడు ఒక పోస్టింగ్ పెట్టాడు. "నేను అప్పట్లో ఐడిపిఎల్ మందుల కంపెనీలో పన్జేసానని మీలో కొంతమందికి తెలిసే వుంటుంది. ఆ రోజుల్లో ఐడిపిఎల్‌కి దేశంలో ఎంత పేరుండేదో నేను చెప్పనక్కర్లేదు. మలేరియా మందులు, ఓఆరెస్ వంటి అత్యవసర మందులు తక్కువ ధరలకే పేదలకు అందుబాటులోకి తెచ్చింది. బల్క్ డ్రగ్స్‌ని పెద్ద మొత్తంలో సరఫరా చేసిన కంపినీ. అటువంటి దాన్ని కొందరి స్వార్థం కోసం నష్టాల బాట పట్టించి 1996లో మూసిపారేసారు. ఆ తర్వాతే రెడ్డీ లాబ్స్ వంటి కంపినీలు పుట్టుకొచ్చాయి. ఉజ్జోగస్తులందరిచేతా కంపల్సరీ రిటైర్‌మెంటు చేయించేసారు. కోర్టు మెట్లెక్కాం కాబట్టి కొంత మొత్తమైనా కళ్ళజూసాం. అప్పటికీ నాకు గవర్నమెంటు జాబ్‌కి ఏజ్‌బారైపోవడంతో, మళ్ళీ నానా తిప్పలు పడి ఇప్పుడు చేస్తున్న ప్రైవేటుజ్జోగం వెతుక్కోగలిగాను. లేకపోతేనా...." అంటూ ముగించాడు.

అక్కడితో అప్పటికి ఈ చర్చ ఆగింది. ఆ తర్వాత వచ్చిన ఆదివారం నాడు, మరొక ఫ్రెండు.... ఈయన ముందు ఏదో టెలిఫోన్ కంపినీలో ఇంజినీరుగా పన్జేసేవోడు. ఎందుకో తెల్దుగానీ అందులో మానీసి, మళ్ళీ సివిలింజినీరుగా పన్జేస్తన్నాడు. ఈయన ఆదివారంనాడే తీరిగ్గా కూసుని మా ఫ్రెండ్సెట్టిన పోస్టింగులు చూత్తాడు. ఎట్టాలనిపిస్తే ఆయన కూడా ఇగో ఇలాగెడతాడు. "ప్రైవేటైజేసన్ మీద బాగానే డిస్కషన్ చేసారబ్బాయ్, నేనివాళే చూసాను. మన జగ్గుగాడికి, కృష్ణగాడికీ తెలుసు.... నేను ముందు వియస్సెన్నెల్ (VSNL).... అంటే విదేశీ సంచార్ నిగమ్ లిమిటెడ్‌లో టెలిఫోనింజనీర్‌గా పన్జేసాను. 2002లో ఇప్పుడున్న

భారతీయ జనతా గవర్నమెంట్, వాజ్‌పేయి పి.యమ్ అప్పుడు, కంపినీలోని 26 శాతం వాటాని టాటా వాడికి అమ్మేసింది. టాటావాడు 50 ఏళ్ళు పైబడిన దాదాపు 1500 మంది ఉజ్జోగుల్ని తీసిపారేసింది. నేను మాత్రం ముందే జాగ్రత్తపడి స్టేట్ గవర్నమెంట్‌లోకి వచ్చేసాను. అందులోనే వుంటే నా పని ఏమయ్యేదో..."

మా గ్రూపులో ఇలా చర్చ జరుగుతున్న టైమ్‌లోనే నాకు బాగా పరిచయమున్న ఒక మాస్టారు, రైల్వేలు ప్రైవేటైతే పరిస్థితి ఎలా ఉండవచ్చో వెటకారం చేస్తూ తీసిన ఒక వీడియోను పెట్టారు. ఆ సంభాషణ వినాల్సిందే. ఒక ప్రయాణీకుడు ట్రైన్ రిజర్వేషన్ చేయించుకోవడానికి ప్రైవేటు రైల్వే బుకింగ్ సెంటర్‌కి ఫోన్ చేస్తాడు. కౌంటర్‌లో వున్న ఒక అమ్మాయికీ, ప్రయాణీకుడికీ మధ్య సంభాషణ ఇలా వుంది చూడండి.

ప్ర : నా వెబ్‌సైట్ సరిగా పనిచేయనందున మీకు ఫోన్ చేస్తున్నాను.

అ : వెరీ గుడ్‌మార్నింగ్ సర్! దిసీజ్ గోవిందా ప్రైవేట్ రైల్వేస్. నేను మీకు ఏవిధంగా సహాయపడగలను?

ప్ర : హైద్రాబాద్ నుండి రాజమండ్రికి ఒక స్లీపర్ టికెట్ కావాలండి.

అ : సర్, అన్నీ కలిపి రూ. 1050లు అవుతుందండి.

ప్ర : ఆశ్చర్యంగా.... అదేంటీ అంతుంది.... రీసెంట్‌గానే చూసాను రూ.450లు వుంది గదా?!

అ : అది పండగ సీజన్ అయ్యి వుండదు సర్, పైగా మీరు వారం మధ్యలో.... అంటే ఏ బుధవారమో, గురువారమో చూసుంటారు....

ప్ర : నాకర్థంకాలేదు, అంటే మీకు సీజన్‌కు ఒకలాగ, రోజుల్ని బట్టి ఒకలాగ ఉంటాయా టికెట్ రేట్లు?

అ : అవును సర్, పండగకు ఒక వారం ముందు నుండీ, పండగైపోయిన ఒక వారం వరకూ సీజనల్ ఛార్జెస్ ఎక్స్ట్రా రూ. 200లు ఉంటాయండి.

ప్ర : అలా చూసుకున్నా టికెట్ రేటు అంత ఎక్కువ ఎలా అయ్యింది?

అ : చెబుతున్నాను సర్, సాధారణంగా మంగళ, బుధ, గురు వారాల్లో టికెట్ రేట్లు తక్కువగానే వుంటాయి. పండగలు లేని సమయాల్లో కూడా తక్కువగానే ఉంటాయి. అందుకే అన్నీ కలిపి మీకు రూ. 1050లు చెప్పాను సర్.

ప్ర : చాలా సంతోషం. ఎలాగూ రేటు ఎక్కువ తీసుకుంటున్నారు కాబట్టి లోయర్ సీటు ఇవ్వండి.

అ : తప్పకుండా సర్, కాకపోతే లోయర్ సీటుకు రూ.100లు ఎక్స్ట్రా పే చెయ్యాల్సుంటుంది సర్.

ప్ర : (నెత్తి కొట్టుకుంటూ) అయితే సైడ్ సీటివ్వండి.

అ : సైడ్ సీటైతే రూ. 200లు ఎక్స్ట్రా సర్.

ప్ర : ఏంటండీ ఈ దారుణం? ట్రైన్లో టాయిలెట్స్‌కి తప్ప అన్నిటికీ రేట్లున్నట్టున్నాయే?

అ : టాయిలెట్స్‌కి కూడా రెండుసార్లే ఫ్రీ అండి. తర్వాత ప్రతి పది నిమిషాలకీ రూ. 20లు చొప్పున పే చెయ్యాలండి.

ప్ర : మేం వెళ్తున్నట్టు మీకెలా తెలుస్తుందండీ, మేం కట్టకపోతే ఏం చెయ్యగలరు?

అ : టాయిలెట్లకు పక్కనే స్వైపింగ్ మిషనుంటుందండీ, దానిని వాడుకోవచ్చు. ఇకపోతే పక్కనే మా

ప్ర : ఇలా అయితే విరేచనాలయ్యేవారు డైపర్ బాగులు పట్టుకెళ్ళాలేమో!

అ : దాని మీద కూడా వెయిట్ బట్టి ఛార్జెస్ ఉంటాయండీ. అన్నట్లు చెప్పడం మరచిపోయాను. వెయిట్ చార్జెస్ కూడా ఉంటాయండీ.

ప్ర : అదేంటండీ మళ్ళా?

అ : పెద్దవాళ్ళైతే మీ వెయిట్, మీరు తెచ్చుకున్న లగేజ్ వెయిట్ కలిపి 100 కేజీలకు మించకూడదు. పిల్లలైతే వాళ్ళ బరువు, వాళ్ళ లగేజీ కలిసి 30 కేజీలకు మించకూడదు.

ప్ర : మించితే

అ : ప్రతి కేజికి రూ. 20లు ఎక్స్ట్రా చెల్లించాలండీ....

ప్ర : అమ్మా, మీ రైళ్ళకో నమస్కారం, నేను ఏ బస్సులోనో వెళ్ళిపోతాను. లేదా అసలు ప్రయాణమే మానేస్తాను.

ఈ వీడియో చూసిన సూరత్‌వారు ప్రతిపక్షాలు ఎక్కువైపోయాయనుకున్నాడేమో, సమాధానం దొరికిన భేతాళుడు మౌనం వహించినట్టు గమ్మునుండిపోయాడు.

అయ్యా, ఇంతకీ నాను సెప్పొచ్చేదేటంటే స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటు సేస్తన్నారని కేంద్రం ప్రకటించినప్పట్నుండీ మా వూళ్ళో కుర్రోళ్లే గాదు, నాలాంటి యాభైల్లో వున్నోళ్ళూ, వయసు దాటిపోయినోళ్లూ కూడా ఈల్లకేం పొయ్యేకాలవొచ్చింద్రా... యిప్పటికే స్టీల్ రేటు పెరిగిపోయి ఇళ్ళు కట్టుకోనేక సగం సగం కట్టి ఒగ్గేత్తన్నాం. దీనికి తోడు దాన్ని పెవేటోల్ల సేతిల బెడితే ఇల్లులు కట్టుకోగలవా అంట! అని ఒకటే ఇదవుతున్నారు. సానాల్ల బట్టి స్టీల్ ప్లాంట్లో ఉజ్జోగాల్దియ్యడంనేదు. ఇప్పుడు పైవేటోడికి అమ్మితే, ఆడు వున్న ఉజ్జోగాలు కూడా ఎక్కువై పోనాయని పీకి పారేత్తాడు. అటు బూవులూ పోయి, యిటు బతకనీకి పనీ నేకపోతే బతుకుల్ని వేటాడినట్టే!

"బేంకిల్నీ, రైళ్ళనీ, ఎల్లైసీని, స్టీల్‌ప్లాంటునీ, ఓడరేవుల్నీ, ఏర్‌పోర్టుల్నీ రేటు కట్టేసి కార్పొరేటు గాళ్ళకి అమ్మిస్తుంటే ఈల్లు కేటుగాళ్ళు గాక మరేటవుతారంట?" అని కొందరంటుండ్రు.

ఓటెయ్యనీకి 'రేటు' గడతన్రు – ఓటేసినాక దేశానికి 'రేటు' గడతన్రు!!

మా ఈదిల ఆడోల్లంటంద్రండీ – 'సూత్తా వుండండి – ఈల్లు దేశాన్నే అమ్మికపోతే' అని.

ఎక్కడికెల్నా ఇయ్యే ఊసులండి.... నమ్మితే నమ్మండి, నేకపోతే నేదు.... ఆడోల్లు, మగోల్లు, కుర్రోల్లు, ముసిలోల్లు గూడా... కూస్త మీ అసుంటోల్లు గూడా ఆలోసిత్తే బాగుంటదని అన్పించింది. అందుకే నా సోదంతా మీకేసాను. ఏవనుకోమాకండి.... కుసింత ఆలోసించండి!!! ఇయ్యన్నీ మన ప్రజల ఆస్తులు గదండీ.... మన రక్తపు సుక్కలు!!! ✸




# 'ద స్టోనింగ్ ఆఫ్ సొరాయా ఎమ్.' (2008)

బాలాజీ (కోల్‌కతా)

**మత** చట్టాలు స్త్రీల విషయంలో పక్షపాతవైఖరితో వున్న సంగతి తెలిసిందే. కానీ వాటి ప్రయోగం స్వార్థ మతపెద్దలూ, దుష్ట పురుషుల చేతుల్లో వుంటేనో! బాధిత స్త్రీలకు బ్రతికుండగానే నరకయాతన ఏమిటో తెలుస్తుంది. **'ద స్టోనింగ్ ఆఫ్ సొరాయా ఎమ్.'** సినిమా ఆ యాతనను ప్రేక్షకుడే అనుభవించేలా చేస్తుంది. **"బిగ్గరగా ఖురాను పంక్తుల్ని ఉటంకిస్తూ నీ కపటత్వాన్ని కప్పిపుచ్చుకునే మోసకారిలా నటించకు"** – అంటూ అఫేజ్ అనే 14వ శతాబ్దపు ఇరాన్ కవి కొటేషన్‌తో ఈ సినిమా ప్రారంభమౌతుంది.

1986లో ఇరాన్లో జరిగిన ఒక వాస్తవ సంఘటన ఆధారంగా ఫ్రెంచ్ జర్నలిస్టు ఫ్రీడౌన్ సాహెబ్జామ్ ఇదే పేరుతో ఒక నవల రాశాడు. 1994 సంవత్సరంలో అంతర్జాతీయ బెస్ట్ సెల్లర్‌గా భారీగా అమ్ముడుపోయిందీ నవల. దీని ఆధారంగానే తయారైంది ఈ సినిమా. అమెరికాలో వుండే ఇరాన్ దర్శకుడు సైరస్ నవ్‌రాస్తే ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. **'స్టోనింగ్'** అంటే రాళ్లతో కొట్టి చంపడం. వ్యభిచారం చేసిన ముస్లిం మహిళకు షరియత్ పేర వేసే భయంకర శిక్ష ఇది. మెడలోతు లేక నడుంలోతు ఇసుకలో పాతిపెట్టి ఊరివాళ్లంతా రాళ్లతో కొట్టి చంపే అమానవీయ శిక్ష ఇది. కరుడుకట్టిన ముస్లిం మతరాజ్యాల్లో అమల్లో వుండేది. ఇరాన్, నైజీరియా, సోమాలియా, సుడాన్, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్లలో ఏడాదికి దాదాపు వంద స్టోనింగ్ శిక్షలు అమలు జరిగేవని ఒకప్పటి నివేదికలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మానవహక్కుల ఉద్యమాల కారణంగా కొన్ని చోట్ల నిషేధ చట్టాలు వచ్చాయి. ఉదాహరణకి ఈ సినిమా కథాస్థలమైన ఇరాన్‌లో 2002లో నిషేధ చట్టం వచ్చింది. కానీ అనధికారికంగా ఇలాంటి శిక్షలు జరుగుతున్నాయని వార్తలు చెబుతున్నాయి.




చారిత్రకంగా మాతృస్వామ్య విధానాన్ని పితృస్వామ్యం కబళిస్తున్న కాలంలోనే సొంతాస్తి విధానం ముందుకొచ్చింది. ఈ మార్పుల సర్దుబాటులో స్త్రీ కూడా పురుషుడి సొంతాస్తి అయిపోయింది. వివిధ సమాజాల్లో స్త్రీలపై కట్టుబాటు చర్యలు, శిక్షలు ఈ సొంతాస్తి కాన్సెప్ట్ నుండే తయారయ్యాయి. కానీ స్వేచ్ఛాలోచనాపరులైన స్త్రీలు ఈ పరిస్థితిని ఎదిరించారు. ఎదిరించిన వారిని అన్ని మతాలూ హింసించి చంపాయి. కాథలిక్ చర్చి ఎందర్నో హతమార్చింది. అమెరికాలో విచ్ హంటింగ్ తెలిసిందే. మన హర్యానాతో పాటు ప్రపంచవ్యాప్తంగా పరువు హత్యల చరిత్ర వుంది. వాటికన్ ఈనాటికీ స్త్రీలకు పౌరోహిత్యాన్ని నిరాకరిస్తుంది. ప్రసిద్ధ బంగ్లాదేశ్ రచయిత్రి తస్లిమా నస్రీన్ ప్రకారం – **"ప్రతి మతమూ స్త్రీల హక్కులకూ, స్త్రీ స్వేచ్ఛకూ వ్యతిరేకిగానే వుంది. ప్రతి సమాజంలోనూ మతం స్త్రీలను అణిచివేసింది."** ఈ నేపథ్యంలో ఈ సినిమాకథను చూద్దాం.

**సినిమా కథ :**

ఫ్రెంచ్–ఇరానియన్ జర్నలిస్ట్ ఫ్రీడౌన్ సాహెబ్జామ్ (జిమ్ కేవిజెల్) ఇరాన్‌లోని బంజరు పర్వత ప్రాంతం గుండా ప్రయాణిస్తున్నాడు. కుప్హాయె గ్రామంలో అతని కారు పాడౌతుంది. రేడియేటర్‌ను రిపేరు చేయించడానికి హషేమ్ (పర్విజ్ సయ్యద్) అనే మెకానిక్ దగ్గరకు వెళ్తాడు. జహ్రా (షోహ్రే అఘ్దాష్లూ) అనే స్థానిక మహిళ ఆ విలేకరితో మాట్లాడటానికి ప్రయత్నిస్తూ వుంటుంది. అక్కడికి వచ్చిన గ్రామ మేయర్ (డేవిడ్ డియాన్), స్థానిక ముల్లా (అలీ పౌర్తాష్) ఆమెను తరిమేస్తారు. అదో పిచ్చిది అని చెబుతూ, అతడ్ని స్నేహపూర్వకంగా భోజనానికి ఆహ్వానిస్తారు. కానీ అతడా ఆహ్వానాన్ని తోసిపుచ్చి తనొక్కడే ఒక కాఫీ షాపుకు వెళతాడు. పట్టువదలకుండా జహ్రా అతడ్ని వెంబడిస్తుంది. చివరికి దొంగతనంగా అతడ్ని ఇంటికి రప్పించుకుంటుంది. ప్రపంచానికి తప్పకుండా తెలియాల్సిన కథ తన వద్ద వుందనీ, దాన్ని అతను టేప్‌లో రికార్డు చేసుకోవాలనీ కోరుతుంది. అతడు సరేననడంతో ఆ ముందు రోజే ఆ వూరిలో తన మేనకోడలి విషయంలో జరిగిన భయంకర ఉదంతమొకటి చెబుతుంది. అక్కడ్నుంచి కథ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్తుంది.

సొరాయా మానుచ్ఛెహ్రీ లేక క్లుప్తంగా సొరాయా ఎమ్. (మొజాన్ మార్నో) అలీ (నావిడ్ నాగబాన్) భార్య. చాలా ఓర్పుగల, నమ్మకమైన భార్య. వారికి ఇద్దరు కుమారుల తర్వాత ఇద్దరు కుమార్తెలు. అలీ వ్యసనపరుడు, వ్యభిచారి. భార్యను వదిలించుకుని, కొడుకుల్ని చదువుల కోసం పట్టణానికి పంపించి, ఓ 14 యేళ్ల పిల్లను పెళ్లిచేసుకునే ప్లానులో వున్నాడు. ఆ పిల్ల తండ్రి జైల్లో వున్నాడు. అతడికి ఉరిశిక్ష పడబోతుంది. అతడ్ని వురి నుంచి తప్పిస్తే ఆ పిల్లను పెళ్లిచేసుకోవచ్చని ఆ ఖైదీతో ఒప్పందం కుదిరింది. కానీ ఇందుకు తన భార్య అడ్డుగా వుంది. ఆమెను బాగా హింసిస్తే భరించలేక విడాకులిస్తుందని తలచి శారీరకంగా

వేధింపులకు గురిచేస్తుంటాడు. ఆమె తన కుమార్తెల భవిష్యత్తు కోసం అన్నీ భరిస్తుంటుంది సొరాయా. తన భార్య తనకు విడాకులిచ్చేలా నచ్చజెప్పమనీ, లేదంటే తనకు తెలిసిన అతడి గుట్టురట్టు చేస్తాననీ ఆ వూరి ముల్లాను కూడా బెదిరిస్తాడు అలీ. ముల్లా కూడా సొరాయాను ఒప్పించలేకపోతాడు. విడాకులు ఇప్పించలేకపోతాడు. అలీ తన కొడుకుల్ని కూడా తల్లికి వ్యతిరేకంగా తయారుచేస్తాడు. ఇంటి వేధింపులు భరించలేక సొరాయా తన మేనత్త జహ్రా దగ్గరికి వచ్చేస్తుంది. జహ్రా ఆమెకు అన్ని విధాలా అండగా వుంటుంది.

ఈలోగా ఆ వూరి మెకానిక్ హషేమ్ భార్య చనిపోతుంది. అతడికో మానసిక వికలాంగుడైన కొడుకు వుంటాడు. సొరాయాను హషేమ్ ఇంటి పనిమనిషిగా కుదురుస్తారు ఊరి పెద్దలు. అక్కడ వంటచేస్తూ, వికలాంగ కుర్రాడికి సేవ చేస్తే వచ్చే జీతం ఆమెకు కొంత ఆర్థికపరమైన వెసులుబాటుగా అన్పించడంతో ఆమె అంగీకరిస్తుంది. పరపురుషుడి ఇంట పనిచేస్తున్నా చాలా జాగ్రత్తగా వుంటూ, గబగబా పని ముగించుకుని తన మేనత్త ఇంటికి వచ్చేస్తుంటుంది సొరాయా. కానీ అలీ ఈ సరికొత్త పరిస్థితిని తనకనుకూలంగా వినియోగించుకుని సొరాయాను వదిలించుకునే భయంకర పన్నాగం పన్నుతాడు. సొరాయాకు మెకానిక్ హషేమ్‌తో అక్రమసంబంధం ఉన్నట్టు పుకారు పుట్టిస్తాడు. ముల్లాను ఈ పన్నాగంలో భాగస్వామిని చేయడం అతడికి చిటికెడంత పని. అలీ, ముల్లాలిద్దరూ హషేమ్‌ను కూడా సొరాయాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని బెదిరిస్తారు. లేదంటే అతడి బిడ్డను అనాథను చేసేస్తామని భయపెడతారు. దాంతో అతడూ లొంగిపోతాడు. సొరాయా తనను లొంగదీసుకుందని చెప్పడానికి ఒప్పుకుంటాడు. అభియోగానికి తగిన సాక్ష్యుల్ని కూడబెట్టుకున్న అలీ తన భార్య సొరాయాను వీధుల గుండా జుత్తు పట్టుకుని ఈడ్చుతూ, కొడుతూ, తనను మోసం చేసిందని చాటింపు వేస్తాడు. రంకు చేసిన స్త్రీని ఊరందరి ముందు రాళ్లతో కొట్టి చంపాలని ముస్లిం చట్టం చెబుతోందని మేయర్‌తో వాదిస్తాడు. అలా జరిగితే తన రెండో పెళ్లికి అడ్డే వుండదని అతడి ఎత్తుగడ. జహ్రా తన మేనకోడలిని కాపాడటానికి చేయగలిగినదంతా చేస్తుంది. ఒకప్పుడు తనపై మోజు పడిన మేయరు సహాయంతో తన మేనకోడలిని కాపాడాలని చాలా ప్రయత్నిస్తుంది. కానీ ఆ మగాళ్ల ప్రపంచంలో ఆమె ప్రయత్నాలు ఫలించవు. 'పురుషుడు స్త్రీపై నేరం మోపితే, తను నిరపరాధినని నిరూపించుకునే బాధ్యత స్త్రీదే. పురుషుడిపై స్త్రీ అభియోగం మోపితే, అతడి నేరాన్ని రుజువుచేయాల్సిన బాధ్యతా స్త్రీదే' – ఇలాంటి అసమ మతచట్టాల నేలలో సొరాయా మూగ, నిస్సహాయ బాధితురాలుగా మిగులుతుంది. చివరకు బలహీన సాక్ష్యాలు ఆ కేసును ఊరి మగాళ్ల కోర్టులో విచారిస్తాడు మేయర్. అక్కడ నిందితురాలి భర్త, తండ్రి, కొడుకులతో పాటు ఊరి మగాళ్లంతా గుమిగూడుతారు. సొరాయా చేసిన నేరం కుటుంబానికీ, ఊరికీ కళంకం తెచ్చిందనీ, ఆమెను రాళ్లతో కొట్టి చంపాలనీ కంగారూ కోర్టు తీర్పునిస్తుంది. 'మీరు బలంగా నిందితురాలిపై గురిపెట్టి విసిరే ఒక్కోరాయి మలినమైపోయిన మన వూరిని పునీతం చేస్తుంది' అని ఆ దొంగ ముల్లా ఉద్ఘోషిస్తాడు. భయంకరమైన ఆ శిక్షను ఎలా అమలుచేశారన్నది మిగతా కథ. ఆ మిగతా కథను చూట్టమూ, దాని గురించి చెప్పుకోవడమూ చాలా భయంకరంగా వుంటుంది.

శిక్ష సరిగా అమలు జరిపించడానికి తుపాకులు ధరించిన ఇస్లామిక్ విప్లవ గార్డులు ప్రభుత్వం తరుపున వస్తారు. నడుంలోతు గోతిని తవ్వుతారు. ఊరి కుర్రాళ్లంతా సంబరం జరుగుతున్నంత ఉత్సాహంగా వాడి వాడి రాళ్లను ఏరి, వధ్యస్థలం దగ్గర కుప్పగా పెడతారు. సొరాయాకు చేసేదేమీ ఉండదు. తన కుమార్తెలను గారాబంగా దగ్గరకు తీసుకుని, తన గుర్తుగా తన ఆభరణాలను ఇచ్చి, తనను ఎప్పటికీ మరచిపోవద్దని చెప్పి శిక్షను అనుభవించడానికి బయల్దేరుతుంది. ఆమెను ఊరి వీధుల గుండా వధ్యస్థలానికి తీసుకుపోతుంటే ఊరి మగపిల్లలు గొప్ప ఆట కోసం సమాయత్తమౌతున్నట్టు రాళ్లను విసరడం ప్రాక్టీసు చేస్తుంటారు. సొరాయా కన్న తండ్రే మొదటి రాయిని విసురుతాడు. అది గురి తప్పుతుంది. మరో రెండు రాళ్లు కూడా గురితప్పుతాయి. 'ఆమె అమాయకురాలు, అందుకే రాళ్లు గురితప్పుతున్నాయి. ఈ శిక్షను ఆపండి' అంటూ ఒక ముసలావిడ మొరపెట్టుకుంటుంది. కానీ శిక్షను అమలు జరపడానికే కంకణం కట్టుకున్న ముల్లా ఏదో చెప్పబోయిన మేయర్ను వారిస్తాడు. భర్త అలీ వేసిన రాళ్లు బలంగా తగులుతాయి. నుదుటికి చిల్లుపడి రక్తం ఉబికి వస్తుంది. ఆ తర్వాత ఆ దుర్మార్గుడు తన ఇద్దరు కొడుకులతో కూడా రాళ్లు రువ్విస్తాడు. హషేమ్ అపరాధ భావనతో తన చేతిలోని రాళ్లను కిందపడేసి, తన కొడుకును కావలించుకుని అక్కడ్నుంచి వెళిపోతాడు. ఇక వేట జంతువును పంచుకోవడానికొచ్చిన గుంపులా మిగతా జనాలు విరుచుకుపడతారు. ఈ దృశ్యాన్ని చూడలేక సొమ్మసిల్లిపోతుంది జహ్రా.

ఈ కథంతా రికార్డు చేసుకుంటాడు విలేకరి. అప్పటికే కారు రిపేరై సిద్ధంగా వుంది. జైలులోని ముద్దాయికి ఉరిశిక్ష పడడంతో టీనేజ్ అమ్మాయితో అలీ వివాహం తెగిపోతుంది. ఆ చిరాకుతో 'ప్లానంతా పనికిరాకుండా పోయింద'ని నోరుజారుతాడు అలీ. ఆ మాటలు మేయర్, మెకానిక్ హషేమ్‌లిద్దరూ వింటారు. తను అబద్ధమాడిన సంగతి మేయర్ ముందు ఒప్పుకుంటాడు హషేమ్. ఒక అమాయకురాలి ప్రాణాన్ని బలిగొన్న ఆ కథను ప్రపంచానికి చేరవేస్తాడు ఆ విలేకరి. తొమ్మిదేళ్ల నిజజీవిత సొరాయా ఫొటో తెరపై కనిపిస్తుంది. అదొక్కటే ప్రపంచం కోసం మిగిలిన ఆమె జ్ఞాపకం!

## గుర్తుండే చాలా దృశ్యాలు :

చూసిన చాలా రోజుల వరకు ఈ సినిమా దృశ్యాలు ఓ పట్టాన మనల్ని వదిలిపెట్టవు. పదే పదే జ్ఞాపకమొచ్చి కలవరపెడుతుంటాయి. ఒక బులెట్ దెబ్బతో, ఒక్క కత్తి వేటుతో, ఒక సైనైడ్ మాత్రతో క్షణాల్లో చనిపోవడం ఎంత హాయిగా వుంటుందో కదా అనిపిస్తుంది ఇలాంటి మరణ శిక్ష దృశ్యం చూసిన తర్వాత. నువ్వు మరణిస్తున్నందుకు భయమేస్తోందా అని సొరాయాను జహ్రా అడిగినపుడు – 'చనిపోతున్నందుకు భయం వేయడం లేదు, రాళ్ల దెబ్బల బాధ భరిస్తూ కొంత సేపు బతికివుండాలన్న ఆలోచన భయం పుట్టిస్తోంది' – అని జవాబిస్తుంది సొరాయా.

'ఆఖరు సారిగా ఏమైనా చెప్పదలచుకున్నావా' అని శిక్షను అమలు చేస్తున్న మేయర్ అడిగినపుడు – 'మీరీ పని ఎలా చేయగలుగుతున్నారు?

నేనెవరో మీకు తెలీనట్టు ప్రవర్తిస్తున్నారు. నేను మీ మధ్యలో ఉన్నదాన్నే కదా! మీతో అన్నం పంచుకు తిన్నదాన్నే కదా! నేను మీ పొరుగుదాన్ని, మీ స్నేహితురాలిని, వీరి అమ్మని, ఈయన కుమార్తెని, ఇతని భార్యని! నా విషయంలో మీరిలా ఎలా చేయగలుగుతారు? అసలెవరి విషయంలోనైనా ఎలా చేయగలుగుతారు?' అని వినమ్రంగా ప్రశ్నిస్తున్నపుడు, దేవుడ్ని కీర్తించే నినాదాలతో ఆమె ప్రశ్నల శరాల్ని ఎదుర్కుంటారు అక్కడి స్వార్థపరులు. 'సతీ సహగమనం' జరిగినపుడు కూడా ఆమె అరుపులూ, మొరలూ వినపడనీయకుండా హాహాకారాలూ, జయజయధ్వానాలూ, సతీమాత కీర్తనలూ చేసేవారట! అసలు ముందే 'సతి' కాబోయే స్త్రీలకు మత్తుపానీయాలు ఇచ్చేవారట! ఆమె అక్కడ్నుంచి పారిపోకుండా చుట్టూ లాఠీలు పట్టుకున్న పురుషులు కాపలాగా వుండేవారట! సమూహాలు మతం పేర చేసే ఆటవిక హత్యాకాండలే ఇవన్నీ! సొరాయా ఇంకా ప్రాణాలతో మిగిలివుందో లేదో చూట్టానికి వచ్చి, ఆమె కాస్త కనురెప్ప తెరిచేసరికి, 'ఈమె ఇంకా బతికేవుంది, రాళ్లు రువ్వండి' అని భార్య మీద రెండోసారి 'స్టోనింగ్' చేయించే దృశ్యం కూడా చాలా భయంగొల్పేలా వుంటుంది.

పెద్ద కుమారుడు కరుడుకట్టిన మగాడిలా మారినా, చిన్న కొడుకులో మాత్రం కొంత సున్నితత్వం,అమ్మ పట్ల అభిమానం మిగిలివుంటుంది. కానీ ఇటువంటి మారణకాండలు సమూహాలనూ, పసితనాలనూ తాత్కాలికంగా కలుషితం చేస్తాయి. 'స్టోనింగు' జరుగుతున్న సమయానికి అక్కడికొక గారడీవాళ్ల బృందం వస్తుంది. మొదట్లో వారు కూడా తమ వాద్యాలతో ఆ చర్యను ఉత్సాహపరుస్తారు. కానీ రాన్రానూ అక్కడి అమానవీయ చర్య వారిని నిశ్చేష్టుల్ని చేస్తుంది. పరాయివారిని కదిలించిన ఆ దృశ్యం ఆ ఊరివారిని కదిలించలేకపోవడం మూకమనస్తత్వంలోని భయంకరపార్శ్వాన్ని చూపుతుంది. మాంసపుముద్దలా మిగిలిన ఆ శవంపై ఒక గుడ్డముక్కను కప్పి తమ కర్తవ్యాన్ని చాటుకుంటారు ఆ గారడీ వాళ్లు. ఆమెను గౌరవంగా ఖననం చేసే అవసరంకుడా ఎవరికీ కన్పించదు. మరుసటి రోజు జంతువులు తినేయగా మిగిలిన ఎముక ముక్కను పాతిపెడుతూ కుమిలికుమిలి ఏడుస్తుంది జహ్రా.

### ఎన్నో ప్రశంసలందుకున్న సినిమా :

ఈ సినిమా టొరంటో చలన చిత్రోత్సవంలో మొదటిసారిగా ప్రదర్శితమైంది. చాలా షాక్ వాల్యూ వున్న ఈ సినిమా వ్యాపారపరంగా కూడా ఘనవిజయం సాధించింది. హార్ట్‌ల్యాండ్, లాస్ ఏంజెలెస్, షాటిలైట్, మువీగార్డ్, ఫ్లాండర్స్ తదితర చలనచిత్రోత్సవాల్లో ఎన్నో బహుమతులు గెలుచుకుంది. ప్రధాన పాత్రలు పోషించిన ఇరానియన్ నటీమణులు చాలా అద్భుతంగా నటించారు. జోల్ ర్యాన్సమ్ ఫొటోగ్రఫీ అద్భుతంగా వుంది. కానీ ఆఖరు దృశ్యంలో విప్లవ గార్డులు దూసుకొస్తుండగా విలేకరి కారు కొంతసేపు స్టార్టు కాకపోవడంలాంటి మెలోడ్రమాటిక్ దృశ్యం అవసరమే లేదీ సినిమాకి! మతం మనిషిని రక్తపిపాసిగా మారుస్తున్న ఈ దుస్సమయంలో ప్రపంచ జనావళిని అప్రమత్తం చేయాలంటే, సమూహాలను మరింత మానవీయంగా తీర్చి దిద్దాలంటే ఇలాంటి సినిమాల నిర్మాణం, ప్రచారం చాలా అవసరం. ✸

## అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి మరణం



**'మిసిమి'** పత్రిక సంపాదకులుగా పనిచేసిన అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి మార్చి 2021న హైదరాబాద్‌లో అనారోగ్యంతో మరణించారు. ఆయన గుంటూరుజిల్లా తెనాలి తాలూకా తూములూరు గ్రామంలో 22 ఫిబ్రవరి 1933న జన్మించారు.

వెంకటేశ్వరరెడ్డి బాల్యం నుండీ అనేక కష్టాలను, అవమానాలను, వివక్షలను ఎదుర్కొని ఉన్నత విద్యాభ్యాసం చేశారు. త్రిపురనేని రామస్వామి రచనల ప్రభావంతో హేతువాద దృష్టితో వున్న వెంకటేశ్వరరెడ్డి ఆవుల గోపాలకృష్ణమూర్తి నడిపిన 'రాడికల్ హ్యూమనిస్టు' పత్రికా రచనల అధ్యయనంతో నాస్తికునిగా, మానవతావాద కార్యక్రమాలలో పాల్గొనేవారు. ఆయన ఇంటర్ చదువుతున్న రోజుల్లో సోషలిస్టు భావాలకు ఆకర్షితులైనారు. 'ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం'లో భవనం వెంకట్రామ్‌తో కలసి పాల్గొన్నారు. ఆంధ్రాయూనివర్శిటీలో ఫిలాసఫీ చదివే రోజుల్లో డెమొక్రటిక్ స్టూడెంట్ యూనియన్‌లో పనిచేశారు. ఆ తర్వాత తెనాలి వి.ఎస్.ఆర్. కాలేజీలో తర్కశాస్త్ర అధ్యాపకునిగా ఉద్యోగం చేశారు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ గురించి అధ్యయనం చేసి, ఆయన రచనలను తెలుగువారికి పరిచయం చేశారు. మనోవిజ్ఞాన శాస్త్ర రచనలు, తత్వశాస్త్ర రచనలతోపాటు ఆయన బుద్ధిజాన్ని అధ్యయనం చేసి బుద్ధిస్టుగా మారారు. బుద్ధ ఘోషునిగా పేరు మార్చుకున్నారు. ఆయన 83 గ్రంథాలను రచించారు. 'మిసిమి' పత్రికకు పదహారేళ్ళపాటు సంపాదకునిగా పనిచేశారు. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తగా, సాహిత్య విమర్శకునిగా, భాషాశాస్త్రవేత్తగా, బౌద్ధతత్త్వవేత్తగా, అనువాదకునిగా కృషిచేసిన అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తుంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నది. ✸

కథ

# బతుకు దోవ

– ఓ.వీ.వీ.యస్. లక్ష్మీకుమారి

**మోదు** కొండమ్మకు పూజలు చెయ్యంగ.... పాట నారాయణ ఫోను రింగ్‌టోన్‌గా మోగుతుంది. కానీ అతను వేసుకున్న లుంగీని తప్పించి, హాఫ్ ప్యాంటులో చేయిపెట్టి ఫోనును తీసి ఎత్తేలోపు ఆగిపోతున్నది. ఇందాకట్నుంచి ఇదే తంతు.

ఎత్తీ వొరకీ ఆగలేవేటే.... నానే సెయ్యాలేటి ఫోను. కాలో బొక్క.... చిరాగ్గా పైకే అనేశాడు నారాయణ.

ఎవులు మాయ్యా?!.... అడిగింది.... గమేళా నెత్తినెట్టుకుని కొంచెం ఎడంగా నడుస్తున్న గంగమ్మ.

ఇంకెవులు.... ఆ వీయార్పీ దుర్గారావు గోడే. ఇయ్యాల పది నిమసాలు నేటయ్యే పోన్లు మీద పోన్లు.... అంటూ తనే ఫోన్ చేశాడు. కరోనా డయలర్ టోన్ ఆగిపోగానే దుర్గారావు గొంతు.

యేట్రా నారాయణా ఫోనెత్తవేమి?!..... మీరొచ్చీదీ లేనిదీ తెలొద్దా?!....

వత్తన్నమెయ్.... ఎందుకురాము.... దార్లోన మాలచ్చుమ్మ తూలిపడిపోనాది. ఆయమ్మనింటికాడ దింపీసి వొత్తన్నం సమాధానమిచ్చాడు నారాయణ.

వొచ్చీ మాటైతే బేగిరా.... ఇయ్యాలసలకే జనం ఎక్కువమందైపోన్రు.... అంటూ కట్ చేసేశాడు దుర్గారావు.

పరుగులాంటి నడకతో చెరువు దగ్గరకి వచ్చేశారు నారాయణ, అతని మనుషులూ. ఉపాధి హామీ పథకంలో కార్డుహోల్డర్సంతా అప్పటికే అక్కడ చేరి ఉన్నారు. కరోనా వలన, లాక్‌డౌన్‌ల వలన నరకయాతనలు పడి, క్వారంటైన్ చేసి వచ్చిన గంగమ్మ వంటి వలస కూలీలూ, ముందునుంచీ గ్రామంలోనే ఉన్న కార్డుహోల్డర్స్ అందరూ కలిసి నిజంగానే జనం ఎక్కువమందే కనబడుతున్నారక్కడ. లాక్‌డౌన్ల వలన ఏ పనీ దొరకడంలేదు. గిట్టుబాటు కాకపోయినా ఈ ఉపాధి హామీ పనులే దిక్కవుతున్నాయి జనానికి.

ఇంగో.... నారాయణా, ఈరోజు ఎనభై రూపాయలే కూలి. ముందే సెప్తాన్నను. ఓకే అయినోల్లే పన్లోకి దిగండి. పని దిగీసి, మస్తరుకాడ తగువాడితే బాగోదు మరి.... ముందుగానే స్వరం పెంచి విషయం చెప్పాడు దుర్గారావు.

నిన్నన నూటేభై.... ఇయ్యాల ఎనభై అంటావేటి.... మైండుగాని దొబ్బిందేట్రా.... వెటకారంగానే ఐనా తనూ స్వరం పెంచి అన్నాడు నారాయణ.

ఔన్రా.... నాకు మైండు దొబ్బాడం వొల్లనే మీకు పని సూపిస్తాన్ను. ఎటకారం గుందేటి?!.... వొంద మందిని రమ్మంటే నూటేభై మందొచ్చినారు. ఎవుల్ని కాదనీని. పని గంటలు తగ్గుతాయి. డబ్బులూ తగ్గుతాయి. సరిపోద్దా యివరం.... ఇంకా సెప్పాలా.... నేటుగా వొచ్చిందేగాకంటా యింకా యివరా లడగుతాండు.... యివరాలు.... కోపంగా అరుస్తూ చెప్పాడు వీయార్పీ దుర్గారావు.

ఇలగైతే ఏటి పనిచేస్తం?!.... అసలకే కరోనా కష్టం. తిండిగింజలకే పుర్రాకులు పడతన్నం. కూలి వొందైనా కిట్టాపోతే ఇకనేటి సెయ్యాల.... ఎలగ బతకాల.... అంటూ చుట్టూ ఉన్న జనంకేసి చూసాడు నారాయణ.

అందరమీ కట్టగట్టుకు సద్దాంలే మాయ్యా. ఆ వొంద మాత్తరం ఏటిసేసుకుంటాం.... కోపంగా చేతులూపుతూ ముందుకొచ్చి అన్నది గంగమ్మ.

నన్నేటి సెయ్యమంటార్రా.... నా యింట్లో సొమ్ములు తెచ్చిచ్చీమంటారేటి?.... స్వరం తగ్గించకపోయినా వేడికోలు మొహంతో అన్నాడు దుర్గారావు.

నీ యింట్లో కూడు మాకెందుకు?!.... మా కష్టానికి తగ్గా సొమ్ములిమ్మంటన్నంగానీ.... స్వరం తగ్గించి అన్నాడు నారాయణ.

పది నిముషాలు ఆగండ్రా.... ఇంపార్టెంట్ ఫోను అంటూ అక్కడ నుండి పక్కకి దూరంగా వెళ్ళాడు దుర్గారావు.

ఈడింపార్టెంట్ మండిపోను.... సెన్నయ్‌లో ఇదే పనికి నాలుగొందలు.... ఇక్కడ వంద. ఏం బతుకైపోనాదిరా దేవుడా.... తనలో తనే గొణుక్కుంది గంగ.

ఈ కరోనా గొడవలోన ఊల్లోనున్నోలిమే పనుల్లేక పస్తులుంటంటే, మీరేటి తినీసి బతికేద్దారని వొచ్చీనారే గంగా.... అంటూ గంగని ఎత్తిపొడిచింది వేపాడ ధనలక్ష్మి.

అదేటక్కా.... అలగంటవ్.... బతికుంటే బలుసాకైనా తింటంగానీ – ఎక్కడో కూలికిపోయి అక్కడే బూడిదై పొమ్మంటవేటి?!.. ఇందంట పని లేక చెన్నై పోనాం గానీ, సొంతూరు మీద ఆశలేకాగాదు.... సొమ్ములెనకేసీడానికీ గాదు.... అంటూ తోటికోడలికి బదులిచ్చింది కోపంగానూ, బాధగానూ....

ఆసి కానికే కోపమైపోతావేటి పిల్లా.... సెన్నైలో రోజుకీ పని దొరికినట్టు మనూల్లోనూ దొరికితే ఎంత బాగుణ్ను.. అందంటిందంట కడుపట్టూపోయే కరమాలే లేపోను.... అంటూ గంగని సముదాయించింది ధనలక్ష్మి.

పక్కనే కూర్చొని కులికిపాట్లు పడుతున్న దేవుడమ్మ తోటికోడళ్ళ సంభాషణలో కల్పించుకుంటూ.... యేటీ మాయదారి జబ్బు కరోనాయంట. టీవీలల్ల ఒకటే గోలమ్మా.... ఏదోకాడికి పోయి ఇంత పనిచేసి.... ఇన్ని గెంజినీళ్ళు తాగి బతికీవోల్లం. ఇప్పుడేమో యింటికాడే ఉండి సచ్చిపోవాలట్ట. ఏటీసిత్రం?!.. ఒప్పుడూ సూణ్నేదు.

ఏటి సూణ్నేదొదినా.. టీబీ, మలేరియా – ఎయిడ్సూ.. లాటిదే యిదీనీ.. నీకాడికీ, నాకాడికీ రాదులే.... బయ్యింపడకు.. అంటూ ధైర్యం చెప్పబోయాడు నారాయణ.

అలకాదు మాయ్యా.. డబ్బుల కోసం యిదేశాలెల్తున్రు కదా.. ఆల్లకంటుకుంటందంట.. ఆల్లొచ్చి మనలాటోల్లకంటించుతాన్రంట.. సాగదీస్తూ చెప్పింది గంగ.

యేటైతే ఆ దుబాయ్‌శీనుగాడితోటి మనూరిగ్గానొచ్చీనాదేటి.. మాయదారి కరోనా.. కంగారుగా అన్నాడు నారాయణ.

యేమో.. యేటి సెప్పగలం.. యిమానం దిగీసి ఇంటికొచ్చినాడంట. ఒక్కరోజూ లేదు.. ఎమ్మటే కోరంటైనెంట.. తీసూపోనారు. ముసలి రావులమ్మ ఒక్కలాగ యేడుపే ఏడుపు. ఆలుండీ దిగువీదికేసి ఎవ్వులూ ఎల్లకుంటన్రు. యిప్పుడు మావూ.. సుట్టంట తిరిగే వొచ్చినాం.. అంది ధనలక్ష్మి.

ఓలమ్మో.. ఓరి దేవుడో.. అసల పనే దొరక్కుంటంది. ఒకేల దొరికితే కూలస్సల కిట్టకుంటంది. ఇయ్యి సాలవనీసే మాయదారి జబ్బుని మీదనడీసేవురా దేవుడో.... చిన్నగా శోకమందుకుంది గంగమ్మ.

శోకాలెట్టకే గంగా.... భూమితల్లి మనల్ని మోసినంతకాలమూ ఎలగోలాగ బతుకుదాంలే.. పేనాల మీదికొచ్చినా ఆశలొగ్గీకూడదు... అంటూ ఓదార్చాడు నారాయణ.

ఇంతలో.. వయసుకి చిన్నా కాదు, పెద్దా కాదు అన్నట్టున్న ఒక కొత్తావిడ వచ్చిందక్కడికి. వస్తూనే..., ఔన్నిజమే.. భలే చెప్పేవన్నా.. ఆశ అస్సలొగ్గీకూడదు. అందుకే మీమీద బోల్డు ఆశ నాకు.. అంటూ ఆడాళ్ళకేసి చూసి కన్నుగీటింది.

తల్లీ.. ఇప్పుడుకే మనుషులం లావైపోనాం.. పనులు సాలక మావే వొంతులాడతన్నం. జనాలు నావైపోడాన కూల్లు తగ్గిపోనాయంతన్రు. ఇంకో వూరోల్ల కార్డులు ఇక్కడ సెల్లవు. సెల్లినా మావొప్పము. ఇంతకీ నువ్వెవలి బొట్టివి?!.. ఎగాదిగా చూస్తూ.. గబగబా చెప్పి, అడగ వలసింది అడిగేసింది గంగమ్మ.

యేటి నన్ను వొయినం పట్టలేదా?!.. టీవీలంటా, పేపర్లంటా నా మీదన ఊసులు తప్ప మరేటి లేవే.. మూడు నాలుగు నెల్లై పెపంచికాన్ని దడదడ లాండించుతాన్ను.. అంటూ.. కనుక్కోండి చూద్దామన్నట్టు ఆగిందా కొత్తావిడ.

పనుల్లేక, తిండిలేక మావెండిపోతంటే.. యింక నీ పొడుపుకథలిప్పీ ఓపికేది తల్లీ.. అన్నాడు నారాయణ నీర్సంగా..

ఉన్నట్టుండి కొత్తావిడ.. ఒరేయ్.. మీ భూపెపంచికాన్ని నిలబెట్టి కడిగేస్తన్నదాన్నిరా.. మీకియ్యాల ఈగతి పట్టడానికి నన్ను తెచ్చినార్రా రంగంమీదకి అన్నది. ఆమె అలా అంటూ ఉండగానే ఆమె తల ఒళ్ళూ అంతా కొమ్ములు మొలుచుకొచ్చేశాయి.

అమ్మో.... కరోనారా బాబోయ్.... అని భయంతో జనం చెల్లాచెదురుగా పరుగందుకున్నారు.

అవున్రా.. నేనే కరోనానేరా.. ఆగండలగ. నానూ పరిగెత్తగల్ను. ఆకలి డొక్కలతో ఏమాత్తరం దూరం పరిగెట్టగల్రో నానూ సూస్తాన్రా.... అంటూ రంకెలేయసాగింది కరోనా.

ఒరే సూరీ, సత్తి.. నూకరాజూ ఆగండ్రా.. ఆ గంగమ్మనలగాపండి.... కేక వేసాడు నారాయణ.

మాయ్యా.. దాన్తో మనకేటి మాటలు. పేనాలు తోడీడానికే వచ్చీనాది.... భయంతో వొణికిపోతూ అన్నది గంగ.

గంగకేసి చూస్తూ.. నోటి మీద వేలుంచి హుష్ అంటూ సైగ చేశాడు నారాయణ. అక్కడున్నవాళ్ళని దగ్గరకు రమ్మని.., ఆపదొచ్చినప్పుడే ఉపాయంగుండాల. ఏదో ఉపాయం పనిచెయ్యాపోదు. రెక్కలనమ్ము కున్నోల్లం.. అమీతుమీ చూద్దాం.. అంటూ ముందుకు గెంతి కరోనా చుట్టూ గీత గీశాడు.

ఈలోపు ఆడాళ్ళు, మగాళ్ళు చింత కొమ్మలు, వేపకొమ్మలు.. ఇలా చేతికి దొరికిన వాటిని తెంపుకొచ్చి.. మాయమ్మో ఎల్లమ్మా.. నూకాలమ్మ.. దుర్గమ్మా.. పరదేశమ్మా.. అంటూ చాలామంది నిలబడి దణ్ణాలు పెట్టసాగారు. కొంతమందైతే పొర్లుదండాలు సైతం పెడుతూ కరోనాను ప్రసన్నం చేసుకునే పని మొదలు పెట్టేశారు.

ఒరే.... నానేటి రావణాసురుణ్ణను కొన్నారేట్రా.... ఈ లచ్చన గీతలు నన్నేటి సెయ్యలేవు. నన్ను అమ్మోర్ని సేసిస్తె నానుగానాగుతాను అనుకుంత్రన్రో యేటో.. అయ్యన్నీ మీ బెమలు.. అంటూ మరింత మండిపడింది కరోనా....

తల్లీ.. పేదోలిమి.. సెమించు.. ఈ దుర్గారావుగోడు, పనిచేసీకాడ శాంటీజర్లు (సానిటైజర్) యెడతానెడతాను అంటున్డుగానీ, వొక్కనాడూ ఎట్టలేదు. ఒక్కోలికి మూడేసి మాస్కులు పనికాడిత్తారనీసి వొలంటీర్లంతన్రు.... వొలంటీర్లే ఇంటికాడిస్తారని ఈడంతన్డు. ఉప్పుడుదాక ఎవ్వులూ ఇవ్వనేదు. మావేంటి సేసీమి తల్లీ.. ఈ వొక్కపాలికీ వొగ్గీయమ్మా..

నీ దారికడ్డం లేకండ ఊరుకాలీసేసి ఎనిపోతం.. కాళ్ళావేళ్ళా పడుతూ వేడికోసాగారు జనం.

వాళ్ళ వేడికోళ్ళకు బాగా నెమ్మదించింది కరోనా.

మనుషుల్లేని ఊరు శ్మశానం దిబ్బలాంటిది. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గురజాడ అప్పారావు గారన్నారు తెలీదా!!.. శాంతంగా అన్నది కరోనా.. వాళ్ళ యాసని వెక్కిరించడం ఆపేస్తూ..

ఏమోనమ్మా.... సదూకున్నోళ్ళ మాటలు మాలాటి మట్టి పిసుక్కునీవోళ్ళకి యేటి తెలుస్తాయి. ఇక్కడే ఉంటే ఈ మట్టిలోనే కల్సిపోయేదాకా నువ్వొగ్గవో యేటో.... వెర్రిచూపులు చూస్తూ అన్నది గంగ.

గంగ మాటలింటంటే తెగ జాలేస్తందిరా అన్నా.... మిమ్మల్నందరినీ చూస్తుంటే కూడా చాలా బాధగా ఉంది. అన్నది కరోనా.

జాలేస్తందంట జాలి.... దీనమ్మ.. దేశదేశాలు మట్టిగొట్టించీసి సోది కబుర్లు చెప్పుతాంది అని గొణిగింది గంగ.

అంత నెమ్మదిగా గొణుక్కున్నాసరే చెవిన పడిపోయింది కరోనాకి.

సోది కాదే గంగా.. నేను చెప్పేది నిజం. నాలాగ నన్ను బతకనివ్వకుంటున్నారు ఎవరో తెలుసా?! నీకు తెలీదు. మల్టీనేషనల్ కంపెనీవాళ్ళు. అంటే యేటో తెలుసునా?!.. అదీ నీకు తెలీదు. మిమ్మల్ని ఈ ప్రభుత్వాలు పరిపాలించుతుంటే, ఆ ప్రభుత్వాల్ని ఈ కంపెనీలు పరిపాలించుతున్నాయ్. చెట్టూ పుట్టా, పిట్టా గుట్టా పచ్చగా ఉండకండా భూమి తల్లిని చప్పరించేస్తున్నయ్. అక్కడితో ఆగేయా?! ఆగలేదు. లాభాలు మేటలేసీయాలని మొక్కల్నీ, జంతువుల్నీ ఆటికి నచ్చినట్టు మార్చేస్తున్నాయ్. జన్యుమార్పిడులంటారు. నాటుకోళ్ళని చూడండి మాంసం కోసం కోళ్ళు, గుడ్లు కోసం కోళ్ళు లాగ మార్చేసినట్టు..

కరోనా మాటలు ఇలా సాగుతుండగానే జనంలోంచి.. వేరేవాళ్ళకి బదులు పనిలోకొచ్చిన కాలేజీ కుర్రోడొకడు.., అమెరికావోళ్ళు కోడికాళ్ళు తినరంట. ఆ కోడికాళ్ళు మనకమ్మీయాలనీసి ట్రంపుగాడు ఇండియా వొచ్చేడంట.. నేను వాట్సాపులో చదివేను అన్నాడు.

ఔను.. ఆ మాట నిజమేనంటూ కరోనా కొనసాగించింది. ఐతే ఈసారి గంభీరంగా....

జన్యుమార్పిళ్ళతో జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాయి. లాభాలతో బలిసి విర్రవీగుతున్నాయి. ఫలితంగా ఏమయ్యింది ప్రకృతి సహజత్వం కోల్పోయి, నా లాంటివాళ్ళు పుట్టుకొస్తారు. అంటూ గంగకేసి చూసి.. నావి కావే సోది కబుర్లు. బుర్ర తక్కువదానా.. మీ ప్రభుత్వాలు చెప్పేవే సోది కబుర్లు. చేతులు కడగడానికి మీ కాలనీలో కుళాయి నీళ్ళే లేవు. సానిటైజర్‌లు ఎలాగొస్తాయే?!.. నువ్వు ఓటేసి గెలిపించినోడో, నువ్వు వోటేస్తావని ఆశున్నోడో.. అయ్యో ఇయ్యో ఎన్నిరోజులు పంచుతారో నేనూ చూస్తాను. నాకసలే శుచి, శుభ్రం ఎక్కువ.. ఆకలి చాలా ఎక్కువ.... అంటూ సాగిపోతున్న కరోనాకు నారాయణ బ్రేకు వేసాడు.

ఏదో.. నీతీ నిజాయితిగా బతకడం మా వల్ల అవుద్దిగానీ., మట్టిలో పుట్టి మట్టిలో పెరిగీవోల్లం.. మూడు పూట్లా కమ్మగా తినీసి సుబ్బరంగా ఉండాలంటే మా బతుకెలగ గడుస్తుదమ్మా.. మా బరువులెవలెత్తి పెడతరు?!.. పిల్లాజెల్లా కలిగినోల్లం కరునించమ్మా.... నీరేసినోడో నీరెట్టాల.. యింతకాలమూ బలులు కోరినావు.. ఉప్పుడైనా శాంతించమ్మా.... లోకం సల్లగుండాలంటే ఏటిసెయ్యాలో సెప్పుతల్లీ.. ముందుకు ఒంగి వినయంగా అడిగాడు.

చూడన్నా.. ఇప్పుడు నా చేతుల్లో ఏమీలేదు. ముందే చెప్పాను. భూమి తల్లి గుండెల్లోకి గునపాలు గుచ్చి సంపదంతా కొల్లగొడుతున్నారు. తల్లి పిల్లల్ని వేరుచేసి, మాంసం ముద్దలుగా మార్చి అమ్మేస్తున్నారు. వేరుని నాశనం చేసి కొమ్మలకు ప్లాస్టిక్ పూలూ పళ్ళూ మొలిపిస్తున్నారు. ఒకటా రెండా ఎన్నని చెప్పను?!.. వేల లక్షల సంవత్సరాల నేచర్ ఫ్రెండ్లీ చరిత్రకి చరమగీతం పాడుతున్నారు. కళ్ళు నెత్తికెక్కిన ఈ తంతు ఇలాగే కొనసాగిస్తే.. నేనేంటి.. నా తాత ముత్తాతలు పుట్టుకొస్తారు. మేము మాత్రం ఎంతకాలం సహిస్తాం?!.. అన్నది.

ఓయమ్మో.. తాత ముత్తాతలంటందేటి కరోనా.... దీనికే గిలగిల తన్నుకుంతన్నం.. ఏ చనంలో ఎవులెల్లిపోతామో గేరంటీ నేదు.. మల్లీ శోకాలు తియ్యబోయింది గంగ.

ఓసొల్లకోయే గంగా.. సీటికీ మాటికీ ఆ తాగుబోతు సచ్చినోడుతో తన్నులు తినీసి శోకాలెట్టడం అలవాటైపోనాది నీకు.. మందు కనిపెట్టీనారంటలే.. మరికనేం బయ్యిమక్కర్లేదు.. అంటూ గంగతో అన్నది ధనలక్ష్మి.

ఎవరు చెప్పింది?!.. సర్రుమని లేచింది కరోనా..

వేపరెమ్మలు.... కొమ్మలూ ఊపుతూ శాంతించమ్మా.. శాంతించు.. అంటూ కేకలు పెట్టసాగారు జనం.

ఇవాళ నన్ను కట్టడి చేయడానికి లాక్‌డౌన్లు చేస్తున్నారు.., చప్పట్లు కొట్టించారు, దీపాలెలిగించారు.... మనమే విదేశాలకు క్వినైన్ పంపుతున్నాం.. మనదేశం అంత గొప్ప ఇంత గొప్ప.. అంటూ చాలా కబుర్లు చెబుతున్నారు. ఏదీ ఎక్కడరా నన్నాపింది?!.... సవాల్ చేస్తున్నట్టు అనింది.. కరోనా.

ఎవులో కంపినీవోల్లు.. ఆల్ల ఎనక బలిపించీవోల్లు చేసే తప్పులకి మమ్మల్ని బలితీసుకుంటానంటావేటి?!.... నీకు దమ్ముంటే ఆల్లమీద పడు.. అంటూ నారాయణకేసి తిరిగి ఇదేమన్నేయం మాయా?!.. అంది నిలదీస్తూ గంగ.

నువ్వుండు గంగా.. నేను మాట్లాడతన్నా.... అంటూ కరోనాకేసి తిరిగి మా గంగమ్మ వొట్టి యెర్రిబాగుల్ది తల్లీ.. మాట కటువుగానీ, మనసు ఎన్నముద్ద అనుకో.. ఎవులి కష్టమన్నా దాని కష్టమే అనుకుంటది. మా కాడ నిక్కీ నీలిగీ పేనాలు తప్ప మరేదీ నేవు. ఈ గండం గట్టెక్కీ మార్గం సెప్పు తల్లీ.. అన్నాడు నారాయణ.

మార్గం లేకనేమి నారాయణా.. క్యూబా, వియత్నాం లాటి చిన్న చిన్న దేశాలు ఎప్పుడో బయటపడిపోయాయి. ఆ దేశాల బోర్డురు కూడా దాటి పోలేకపోతున్నాను. అంటూ ఆ దేశాలకు హ్యాట్సాఫ్ కొట్టింది కరోనా.

ఇందాకేమో గురజాడన్నావు. ఇప్పుడేదో క్యూబా గీబా అంటన్నవు. బయటపడే దోవ సూపించమంటే మంత్రాలు గింత్రాలేసి మోసం జేస్తవా యేటి?!.. మళ్ళీ అందుకుంది గంగ.

ఇదిగో గంగమ్మా.... నాతో పెట్టుకోకు. మంత్రాలు, మాయలు నాకు తెలీదు. నిజం చెబుతుంటే నమ్మవా.. ముందే చెప్పేన్నేను. నాకు శుచి శుభ్రం కావాల. మనుషులు బలంగా ఉండాల. మళ్ళీ మళ్ళీ తత్తరించేవంటే దొరికినోళ్ళని దొరికినట్టు ఎత్తుకెళ్ళిపోగల్ను.. ఏవనుకున్నావో.. చిందులు తొక్కింది కరోనా..

కూలోలంటే అందరికీ లోకువే. నిన్ననీ పనేటుంది. అసలకే పనుల్లేవు. సేతిల డబ్బులాడక గిలగిల్లాడతాన్నం. ఉప్పులు పప్పులు రేట్లాకాసాని కెక్కిపోతే, వొట్టీవొడియం నంజుకోని గెంజినీల్లు తాగి బతకతన్నం. నాలుగు డబ్బులాడాలనీసి పిల్లాజెల్లల్ని ముసిలోల్లకాడొగ్గీసి దూరాబారం సెన్నయిలూ, బెంగులూర్లూ పోయి బతకతంటే,.... ఇకనేసొమ్ములు మీదేసుకుని బలిసిపోతాం మాయ్యా!.... ఈ రాచ్చసి మనల్ని మింగీసిగానొగల్దు తల్లో.. ఈసారి కాస్త గట్టిగా శోకాలెత్తింది గంగ.

వొల్లకోయే గంగా.... అంటూ చుట్టూ వున్న జనం సముదాయించే ప్రయత్నం చేస్తున్నారు.

ఏటి నారాయణా.. ఇంత చెప్పినా ఆవిడ శోకాలు మానదేంటి?!.. నన్ను బాగా ఇరిటేట్ చేస్తుంది.. అంటూ వేలు చూపించి బెదిరించింది కరోనా.

గుంతలు తవ్వుతాము. కూలియ్యరో అని.. వీరిర్పిలాటోల్లని దేబిరించుతారేటి.. ఉపాధి హామీ పనుల్లో మేడలు మీద మేడలు కడతన్నాడని ఎవరో అన్నారు. చిన్న మెలిక వేసి నవ్వుకున్నది కరోనా.

వారినీ.. ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్టు ఈ కరోనా నామీదకొచ్చీలాగుంది, నేను జంప్ అనుకుంటూ.., ఫోన్లో వస్తున్నా నొస్తున్నానంటూ జారుకున్నాడు వీఆర్వీ.

గుమ్మడికాయల దొంగంటే ఈడు భుజాలు తడుముకుంటున్నాడు. అంటూ.. నా ఎదురుగా ఆ సెరువు గట్టవతల భూములు పడావుగా పడున్నాయి. మీక్కనబళ్ళేదా?!.. కవ్విస్తున్నట్టు కన్నెగరేసింది కరోనా.

అయ్యా! అయ్యి మా తాతల కాలంలోనే సెల్లిపోనాయ్ తల్లీ.. ఆల్లు కల్లు ముంతలికీ, సిస్తులకీ, అప్పులు తీర్చడానికనీసి ఆ భూవులకి నీల్లొగ్గీనారు.. అని ఒకాయన చెబ్తుండగా.. ఉప్పుడు అమ్మకానికేటి లేక ఆ సారా కొట్టుకి రత్తవమ్మేత్తన్రు.. మా బతుకులింతే.. అద్దాంతరంగా ఆరిపోడమే అన్నారు కొందరాడవాళ్ళు.

ఆడోల మాటలకేటిగానీ, ఆ భూమి యివరం నాకు తెలుసును. కొంచెం ముందుకొచ్చాడు గంగ చిన మామ.. 60

సంవత్సరాలు దాటి ఉండొచ్చు. కానీ మనిషి అలా లేడు.

ఇప్పుడు తవ్వకాలు చేస్తున్న ఈ చెరువుగట్టు.. అల్లక్కడ ప్లాట్లు అమ్మబడును అనీసి బోర్డెట్టినారు గదా రాజుగోరు.. అక్కడుండేది అన్నాడు దూరంగా ఉన్న బోర్డుని చూపిస్తూ. ఇక్కడున్న నాదారుపోళ్ళకి శానా మందికే పొలాలుండేయిక్కడ. వొరదలొచ్చే టప్పుడు గట్టుకి ఆల జట్టుగాళ్ళంతా కాపలా ఉండేవోరని మా తాత సెప్పేవోడు. ఆ ఎనకన సినదొడ్డోళ్ళ పొలాలు.. సెరువీతల మా పొలాలు ఉండేయి. ఈ సెరూ కింద ఆరూళ్ళు పండేయి. అంటూ చెప్పసాగాడతను.

ఏటి తాతా.. సెరువు తవ్వడానికొచ్చి చరిత్ర తవ్వుతావేమి?!.. అన్నాడు ఓ యువకుడు.

ఓరుంద్రా.. ఆయమ్మకి మన కష్టం సెప్పుకోవద్దా.. మజ్జిలోనాపకు.. అన్నాడతను.

నువ్వు చెప్పు తాతా.. అంది కరోనా....

యేటి సెప్పేని తల్లీ.. రైతోడికి ఏటికేడాదీ భూవింమీదనే పని. మా ఊల్లల్లో పనైనా భూవింమీదనే.... పడమట కొసెల్లి దమ్ములు, ఉడుపులు, కోతలు, నూర్పిళ్ళు ఈ పనులన్నీ భూమిన్నమ్ముకునే.... తల్లీ పిల్లా కలోగంజో తాగి ఒకసోటే ఉండేవోలం. అంతా జుత్తే ఈ పాతిక – ముప్పైయేళ్ళ సంధి.... ఉన్న ఎకరా.. ఎకరాన్నర భూవుంలూ ఒగ్గేవొలిసొచ్చింది. బతుకుతెరువో.. అనుకుంటా మాలాటోల్లం తాపీ పనికో, కూలి పనికో సెన్నైలంట పోతన్నం.., ఐటీ (I.T.I) చదివిన మా గుంటలు దుబాయిలంట, సింగపూర్లంట పోతన్రు.

మధ్యలో గంగమ్మ కల్పించుకుంటూ.., రైతోడికాడ భూమి నేపోతే ఎలగ పండిస్తడు?!.. భూవుంలలగ పడాగా పడుండిపోనాయంటే ఉండవా?!.. ఇయ్యాలీయమ్మ వొచ్చీసి దున్నీమంటే ఆతలోడు నీలాటి నాలాటోడు కాదు.... అన్నది ఈసడింపుగా.

ఇదేటి నాయుడూ.. కష్టజీవులు మంచోళ్ళేగానీ.... మరీ యింత మంచితనం పనికిరాదు. మీ మంచికోరి చెప్తున్నాను. వియత్నాం, క్యూబా లాంటి దేశాల్లో ప్రజల్లాగ ఆహారం, ఆరోగ్యం గురించి శ్రద్ధ ఉంటే.. బలంగా ఉంటే నేను మిమ్మల్నేమీ చేయను.. చేయలేను. గట్టిగా చెప్పింది కరోనా.

అద్దీ.. అలాగ చెప్పు.... అంటూ ఇందాకటి యువకుడు ఆవేశంగా లేచాడు. ఈ దిక్కుమాలిన మంచితనం సేతకానితనమే. దీంతోటే ఇన్నేళ్ళూ ఎండిపోతన్నం. ఓ కరోనా తల్లీ.. నిన్నే కాదు ఎవ్వర్నెదుర్కోవాలన్నా మళ్ళా భూవుంలు మా సేతుల్లోకే రావాల.... దానికోసం కలబడాల.. నీళ్ళకోసం కలబడాల.., గిట్టుబాటు కోసం కలబడాల.. రైతోడ్ని ముంచీసే అన్ని అన్నేయాల మీదా కలబడాల.. కలబడాల.. కలబడాల.... ఇదే.... కలబళ్ళేదో మన బతుకులు మారవు. ✸

## సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు

## జీవన సాఫల్య పురస్కారం తిరస్కరించిన మరాఠీ రచయిత యశ్వంత మనోహర్

**ప్రసిద్ధ** మరాఠీ దళిత కవి యశ్వంత మనోహర్ (78) విదర్భ సాహిత్య సంఘ్ ఇచ్చే ప్రతిష్ఠాత్మక జీవన సాఫల్య పురస్కారం 'జీవనవ్రతి'ని తాను స్వీకరించలేనని సంఘ్ నిర్వాహకులకు తెలియచేశారు. దానికి ఆయన చెప్పిన కారణాలు ఆసక్తిదాయకంగా వున్నాయి.

విదర్భ సాహిత్య సంఘం (విఎస్ఎస్), అఖిల భారతీయ మరాఠీ సాహిత్య మహామండల్‌కు అనుబంధ సాహిత్య సంస్థ. ఈ మహామండల్‌లో దేశంలో వున్న మరాఠీ సాహిత్య సంఘాలన్నీ సభ్యులుగా వున్నాయి. వి.సా.సం సంస్థాపక దినం జనవరి 14. కోవిడ్ కారణంగా దానిని మార్చి 22న నిర్వహిస్తూ, యశ్వంత మనోహర్‌కు 'జీవనవ్రతి'ని ప్రకటించారు. కాని ఈ సంస్థ ఝాన్సీరాణా స్క్వేర్‌లోని రంగ్ శారదా హాల్‌లో నిర్వహించే ఏ కార్యక్రమానికైనా ముందు వేదికపైనున్న సరస్వతీ పటానికి పూజ చేస్తారు. అయితే విద్యలకు దేవత అని స్తుతించే సరస్వతి స్త్రీలకు, శూద్రులకు చదువును దూరం చేసింది. అదీగాక సాహిత్య కార్యక్రమాలలో మత ప్రసక్తి వుండగూడదు అనే ఖచ్చితమైన అభిప్రాయాలున్న యశ్వంత్ ఆ విషయాలను ప్రస్తావించి ఆ సంస్థ అధ్యక్షుడికి ఉత్తరం రాస్తూ ఆ పద్ధతిలో సభ నిర్వహిస్తే నేను ఆ పురస్కారం అందుకోడానికి రాను అని మర్యాద పూర్వకంగా తెలియచేశారు. సరస్వతి చిత్రం కంటే సావిత్రీబాయి ఫూలే చిత్రాన్నీ, రాజ్యాంగ ప్రతి చిత్రాన్నీ వేదికపై వుంచే విషయం రచయితలు, మేధావులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

అదీగాక ఈ ఉత్తరం రాసిన తరువాత వి.సా. సంఘానికి చెందిన వారెవరైనా కలిస్తే, ఈ ఇబ్బంది నుండి తప్పించుకోడానికి ఏమైనా మార్గాలున్నాయేమోనని వెదికేవాళ్ళం. కాని వారెవరు తనను కలువలేదని చెప్పారు.

1977లో 'ఉత్తన్ గుంఫ్' కవితా సంకలనంతో యశ్వంత్ మరాఠీ కవితాలోకంలో ప్రకంపనలు సృష్టించాడు. అతని కవిత్వం 'పేలుతున్న అగ్నిపర్వతం' అని విమర్శకులు ప్రశంసించారు. ఔరంగాబాద్ యూనివర్సిటీలో ఎమ్.ఏ. మరాఠీ చదివి, నాగపూర్ కళాశాలలో పనిచేశారు. చిన్నతనం నుంచి పేదరికం, ఆకలి అనుభవించిన ఈ కవి తన రచనల్లో మతోన్మాదాన్నీ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థనూ, మూఢనమ్మకాలను, సామాజిక అణచివేతను ప్రశ్నించాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కోరుకున్నాడు. ఆయన 7 కవితా సంపుటులు, 32 సాహిత్య సంబంధిత పుస్తకాలు, 3 నవలలు, 23 విమర్శా గ్రంథాలు, 1 యాత్రా రచన, 3 కల్పనేతర గ్రంథాలు, 4 సంపుటాలు లేఖలు రాశారు. 'రష్యన్ సాహిత్యానికి డాస్కెవిస్కీ ఎలాగో, మరాఠీ సాహిత్యానికి యశ్వంత్ మనోహర్ అలాంటివాడు' అని విమర్శకుల ప్రశంసలందుకున్న యశ్వంత్ 26 మార్చి 1943లో జన్మించారు. ✸

పాట

# కన్నీటి పాట

- గోసల నారాయణస్వామి

ఎరుపునెంతొ నింపుకున్న అచ్చ తెనుగు సింగమా
తల్లి ఒడికి సేరిన మా సీమ కతల సిగినమా
పేదవాడి గొంతుకవై రగిలిన నర సింగమా
తారాతిగడా తెలియని ముక్కు సూటి బానమా
॥ ఎరుపునెంతొ ॥

సీమ నేల సింతలన్ని సెవులగ్గీ ఇన్యావు
సిక్కులన్ని ఇప్పదీసే దావలెన్నో ఎదికినావు
సీమ కరువు యతలన్నీ కతలు కతలుగా మలసీ
సితికి ఉన్న రైతు బతుకు సిత్తరాలు సూపినావు
॥ ఎరుపునెంతొ ॥

తల్లి బాస యాసకు నువ్వచ్చరమై మొలిశావు
పల్లెపదం చెల్లాలను శాసనమై నిలిసినావు
నిత్తెమల్లెపువ్వువై గమగమలను సల్లినావు
ఈన్యాల కతలె గమకాలుగ కులుకించీ మురిసినావు
॥ ఎరుపునెంతొ ॥

పెపంచాన్ని మింగేసే బలిసినోడి యాపారం
పడగల గొడుగుల నడకను నిలదీసిన నిప్పువే
సగటు మనిసి సెమటనంతా దోసుకునే దొంగ దొరల
కుటిలాలను ఎత్తి సూపు సుర కత్తుల గుత్తివే
॥ ఎరుపునెంతొ ॥

గుడ్డి నమ్మకాల గుట్టు ఇప్పిన గురజాడవే
సిరసిరి పైలేకొస్తే శివ తాండవమాడితివే
దోపిడి యాడ్యాడుందో సూపించిన మార్క్స్ వే
ఈన్యాల ఋణం తీర్చుకోను కడదాకా నడిసితివే
॥ ఎరుపునెంతొ ॥

అనంత కతల కిరీటి
సింగమనేని నారాయణ గారు
అందరినీ ఇడిసిపెట్టి అనంత లోకంలోకి అడులేసుకుంటా
ఎబ్బటికీ కనపొడకుండా కదిలెల్లిపోయిన్నాడు మనసు
మూగగా ఏడుత్తా పాడుకోయిండే కన్నీటి పాట

కవిత

# అభద్రత

విరియాల గౌతమ్

**నిష్కర్షగా**
నిష్పూచీగా కాలచక్రం
గొంతును నులిమితే...

రక్తం స్రవించదు కదా..
కంట కన్నీరు కారదు..

కన్న తల్లి
ఏడుపును ఉగ్గబట్టి
పైటతో కళ్ళు తుడుచుకోకపోగా
పైట బిగించి
కవి రచనను
పాడుకుంటూ వచ్చింది
జైలు నుంచి...

స్వరమైన ఆకంఠం
ఆ నినాదం
స్వేచ్ఛాగీతమైంది..
అదే గీతం
పోరాట సాధనమైంది..
విధ్వంసకదార్ల గుండెలలో
నినాదం గుండెచప్పుడైంది..
ఉలిక్కిపడ్డ గుండెలు
కవిని ఖైదు చేసారు..
కంఠానికి ఉరిబిగించారు..

అప్పటికే కవి పాట
ప్రజల నోట మాటైకూర్చుంది
అదే ఆ కవిసందేశం
నేలలో అమరత్వాన్ని నాటిన కవి
ఛాందస శక్తుల మెదళ్లను
అభద్రతలోకి నెట్టేస్తుంది...

# ఖూనీ వైశాఖీ - 1920లో బ్రిటీష్‌వారి నిషేధానికి గురైన నానక్‌సింగ్ పంజాబీ దీర్ఘకవిత

చదివింది నాలుగోతరగతి వరకే కాని తన 12వ ఏటనే 1909లో సిక్కు గురువులపై కవితలు రాసిన నానక్‌సింగ్ (4.7.1897 - 28.12.1971) పంజాబీలో ప్రసిద్ధ నవలా, కథారచయితగా పేరుపొందారు. థర్డ్ ఫారమ్ (8వ తరగతి) వరకే చదివి షేక్స్పియర్‌పై ఇంగ్లీషు గ్రంథాలు రాసిన తెలుగు రచయిత పమిడిముక్కల లక్ష్మీకాంతమోహన్ ఈ సందర్భంగా జ్ఞాపకం రాకమానదు. ఈయనా నవలలు, కథలు, జానపద కళారూపాలు రాశారు. తెలంగాణ రైతాంగ పోరాటంపై నవల రాశారు. 1919 ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ హత్యాకాండకు నానక్‌సింగ్ ప్రత్యక్ష సాక్షి. ఆయన తన ఇద్దరు మిత్రులతో వైశాఖ పండుగ సందర్భంగా అక్కడకు వెళ్ళారు. డయ్యర్ హత్యాకాండలో ఇద్దరు మిత్రులు చనిపోయారు.

నానక్‌సింగ్ 1920లో జలియన్ వాలాబాగ్ హత్యాకాండపై 'ఖూనీ వైశాఖి' అనే 900 పంక్తుల దీర్ఘ కవిత రాసి ప్రచురించగా బ్రిటిష్ ప్రభుత్వం దానిని నిషేధించింది. దాని ప్రతి ఒకటి లండన్‌లో ఇటీవల లభించగా పంజాబీ నుండి దానిని నానక్‌సింగ్ మనమడు నవదీప్‌సూరి ఇంగ్లీషులోకి అనువదించి, దానిని ఏప్రిల్ 13, 2019న విడుదల చేశారు. 25 భాగాలుగా వున్న ఈ దీర్ఘకవితలోని ఐదవ భాగాన్ని **జలియన్ వాలాబాగ్ అమరవీరులకు నివాళులర్పిస్తూ 'ప్రజాసాహితి' పాఠకులకు అందిస్తున్నాం.**

## నిరసనలూ - మార్షల్ లా

జరిగిన సంఘటనలు వారిని నిస్తేజులను చేసింది
వారిని నిరాశోపహతులను చేసింది
తమ దయనీయ స్థితికి విభ్రమ చెందారు, విలపించారు
జారిపోతున్న గుండెలతో చూచారు వారు
ఒక మహత్తర దేశంపై పరుచుకొన్న ఒక మృత్యు ఛాయను
ఆనందం అదృశ్యమై విషాదం మిగిలింది
దైన్యమూ, దుఃఖమూ రాజ్యమంతా పొంచి వున్నాయి
విలపిస్తున్న పక్షిలా దుఃఖిస్తున్నారు
నవ్వడానికి సందేహిస్తున్నారు
పలకరించడానికి భయపడ్తున్నారు
దుకాణాలన్నీ మూతపడ్డాయి
కర్మాగారాలన్నీ ఖాళీగా వున్నాయి
దిక్కుమాలినవారిగా వీధుల్లో వారు వేచి వున్నారు
నగరాలలో, పట్టణాలలో సమ్మెకు పిలుపు
దుఃఖాన్ని అదిమిపట్టి సంచరిస్తున్నారు దీనంగా
భారతమాత వీరపుత్రులు వారు
కన్నీరు కారుస్తూ, భయభ్రాంతులై, ఒంటరులై
సంచరిస్తున్నారు
వారివారి విషాద గాథలను పదేపదే వినిపిస్తున్నారు
ఇతరుల దుఃఖాలతో పోల్చుకుంటున్నారు
ప్రతిమూలా, ప్రతిచోటా చర్చలే చర్చలు!
మరోవైపు దీనికి భిన్నమైన దృశ్యం
చట్టాన్ని చేసిన సంరంభంలో
వారు తమ ఇళ్ళల్లో సంబరాలు చేసుకుంటున్నారు
తాగడానికి, తెగ తినడానికి
అనువైన ఆనందదాయకమైన సమయం ఇది.
దేశద్రోహులు, ఊసరవిల్లులూ, నమ్మకద్రోహులు
పిచ్చాపాటీగా తమ గొప్పలు కథలు కథలుగా
చెప్పుకుంటున్నారు -
మనల్ని 'తిరుగుబాటుదారులు', 'బందిపోట్లు',
'పోకిరీ'లు అని నోరు పారేసుకుంటున్నారు
మన నాయకులపై నేరాల్నీ, రాజద్రోహాన్నీ ఆరోపించి
మన మధ్య ద్వేష బీజాలు వెదజల్లి
మనల్ని విభజించి పాలిస్తూ పాలకులు
చిరునవ్వులు చిందిస్తున్నారు.
సర్ మైకేల్ ఓ డయ్యర్
తన కలాన్ని ఆయుధం చేసి
మార్షల్ లా ప్రకటించాడు
రాష్ట్రాన్ని సైనికమయం చేశాడు
అమాయక యువతను జైళ్ళలోకి నెట్టాడు
వణుకుతున్న నా చేతులు నుండి కలం జారిపోతోంది!
అబ్బ! ఎన్నెన్ని చిత్రవధల గాథలు!
కొరడా దెబ్బలు తిని ఒడ్డున పడ్డ చేపల్లాగా విలవిలలాడిన పిల్లలు
స్థంభాలకు కట్టేసి, ఈత బెత్తాలతో కొట్టారు
వారి లేత శరీరంపై రక్తపు చారికలు
రుధిర ప్రవాహాలు దూకాయి గేటువైపు
తలిదండ్రులు వెదుక్కోడానికొచ్చారు
కాని వారిని వెనక్కి నెట్టేశారు
ఎవరిళ్ళకు వారు పోయి వేచి వుండండి
ఇళ్ళల్లోనే వుండండి - బయటకు వచ్చే ధైర్యం చేయకండి
వస్తే తూటా దెబ్బలే! రాత్రి 8 దాటిన తర్వాత జాగ్రత్త
వాతావరణమంతా శ్మశాన శాంతి ఆవరించింది
అణచుకున్న ఏడ్పులు, మౌన అంతిమ గీతాలు,
అంతర్గత వేదన,
నానక్‌సింగ్‌కు పదాలు బయటకు రావడంలేదు
గొంతు పూడుకుపోతోంది.

**అనువాదం : కొత్తపల్లి రవిబాబు**



## లౌకికవాది, స్త్రీ పక్షపాతి, రచయిత ఐన ఈజిప్ట్‌కు చెందిన

# డాక్టరు నవాల్ ఎల్. సాద్వి మరణం

**స్త్రీల** విముక్తికై ఎంతో సాహిత్యాన్ని సృష్టించి, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, సంప్రదాయ ఛాందస మతాచారాలను వ్యతిరేకించిన నవాల్ ఎల్ సాద్వి కైరోలో తన 89వ ఏట 21-3-2021న మరణించారు. ఆమె 27-10-1931లో పుట్టారు.

ముస్లిం మతాధికారులు ఆమెను మత భ్రష్టురాలుగా ప్రకటించారు. అప్పటి మత సంప్రదాయ ప్రకారం 6వ ఏటనే ఆమెకు సుంతీ చేశారు. తండ్రి పట్టుబట్టి చదివించాడు. 10వ ఏట పెళ్ళి చేయాలన్న ఆచారాన్ని తల్లి ప్రతిఘటించింది. ఆమె అమ్మమ్మ "మగపిల్లవాడు 15 మంది ఆడపిల్లలతో సమానం – ఆడపిల్లలు పంటకు పట్టే తెగులు లాంటివారు" అనడాన్ని వ్యతిరేకించింది. 1955లో కైరో విశ్వవిద్యాలయంలో వైద్యురాలిగా ఉత్తీర్ణత సాధించారు.

సాద్వి, స్త్రీ పురుషులకు మతపరంగా చేసే సుంతీని వ్యతిరేకించారు. మత సంప్రదాయం నిర్దేశించే బురఖాలాంటి దుస్తులకు, ఇతర ఆచార వ్యవహారాలకు వ్యతిరేకంగా క్రియాశీల కార్యకర్తగా ఉద్యమించారు. డాక్టరుగా స్త్రీల భౌతిక, మానసిక సమస్యలన్నిటికీ మూలకారణం అణచివేతకు సంబంధించిన ఆచారాలు, పితృస్వామిక అణచివేత, వర్గ అణచివేత, సామ్రాజ్యవాదపు అణచివేతగా తన నవలల్లో చిత్రించారు.

ఆమె ఈజిప్టు ప్రభుత్వ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. 1972లో 'స్త్రీలు – లైంగికత'పై పుస్తకం రాసినందుకు ఆ పదవి నుండి డిస్మిస్ చేశారు. ఈజిప్ట్ అధ్యక్షుడు అన్వర్ సాదత్ బూటకపు ప్రజాస్వామ్యాన్ని విమర్శించినందుకు ఆమె 1981 సెప్టెంబర్‌లో అరెస్టయ్యారు. సాదత్ హత్యానంతరం (1982లో) ఒక నెలకు విడుదల అయ్యారు. జైల్లో టాయిలెట్ పేపర్‌పై నల్లటి ఐబ్రో పెన్సిల్‌తో రహస్యంగా రచనలు చేశారు. వాటిని 1983లో 'స్త్రీల జైలు నుండి జ్ఞాపకాలు – అనుభవాలు'గా విడుదల చేశారు.

1993లో ఇస్లామిస్టుల దాడి తప్పించుకొని ఈజిప్ట్ వదలి అమెరికా వెళ్ళి, అక్కడ డ్యూక్ విశ్వవిద్యాలయంలోనూ, వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలోనూ, హార్వర్డ్, యేల్, కొలంబియా, సార్బోన్, జార్జిటౌన్, ఫ్లొరిడాలోని స్టేట్ యూనివర్సిటీ, బెర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలలోనూ వివిధ స్థాయిలలో పనిచేశారు. 1996లో ఈజిప్ట్‌కు తిరిగి వెళ్ళారు.

2005లో ఈజిప్ట్ దేశ అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా, అభ్యర్థులకు నిర్దేశించిన నిబంధనల వల్ల పోటీ చేయలేకపోయారు. 2011 ఫిబ్రవరి 8న కైరోలోని తాహిర్ స్క్వేర్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఆమె ఈజిప్టు విద్యాలయాల్లో మతబోధనకు వ్యతిరేకంగా ఉద్యమించారు. 2015లో మక్కా యాత్రికుల తొక్కిసలాటలో వందలాది భక్తులు మరణించడంపై వ్యాఖ్యానిస్తూ 'ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోలేదని' పత్రికలు, ప్రతిపక్షాలు విమర్శిస్తాయి కాని, 'అసలు దయ్యాన్ని తరిమి కొట్టడానికి రాళ్ళు విసిరే మతాచారాన్నీ, అక్కడి నల్లరాతిని ముద్దాడటాన్ని' ఎవరూ ఖండించరేమని ప్రశ్నించారు. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా నాయకత్వాన సాగిన యుద్ధం చమురును దోపిడీ చేయడానికే అని విమర్శించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా సహాయం చేయడమే" అసలు సిసలు ఉగ్రవాదం అన్నారు.

తాను అరబిక్‌లో రాయడం వల్ల సాహిత్యలోకం పట్టించుకోలేదని ఆమె అభిప్రాయపడ్డారు. ఛాందస సంప్రదాయ మతవాదులను బలపరిచే పెట్టుబడిదారీ విధానం వల్లనే స్త్రీల అణచివేత కొనసాగుతోందన్నారు.

1958-2009 మధ్య కాలంలో 11 నవలలు, 8 కథా సంపుటాలు, 3 నాటకాలు, జ్ఞాపకాలు, అనుభవాలు 3 సంపుటులు, స్వీయచరిత్ర మూడు భాగాలు, వ్యాసాలు మొదలగునవి 10 సంపుటులు ప్రచురించారు.

ఎన్నో దేశాల నుంచి బహుమతులు అందుకున్నారు. మూడు ఖండాలలో గౌరవ డాక్టరేట్లు పొందారు. ✷

## ఏడున్నర గంటల నాటక ప్రదర్శనగా 'పర్వ'

**డా॥ యస్.యల్.** భైరప్ప కన్నడంలో మహాభారతం నేపథ్యంలో గాంధారి, కుంతి, ద్రౌపది పాత్రలను మహిళాకోణం నుంచి కేంద్రీకరించి రాసిన 696 పేజీల 'పర్వ'ను మైసూరు రంగాయన సంస్థ నాటకంగా రూపొందించింది. దీని దర్శకుడు అద్దాడ సి. కరియప్ప. మొత్తం 120 పాత్రలను 32 మంది నటులు పోషించిన ఈ నాటకానికి 10 మంది సాంకేతిక నిపుణులు, ఐదుగురు సంగీతకారులు సహకరించారు.

ఆది, నియోగ, యుద్ధ పర్వాలను విడివిడిగా ఒక్కొక్కటి రెండు గంటల నాటకంగా మూడు నాటకాలు గురువారం నుండి శనివారం వరకూ, మొత్తం నాటకం ఆదివారాల్లోనూ ప్రదర్శిస్తున్నారు. ఈ ఏడున్నర గంటల నాటకానికి మూడు అల్పాహార విరామాలు, ఒక భోజన విరామం ఏర్పాటుచేశారు. మార్చి 12 నుండి మైసూరులోని 800 సీట్లు గల కళామందిర్‌లో కిక్కిరిసిన ప్రేక్షకులతో ఈ ప్రదర్శనలు సాగుతున్నాయి.

కర్నాటక ప్రభుత్వం ఈ నాటక ప్రదర్శనలకు కోటి రూపాయలు గ్రాంటు ఇచ్చింది. ✷

# ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

## సంపుటి : 14, సంచిక : 9, ఏప్రియల్ 1991

**'మహిళ నాడు'** ముఖచిత్రంతో 'ప్రజాతంత్ర విప్లవంలో అంతర్భాగం స్త్రీ విముక్తి!!" సంపాదకీయంతో ఈ సంచిక వెలువడింది. రెండవ అట్టమీద విమల 'వంటిల్లు' కవిత, మూడవ అట్టమీద ఛాయరాజ్ 'ఆమె' కవితను, నాలుగవ అట్టమీద ఆర్టిస్టు శ్యాంమోహన్ అనుకృతి, రంగుల సమ్మేళనం చేసిన 'మహిళ నేడు' చిత్రాన్ని ప్రచురించారు. ఈ సంచికలో 'మతతత్త్వ వ్యతిరేక పోరాట సాహిత్యం' శీర్షికలో వి.ఆర్. కృష్ణయ్యర్ రాసిన 'రాజ్యాంగపర సెక్యులరిజం – రాజకీయ మతతత్త్వం' వ్యాసాన్ని కె.పి. అనువదించారు. ఫిదాయి రాసిన 'మరో జాతీయోద్యమం' గత సంచిక తర్వాత భాగాన్ని, ప్రయాణిక్ రాసిన 'హైదరాబాద్ మత కల్లోలాలు' వ్యాసాన్ని, 'భారత ప్రజల తరపున జాతీయ జనతా పార్టీ మీద ఆరోపణలు చేస్తూ, ఆ పార్టీ కేంద్రకమిటీకి మతతత్త్వ వ్యతిరేక వేదిక (న్యూఢిల్లీ), మహిళా సంఘటన (అజ్మీర్), సహేలి (ఢిల్లీ), సమతా సంఘటన (పిపరియా), వెట్టి విముక్తి ఫ్రంట్, జనచేతనామంచ్ (ధన్‌బాద్), అంకుర్ (ఢిల్లీ), అలారిపు (ఢిల్లీ), నిష్యాంత్ నాట్యమంచ్ (న్యూఢిల్లీ), మొదలైన 27 సంస్థలు అందచేసిన చార్జిషీటు పత్రాన్ని ప్రచురించారు.

ఈ మహిళాసంచిక కోసం మావో–సే–టుంగ్ రాసిన 'ప్రాచీన ఆరాధనాలయాల, ధర్మకర్తల, వంశపెద్దల, నగర గ్రామదేవతల, మతాధికార సంస్థల పెత్తనాన్ని, భార్యలపై భర్తల పెత్తనాన్ని తుదముట్టించడం' అనే వ్యాసాన్ని 'సంస్మరణ' శీర్షికలో గోదావరి రాసిన 'సంగం సోమయ్యగారికి ఎర్రెర్రని దండాలు'ను ప్రచురించారు. గంగినేని వెంకటేశ్వరరావు రాసిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట గిరిజన యువతి వీరగాథ 'ఒక లోకమాత'ను, 'కరపత్రాలు – కదిలేచరిత్ర' శీర్షికలో ప్రగతిశీల మహిళాసంఘం (స్త్రీ విముక్తి) ఏప్రిల్ 10, 11 తారీఖుల్లో వరంగల్‌లో జరుపుకున్న 2వ రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని ప్రచురించారు.

'వార్తల్లో మహిళ' శీర్షికలో 1990 డిశెంబరు 28–31లలో కేరళలోని కోజికోడ్‌లో జరిగిన 'స్త్రీ ఉద్యమ సంస్థల నాల్గవ జాతీయ కాన్ఫరెన్స్ వివరాలను, అరుణ రాసిన 'మాతృత్వ భావజాలంతో అణచివేతనూ, స్త్రీవాదం పేరుతో విశృంఖలత్వాన్ని ప్రచారం చేస్తున్న 'అమ్మ' – సినిమా సమీక్షను, 'చారిత్రక లేఖ' శీర్షికలో వేమన వసంతలక్ష్మి అనువాదం చేసిన 'దుశ్శాసనాలు' పుస్తకం నుండి 'న్యాయశాఖ మంత్రి పదవికి డా॥ అంబేద్కర్ రాజీనామా లేఖనూ', 'పుస్తక సమీక్ష' శీర్షికలో చండిక రాసిన 'అనుభవాల చరిత్ర పేరిట కమ్యూనిజంపై నిందా ప్రచారం' వ్యాసాన్నీ, జి.వి. భద్రంగారు రాసిన 'స్వేచ్ఛా! నీ పయనం ఎందాక?' కథనూ, 'కవిత' శీర్షికలో మయకోవస్కీ రాసిన సూర్యసాగర్ అనువదించిన రష్యన్ కవిత 'కమ్యూనిస్టులం మేము', నిరంకుశ్ రాసిన 'కల్లోల స్మృతి', వి.ఆర్. శర్మ రాసిన 'యుద్ధం ఐపోలేదు!', శ్రామిక రాసిన 'ఆయుధాలై సాగుతాం', కాట్రగడ్డ దయానంద్ రాసిన 'నిరీక్షిస్తూ.... నిరీక్షిస్తూ....', చెరబండరాజు రాసిన 'అగ్ని పుత్రులం' కవితలను ప్రచురించారు. జయలక్ష్మి రాసిన 'జోహార్లు కామ్రేడ్ సోమయ్య' పాటను, సిద్ధూ, సుబ్బారావు రాసిన 'తల్లీ! చెల్లీ!' పాటను, క్రాంతి కిరణ్ రాసిన పాట కథ 'పూర్ణిమ'ను, అఫ్సర్ అనువాదం చేసిన హిందీ కవిత 'మా ఆవిడ చనిపోయినపుడు' కవితలను ప్రచురించారు. 1/8 డెమ్మీలో 100 పుటలు. వెల : రూ. 4/–


ఈ నెల పుస్తకం




## మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ

### అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం

## కుల వ్యవస్థ – శాస్త్రీయ అవగాహన

### పి.డి.ఎస్.ఓ. ప్రచురణ

ప్రజల్ని కులాలుగా చీల్చి దోపిడీ చేయటానికి, పీడించటానికి – భూస్వాములకు, అగ్రకుల పెత్తందార్లకు కులవ్యవస్థ ఒక సాధనంగా వుంది. ఈ కులవ్యవస్థ గురించి శాస్త్రీయ అవగాహన కల్పించటంలో భాగంగా పి.డి.ఎస్.ఓ. విద్యార్థి సంఘం ఈ చిన్ని పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో కులవ్యవస్థ – శాస్త్రీయ అవగాహన, దళితులపై దాడులకు ఫ్యూడల్ సామాజిక ఆర్థికవ్యవస్థలో మూలాలు, కులవ్యవస్థ – శాస్త్రీయ అవగాహన నేపథ్యం.... వ్యాసాలున్నాయి.

1/8 డెమ్మీలో 28 పుటలు. వెల : రూ. 5/– ప్రచురణ : పి.డి.ఎస్.ఓ.

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ – 520002. ఫోన్ : 86393 14662**

# చైతన్యవాహిని

**8 మార్చి 2021అనంతపురంలో** సింగమనేని నారాయణ సంస్మరణసభ జరిగింది.

జనసాహితి, స్త్రీ విముక్తి సంఘటన, IFTU(N) ఆధ్వర్యంలో మార్చి 8న సింగమనేని సంస్మరణలో కా॥ తరిమెల నాగిరెడ్డి శ్రామిక భవనంలో కా॥ సరిత అధ్యక్షతన సభ జరిగింది. కా॥ సూర్యసాగర్, పెద్దన్న IFTU(N), సయ్యద్ బాషా, చంద్రశేఖర్ (మానవ హక్కుల వేదిక), చంద్ర (రైతుకూలీసంఘం) ప్రసంగించారు.

అనంతపురం జిల్లా బండమీదపల్లెలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన సింగమనేని తిరుపతిలో విద్వాన్ కోర్సు చదివే కాలంలో మార్క్సిజం ప్రభావంలోకి వచ్చారు. ఆయన అరవైకి పైగా కథలు రాశారు. ఆయన తొలి సలక్షణమైన కథ "జూదం" అనంత కథాసాహిత్యానికి దారి దీపంగా వెలిగింది. 1978లో 'ప్రజాసాహితి' పత్రికలో అచ్చయింది. కరువు పీడిత అనంతపురం జిల్లా రైతాంగ వేదనలను ఆయన తన కథల్లో చిత్రించారు. మహిళలను పీడిస్తున్న సామాజిక, సాంస్కృతిక సమస్యలను, వారి స్వేచ్ఛాకాంక్షలను చాలా కథల్లో అక్షరబద్ధం చేశారు. ఉపాధ్యాయవృత్తిలోని అనుభవంతో విద్యారంగ రుగ్మతలను వెల్లడి చేశారు. మాతృభాషలో విద్యాబోధన సాధనకై జనసాహితితో కలసి కృషిచేశారు. తన అద్భుత ఉపన్యాసాల ద్వారా ప్రజాతంత్ర, జాతీయ విలువల వ్యాప్తికి కృషిచేశారు. అనంతపురం సాగునీటి సాధన ఉద్యమంలో ముందు పీఠిన వుండి పాల్గొన్నారు. సమాజంలోనూ, సాహిత్యంలోనూ ప్రజాతంత్ర విలువలు, ఆచరణల సాధన కోసం ఆయన నిరంతరం కృషి చేశారని వక్తలు నివాళులర్పించారు. ఆ సభ సందర్భంగా ఆయన జీవితము, సాహిత్య సామాజిక కృషిని తెలుపుతూ కరపత్రం వేసి ప్రజల్లో పంచారు.

**13-3-2021న జనసాహితి శ్రీకాకుళం జిల్లా శాఖ** ఆధ్వర్యంలో 'ప్రజల ఆస్తి - విశాఖ ఉక్కు ప్రభుతకు లేదు - అమ్మే హక్కు' చర్చా కార్యక్రమం ప్రజాసాహితి నాగరాజు అధ్యక్షతన ఏపిటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటుపరం చేయడం సరైంది కాదని, ఎన్నో త్యాగాలతో, ఉద్యమాలతో స్థాపించబడిన ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని జనసాహితి జిల్లా కార్యదర్శి పి. మోహన్‌రావు తెలిపారు. 1992 నుండి నూతన ఆర్థిక విధానాల కారణంగా ఏర్పడిన ప్రైవేటీకరణ భారతదేశ పరిశ్రమలను సర్వనాశనం చేసుకుంటూ వచ్చిందని, ఒక ప్రక్క నిరుద్యోగం మరొక ప్రక్క ఉద్యోగాల తొలగింపు జరుపుకుంటూ వచ్చిందని, ఈరోజు ఉత్తర భారతంలో వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడానికి రైతు ఉద్యమం, దక్షిణ భారతంలో విశాఖ ఉక్కు ఉద్యమం జరుగుతోందని, మేధావి వర్గం నిరసన ఉద్యమంలో పాల్గొనాల్సిన అవసరం ఉందని చర్చావేదిక అధ్యక్షులు ప్రజాసాహితి నాగరాజు తెలిపారు. ప్రభుత్వాలు వ్యాపారం చేసేవారికి పరిశ్రమలన్నీ కట్టపెడతామని చెప్పడం సామాజిక బాధ్యత లేకపోవడమేనని విశాఖ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న రంగారావు భాగవతార్ వివరించారు. జనసాహితి బాధ్యులు చావలి శ్రీనివాస్ మాట్లాడుతూ - కరోనాకు ముందు ఆ తర్వాత దేశంలో పరిస్థితి ఎంత దిగజారిందో ఉదహరిస్తూ, ప్రభుత్వరంగ సామాజిక బాధ్యతను స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్. శంకర్రావు, కంచరాన భుజంగరావు, దాసరి రామ్మోహన్, పైడి శ్రీరామమూర్తి, రైతుకూలీ సంఘం బాధ్యులు మొదలగువారు పాల్గొన్నారు.

**14 మార్చి 2021 వేమన అధ్యయన మరియు అభివృద్ధి కేంద్రమూ, రాయలసీమ సాంస్కృతిక వేదిక తరపున** నిర్వహించిన వెబినార్‌లో 'శ్రీ సింగమనేని నారాయణ సాహిత్యం - మౌలిక భావనలు' అనే అంశంపై జనసాహితి సూర్యసాగర్‌గారు మాట్లాడారు.

సింగమనేని జనసాహితి మొదటి కార్యవర్గసభ్యుడనీ ఆయన మొదటి కథ, మొదటి సాహిత్యవిమర్శ 'ప్రజాసాహితి'లోనే ప్రచురించామని గుర్తుచేశారు. సింగమనేని తొలి కథ 'జూదం'తో అనంతపురం తెలుగు సాహిత్యానికి, సాహిత్య మార్గాన్ని, రూపం, వస్తువు, సాహిత్యం ఎవరి పక్షాన నిలబడాలో తెలియచేసిందన్నారు. కేవలం రాయటమే కాకుండా సాహిత్యకారుడిగా, నాయకుడిగా, ఉపాధ్యాయుడిగా సాహిత్య బృందాన్ని తయరుచేయటానికి ఆయన నిరంతరం కృషిచేశారు. యువ రచయితలను, కథారచయితలను మార్క్సిస్టు భావజాలపు వెలుగులో సాహిత్యకారులుగా తయారుకావటానికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. ఆధునికత గురించి వివరిస్తూ సింగమనేని గురజాడ శ్రీశ్రీ కంటే ఆధునికుడని అనేవారన్నారు. గురజాడ రచనల నిండా ఆధునికత చోటు చేసుకుందనీ, గురజాడ తర్వాత వందేళ్ళయినా ఇంకా ఆధునికత రాకపోవటానికి కారణం ఇక్కడ ఫ్యూడల్ వ్యవస్థతో ఆధునిక భావాలు అంటగట్టబడటమే అని అన్నారు. ఆయన రాయలసీమ రైతాంగ సమస్యల గురించే కాకుండా అక్కడ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులన్నింటినీ ప్రతిఫలించాయన్నారు. ముఖ్యంగా ఆయన కథల్లో స్త్రీ పాత్రలు సొంత వ్యక్తిత్వంతో మార్గదర్శకంగా వుంటాయన్నారు. సింగరాజు రామకృష్ణయ్య నాయకత్వపు ఏపిటిఎఫ్‌లో ఆయన పనిచేశారనీ - ఆయన విద్యారంగ సమస్యలనూ, వాటి మూలాలనీ చిత్రిస్తూ అనేక కథలు రాశారన్నారు. 'కథకులు - కథనరీతులు' - అనే 4 భాగాలను ప్రచురించారనీ, ప్రపంచంలో 'ఏ భాషకీ జరగని గౌరవం ఈ సంకలనాల ద్వారా జరిగాయని' వల్లంపాటి వెంకటసుబ్బయ్య అన్నారని గుర్తుచేశారు. గొప్ప ఉపన్యాసకుడు, సాహిత్యకారుడు, సాహిత్య విమర్శకుడు, ఉపాధ్యాయుడు అయిన సింగమనేని ప్రస్తుత రైతాంగం ఎదుర్కొంటున్న అత్యంత సంక్షోభ కాలంలో మనల్ని వీడి వెళ్ళిపోవటం బాధాకరమన్నారు. సమష్టిగా - ఆయన చేసిన సాహిత్య కృషిని ముందుకు తీసుకు వెళతామన్నారు.




**కులం – బహుజన ప్రజాస్వామిక విప్లవ దశ (వ్యాసాల సంకలనం) : రచన – పట్టా వెంకటేశ్వర్లు**

వివిధ పత్రికల్లో వెంకటేశ్వర్లుగారు రాసిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం. 'పునాది వర్గాన్ని (ముఖ్యంగా దళితులను) సమీకరించకుండా, వారి ఆర్థిక, రాజకీయ, సామాజిక డిమాండ్లను ప్రథమ స్థాయిలో వుంచని ఏ పార్టీ విప్లవపార్టీగా మనజాలదు' అంటూ కులం – వర్గాలకు సంబంధించిన ఆయన అధ్యయన అవగాహనను ఈ పుస్తకంలో తెలియచేశారు. ఈ పుస్తకంలోని వ్యాసాలను నాలుగు భాగాలుగా విభజించారు. కుల నిర్మూలనకు సంబంధించి రచయిత మార్క్సిస్ట్ అవగాహనను, కులంపై వాద, ప్రతివాదనలను, దళిత బహుజన మేధావుల కుల–వర్గ జమిలి పోరాటాల ప్రతిపాదనలో వున్న గందరగోళం గురించి, కులంపై కమ్యూనిస్టుల కార్యక్రమం, వారి పోరాట పద్ధతుల గురించీ, హిందుత్వంపై మత సాంస్కృతిక భావజాల రంగాలలో జరగాల్సిన వర్గపోరాటం ఎలా వుండాలో సూచిస్తూ వ్యాసాలున్నాయి.

1/8 డెమ్మీ 78 పుటలు. వెల : రూ.80/– చక్ర పబ్లికేషన్స్ ప్రచురణ. మొదటి ముద్రణ : మార్చి 2019, ప్రతులకు : జె. క్రిష్టా నాగమణి, ప్లాట్ నెం : 301, క్రియేటల్ మధు ప్లాజా, ఇం.నెం. 12–13–481, వీధి నెం : 1, తార్నాక, సికింద్రాబాద్–17, సెల్ : 99596 49097, 99083 08441.

**బుద్ధభూమి కథలు : రచన – డి. నటరాజ్**

'బుద్ధభూమి' మాసపత్రికలో వచ్చిన కథలనూ మరి కొన్ని వ్యాసాలతోనూ ప్రచురించిన గ్రంథం ఇది. దీనిలో 25 కథలున్నాయి.

1/8 డెమ్మీలో 112 పుటలు. వెల : రూ. 100/– పల్లవి పబ్లికేషన్స్ ప్రచురణ. ప్రథమ ముద్రణ : పుష్యమాస పున్నమి 2019. ప్రతులకు : రచయిత – డి. నటరాజ్ – 94404 28595, E-mail : dnataraj56@gmail.com

**యానాం కవితలు (కవితా సంకలనం) : రచన – శిఖామణి**

శిఖామణిగారు తను పుట్టిన వూరు యానాంతో అల్లుకున్న అనుబంధాలను సృజిస్తూ రాసిన 46 కవితల సంకలనం ఇది. ఈ కవితలు – రచయిత కుటుంబ వాతావరణాన్ని, అతను పెరిగిన, అతన్ని పెంచిన ఆదియాంధ్ర పేట జీవితాన్ని, యానాం సమాజపు పౌర సాన్నిహిత్యాన్ని పట్టి ఇస్తాయి. 'కవిసంధ్య' పత్రికలో 'కవిత చెప్పని కథ' శీర్షికలో శిఖామణి రాసిన కొన్ని కవితలనూ ఇందులో పొందుపర్చారు.

1/8 డెమ్మీలో 207 పుటలు. వెల : రూ. 150/– మొదటి ముద్రణ : 30 నవంబర్ 2019. "కవి సంధ్య" గ్రంథమాల ప్రచురణ. ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ – విజయవాడ, నవోదయ బుక్‌హౌస్ – హైదరాబాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ – విజయవాడ.

శిఖామణి, ఫ్లాట్ నెం : 61, ఫ్లాట్ నెం : 10, సిద్ధార్థ అపార్టుమెంట్స్, సిద్ధార్థ నగర్, వెంగళరావు నగర్, హైదరాబాద్ – 500038, ఫోన్ : 98482 02526.

**ఒక ఆదివారం సాయంత్రం, ఇంకా ఇతర కవితలు (కవితా సంకలనం) : రచన – విజయ్ కోగంటి**

కోగంటి విజయ్ రెండవ కవితాసంపుటి ఇది. 'ఈ మాట', 'రస్తా', 'వాకిలి', 'సారంగ', 'సాహిత్య ప్రస్థానం', 'చినుకు', 'ప్రజాసాహితి' మొదలైన పత్రికలలో వచ్చిన 51 కవితలను సంకలనంగా తీసుకు వచ్చారు. ముందుమాట రాసిన డా॥ పాపినేని శివశంకర్ మాటల్లో 'మనిషి మరచిన ఆనందపు రహస్యాన్ని' వెల్లడించటానికి తానొక 'కవితా వాక్యాన్ని కావాలి' అని కోరుకుంటున్న విజయ్ కవిత్వం కొన్ని బహిరంగ సమస్యల గురించే కాక మనిషి అంతర్గత విషయాల గురించీ ప్రధానంగా పట్టించుకుంది.

1/8 డెమ్మీలో 96 పుటలు. వెల : రూ. 130/– ప్రచురణ కాలం : జనవరి 2020. ప్రతులకు : విశాలాంధ్ర అన్ని పుస్తకాల షాపుల్లోనూ మరియు డా॥ కోగంటి విజయ్‌బాబు, 26–38–143, కావ్య హౌస్, 3వ లైను, శ్రీరామనగర్, గుంటూరు – 522004. మొబైల్ : 88018 23244.

**తెలుగు విలాపం : రచన – అడపా రామకృష్ణ**

కవితల, వ్యాసాల సంకలనం ఇది. తెలుగు భాష మనుగడ కోసం అడపా రామకృష్ణగారు ఈ సంకలనం చేశారు.

1/8 డెమ్మీ, 42 పుటలు. వెల : రూ.50/– మొదటి ముద్రణ : 2020. ప్రచురణ : విశాఖ రచయితల సంఘం, ప్రతులకు : అడపా రామకృష్ణ, 43–21–21, వి.ఆర్.నగర్, దొండపర్తి, విశాఖపట్నం – 530016. మొబైల్ : 95052 69091.

**'పల్నాటి పోతన' – శ్రీ చిరుమామిళ్ళ సుబ్బయ్యస్వామి జీవిత చరిత్ర : కూర్పు – రావెల సాంబశివరావు**

1802లో జన్మించినట్లుగా చెప్పబడుతున్న సుబ్బయ్యస్వామి – ఎనిమిది శతకాలనూ, 2 యక్షగానాలను, 3 ద్విపద కావ్యాలునూ, 4 నానార్థస్తవములు (167 కంద పద్యములు) 5 సుగుణతత్త్వ కందార్ధ దరువులు (172 కందాలు) వీటితోపాటుగా సీసమాలికలు, ఉత్పల మాలికలు, జోలపాటలు, దరువులు, చూర్ణికలు, స్తవాలు, మంగళ హారతులు, కీర్తనలు రచించిన వాగ్గేయకారుడు. వారి జీవిత చరిత్రనూ, సాహిత్యసేవనూ, పలనాటి చరిత్రనూ, వంశవృక్షాన్ని మొదలైన అంశాలతో కూడిన రచన ఇది.

1/8 డెమ్మీలో 64 పుటలు. వెల : రూ. 90/– మొదటి ముద్రణ: 2019 జనవరి. ప్రచురణ : సంస్కార ఫౌండేషన్. ప్రతులకు : విశాలాంధ్ర వారి అన్ని పుస్తకాల షాపుల్లోనూ మరియు ముప్పవరపు భవానీ చౌదరి, 24–1, కచేరీ సెంటర్ దగ్గర, యనమలకుదురు, విజయవాడ – 520007. మొబైల్ : 81799 59619. **(ఇంకా వున్నాయి)** ✹

కవిత

# పాండిత్య ప్రశంస

ఆంగ్లం : బెర్టోల్ట్ బ్రెష్ట్

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

నాయకత్వం స్వీకరించినవారిని
ఆపాదమస్తకం అధ్యయనం చేయ్
ఇంకా సమయం మించిపోలేదు.
అ ఆ లు నేర్చుకో; అయితే అవి చాలవు
కాని వాటిని నేర్చుకోవడం తప్పనిసరి
ప్రారంభించు - నిరుత్సాహాన్ని దరిచేరనీయకు
సమస్తం తెలుసుకోవాలి నీవు
ఇప్పుడు - నాయకునిగా తయారవ్వు!
ప్రవాసంలో వున్నవారిని అర్థం చేసుకో!
కారాగారంలో మ్రగ్గుతున్నవారిని అధ్యయనం చేయ్!
వంటింట్లో నీ భార్య అంతరంగాన్ని చదువు!
వృద్ధ పింఛనుదారుడి హృదయం తెలుసుకో!
నాయకుడిగా నిలబడటానికి ఇప్పుడు తయారు కా!
ఏదైనా ఒక స్కూలు ఎంచుకో -
గూడులేని ప్రజలను ఎంచుకో!

అలా బిగుసుకుపోకు - ఏదైనా కొంత జ్ఞానాన్ని వెదుకు పో!
ఆకలితో నకనకలాడే నీవు
ఏదైనా పుస్తకం పట్టుకో -
అది నీకు ఆయుధమవుతుంది.
నాయకునిగా ముందుండటానికి తయారుగా వుండు
ప్రశ్నించడానికి భయపడకండి - "కామ్రేడ్స్!
నీవు చూచేదాకా
భక్తితో నమ్మకు దేనినీ -
నీ అంతట నీవు నేర్చుకోలేనిదాన్ని
తెలుసుకోలేవు ఎన్నటికీ -
లెక్కలన్నిటినీ ప్రశ్నించు
నీవే చెల్లించాలి వాటిని
ఎంత చిన్నదైనా సరే - జాగ్రత్తగా చూడు
ఇదెక్కడి నుంచి వచ్చిందని అడుగు!
నాయకత్వం వహించడానికి తయారవ్వు - కామ్రేడ్!

(1931లో ఇది రాసేనాటికి హిట్లర్ అధికారంలోకి రాబోతున్న రోజులు)

కవిత

# ఎర్రెర్రని కెరటాలై

– మౌళి

కదలండి.. ఉరకండీ..
ఉక్కు ఉద్యమకిరణాల్లారా..
పోరుబాటన నిప్పుకణికల్లారా..

అలముకునే ధనస్వామ్యపు చీకటిపై
తూరుపు ఎరుపెత్తిన కిరణాలై
పెత్తందారుల పెనుమబ్బులపై
చెల్లాచెదురున చీల్చే నిప్పులసెగలై
రాజరికపు అక్రమాలఎత్తులపై
కుళ్లగించి పెళ్లగించి
సుళ్ళుతిరుగు ఉప్పెనలై..
కదలండి.. ఉరకండీ..

ఒకటేమాట.. ఒకటే దీక్ష..
దశాబ్దాల చరితగన్న మహాఉక్కు
పునాదులను కుదుపుతున్న కుట్రలపై
వేలకొలది కార్మికులకు కడుపునింపు జీవముత్తై
తిరగబడే సింగాలై, ఝుళించే మృదంగాలై..
కంటిచూపు అగ్నికేళికెరటాలై
కణకణ మండే గుండె ఘోషనిప్పులై
కదలండి.. ఉరకండీ..

రాజకీయ అధిపత్య క్రీడల్లో
బలిపశువులు కార్మికులా..
పెట్టుబడుల వర్గాలతో
కుమ్మక్కుల జిమ్మిక్కుల్లో
కూలిజనులు కన్నీళ్లా..
కర్మాగారం కాదది.. వేలమంది రుధిరకేంద్రసన్నిధది..
రక్తంతో నడిపారు ఇన్నాళ్లు
ప్రాణంగా చూసారు ఇన్నేళ్లు
కట్టెదుటే అరుణారుణ వైకుంఠం కూలిపోతె , తూలిపోతె..
ఎలా ఊరుకుంటారు.. ఎలా వదులుకుంటారు..

మహాప్రాణదీపాన్ని నిలబెట్టే నిశ్చయంతో పోరుబాట సాగగా..
పరవళ్లై పారగా..
పెల్లుబికే నిరసనలతో సవాళ్ళనెల్ల ఎదుర్కొనుచు
నినదిస్తూ.. నిందిస్తూ.. ఢీకొడుతూ.. ఢీకొడుతూ..
పోటెత్తే ఉద్యమమై
ఉవ్వెత్తున ప్రభంజనమై
ఎగసిపడే సాగరమై
కదలండి.. ఉరకండీ..

పైశాచిక ఆనందం ఎన్నాళ్లుసాగదులే..
కర్మశాల కార్మికుడు ఏనాడూ ఓడడులే..
ప్రభుత్వాలు పోయినా, నాయకులే రాలినా..
ఎర్రెర్రని జెండాలో దగద్దగలు నిలుచునులే..
కార్మిక ఐక్యత గెలుచునులే..
పోరాటమెపుడు నిలుచునులే
చెక్కుచెదరని దీక్షఫలించేనులే
ఉక్కునగరం మరల మెరిసేనులే..

PRAJAA SAAHITHI April, 2021 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI